




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా...
క్రీడావిధానం రూపకల్పన



03


సంపుటి 07, సంచిక: 333 | సోమవారం | 04-11-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## త్వరలోనే నూతన
# విద్యుత్ పాలసీ

- నిష్ణాతులు, మేధావులు, ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ
- అసెంబ్లీలో చర్చించి కొత్త విధానం ప్రకటన
- 2025 మే నాటికి యాదాద్రి పవర్‌ప్లాంట్ ద్వారా 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలిసి యాదాద్రి పవర్‌ప్లాంట్ పరిశీలన



ప్రజాపక్షం/ మిర్యాలగూడ

విద్యుత్ నిష్ణాతులు, మేధావులు, ప్రజల అభిప్రాయంతో అసెంబ్లీలో చర్చించి త్వరలో తెలంగాణ రాష్ట్రంలో నూతన ఎనర్జీ పాలసీని ప్రకటిస్తామని రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డుభవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి యూనిట్ 1 సింక్రనైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో వైటిపిఎస్ యూనిట్ 2 సింక్రనైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ 2025 మే నాటికి యాదాద్రి పవర్ ప్లాంట్ ద్వారా పూర్తి స్థాయిలో 4వేల మెగావాట్ల విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ నిష్ణాతులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలందరి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోని అసెంబ్లీలో చర్చించిన తరువాత అందరి అభిప్రాయాలతో నూతన ఎనర్జీ పాలసీని ప్రకటించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పవర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పాదనను చేపడుతున్నామని, 2028–29 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 22,488 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండవచ్చని అంచనాలను రూపొందించడం జరిగిందని, 2034–35 నాటికి 31,809 మెగావాట్ల డిమాండ్‌కు పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పాదన పెంచుతూ రాష్ట్రం

తరువాయి 2లో



# బిసి రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్

- హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నేటిలోగా ఏర్పాటు చేయాలి
- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కులగణన చేపడుతున్న నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు బిసి రిజర్వేషన్ల ఖరారుకుగాను ప్రత్యేకంగా డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను అదేశించారు. కుల గణన తర్వాత స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు ప్రభుత్వం ఆలోచన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఆధ్వర్యంలో కాకుండా ఇందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని అప్పుడే వీటికి పారదర్శకత ఉంటుందని, ఆ దీశగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు అదేశించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఈ నెల 6 నుంచి కులగణన చేపట్టనుండడంతో హైకోర్టు అదేశాల మేరకు సోమవారం నాటికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు పూర్తి చేయాల్సిందిగా సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను అదేశించారు. ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటుపై సమిక్షించారు. ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహాలతో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కులగణనకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బిసి కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మరోసారి స్పష్టం చేశారు. కులగణనపై ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని, అనుకున్న సమయానికి ఈ ప్రక్రియను ఎట్టి పరిస్థితులో పూర్తి చేస్తామని చెప్పారు.



## బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి
# ఎంతైనా ఖర్చుచేస్తాం

- సూర్యాపేట జిల్లా గడ్డిపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన మంత్రులు భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్

యావత్ తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో సర్వేనెంబర్ 57లోని 25.21 ఎకరాలలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి భారీనీటిపారుదల,పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి,

తరువాయి 2లో



నేడు హైదరాబాద్‌లో జరగనున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా పాల్గొననున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో డి.రాజాకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో జరగనున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో డి.రాజా పాల్గొననున్నారు. డిసెంబర్‌లో జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర పార్టీకి ఆయన మార్గ నిర్దేశనం చేయనున్నారు.

## రెండవ రాజధానిగా
# ఓరుగల్లు అభివృద్ధి



- అందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం
- ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకొస్తాం
- సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి

వరంగల్ మహా నగరాన్ని రెండవ రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్యలతో కలిసి వరంగల్ నగరంలోని భద్రకాళీ బండ్ సుందరీకరణ పనులను, భద్రకాళీ చెరువు, బొంది వాగు వరద నివారణ పనులను, నిర్మిస్తున్న భద్రకాళీ మాడ వీధులను పరిశీలించి పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళీ చెరువు, బొంది వాగు వరద నివారణకు ప్రభుత్వం రూ.158 కోట్లు మంజూరు చేసిందని, బొంది వాగు నాలా, భద్రకాళీ నాలా, భద్రకాళీ క్యాష్మెంట్ ఏరియాలలో చేపట్టే వరద నివారణకు సంబంధించిన అభివృద్ధి పనుల మ్యాప్‌ను మంత్రి పరిశీలించి, వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా ఆయా పనులు నిర్వహించాలని మంత్రి తగు సూచనలు చేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ క్రీస్తుపూర్వం 600 ఏళ్ల క్రింద నిర్మించిన భద్రకాళీ అమ్మవారి దేవాలయానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఖమం, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుండి భక్తులు వస్తారని, ఈ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వరంగల్ సమగ్రాభివృద్ధి చర్యల్లో భాగంగా భక్తుల అభిరుచికి అనుగుణంగా భద్రకాళీ ఆలయం, మాడ వీధులను ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆలయాన్ని అనుకొని ఉన్న చెరువును అభివృద్ధి చేయడానికి పరిశీలించడం జరిగిందన్నారు. సుమారు 380 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు పూడిక పేరుకుపోయి, చెరువు లోతు తగ్గి సమాంతరంగా మారడం కారణంగా నీరు నిలువ సామర్థ్యం

తరువాయి 2లో

# 8న యాదగిరిగుట్టకు సిఎం రేవంత్



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి ఈ నెల 8వ తేదీన తన పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి యాదగిరి గుట్ట సందర్శన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. స్థానిక ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సిఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా యాదగిరి గుట్ట వద్ద హెలిప్యాడ్ ను అధికారులతో కలిసి

తరువాయి 2లో



# సలహాలు, సూచనలివ్వండి

- కులగణనపై మేధావులకు టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ విజ్ఞప్తి
- ప్రభుత్వం చేపట్టనున్న ఈ కార్యక్రమం దేశానికి ఆదర్శంగా ఉండనుందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న కుల గణన దేశానికే ఆదర్శంగా ఉండనుందని టిపిపిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇందుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని మేధావులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కులగణన చేపట్టనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి కార్యాచరణలో భాగంగా 5వ తేదీన హైదరాబాద్ లో జరగనున్న కుల గణన సంప్రదింపుల సదస్సును నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ఎఐసిసి అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్షనాయకులు రాహుల్ గాంధీ హాజరుకానుండడంతో ఆదివారం నాంపల్లిలోని ఇందిరా భవన్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ వర్గాల బిసి మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎఐసిపి జాతీయ నాయకులు కొప్పుల రాజు, ఎంపిలు అనిల్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి, కోట నీలిమ, పవన్ మల్లాది, బెల్లయ్య నాయక్, కొత్వాల్, మెట్టు సాయి, చరణ్ కౌశిక్, మల్‌రెడ్డి రాం రెడ్డి, జస్టిస్ చంద్ర కుమార్, ప్రొఫెసర్ విశ్వేశ్వర రావ్, ప్రొఫెసర్ సింహాద్రి,ప్రొఫెసర్ వెంకట నారాయణ, ప్రొఫెసర్ భూక్య, వివిధ సంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ప్రచారం

తరువాయి 2లో

# జార్ఖండ్‌లో 'యుసిసి' ప్రవేశపెడతాం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ : మేనిఫెస్టో విడుదల




**రాంచీ :** జార్ఖండ్‌లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్) ప్రవేశపెడతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. అయితే గిరిజనులను దానికి దూరంగా ఉంచుతామన్నారు. ఆదివారం రాంచీలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న అమిత్ షా 'సంకల్ప్ పత్ర' పేరుతో బిజెపి మ్యానిఫెస్టో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, సంజయ్ సేథ్, బిజెపి జార్ఖండ్ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ పాల్గొన్నారు. 'గోగో దీదీ పథకం' కింద మహిళలకు ప్రతి నెలా రూ.2,100 ఆర్థిక భరోసా ఇస్తామని మ్యానిఫెస్టోలో బిజెపి హామీనిచ్చింది. దీపావళి, రక్షాబంధన్ కానుకగా ఏడాదికి ఉచితంగా రెండు ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని ప్రకటించింది. జార్ఖండ్ యువతకు 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలతో సహా 5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. బిజెపి అధికారంలోకి వస్తే పోటీ పరీక్షల పేపర్ లీకేజీలపై సిబిఐ, సిట్ విచారణ

తరువాయి 12లో

# ఒంటి పూటే బడి

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో మధ్యాహ్నం వరకే నిర్వహణ
- ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో 20 రోజులపాటు కొనసాగింపు

ప్రజాపక్షం/భద్రాచలం




వేసవి కాలం రాకముందే విద్యార్థులకు జిల్లాలో ఒంటి బడలు మొదలవుతున్నాయి. ఈ నెల 6వ తేది నుండి మొదలుకుని సుమారు 20 రోజుల పాటు 1 నుండి 5 తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గం. నుండి మధ్యాహ్నం 1 గం. వరకు మాత్రమే బడి జరుగుతుంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిఓను జారీ చేసింది. 6 నుండి 10 తరగతుల విద్యార్థులకు యథావిధిగా బడి వేళలు ఉండనున్నాయి. రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనుంది. ఇందు కోసం అంగన్ వాడీ టీచర్లు, సూపర్వైజర్లతో పాటు తాజా ఉపాధ్యాయులను సైతం వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సర్క్యులర్‌ను ఆయా జిల్లా విద్యాధికారులకు శనివారం జారీ చేశారు. ఉదయం ఎప్పటిలాగానే పాఠశాలకు హాజరయ్యి, మధ్యాహ్నం నుండి ఉపాధ్యాయులు సర్వే విధుల్లో పాల్గొనాల్సి ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2079 మంది టీచర్లను సమగ్ర ఇంటింటి కుటంబ సర్వేలో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్

తరువాయి 12లో

## ట్రాఫిక్ సిగ్నల్స్
# నిర్వహణ లోపం

- పనిచేయని టైమర్లతో పరేషాన్
- జంక్షన్‌ల వద్ద కొరవడిన ఉన్నతాధికారుల అధ్యయనం

ప్రజాపక్షం/హైదరాబాద్



హైదరాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకపక్క దృష్టి సారిస్తుంటే..మరోపక్క ట్రాఫిక్ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థపై అధికారుల నిర్వహణ లోపమే ఇందుకు ఉదాహరణ. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల పరిధిలో సుమారు 520 చౌరస్తాలలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చౌరస్తాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పనిచేయకపోడం, మరికొన్ని చౌరస్తాలలో ఎక్కువసంఖ్యలో టైమర్లు కూడా పనిచేయకపోవంతో వాహనదారులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. రెడ్, ఎల్లో, గ్రీన్ సిగ్నల్స్‌తో పాటు వాటిపైనే టైమర్

తరువాయి 12లో

# దయచేసి వైద్య బృందాలు పంపండి

## అంతర్జాతీయ సంస్థలకు గాజా ఆరోగ్యశాఖ వినతి




**జెరూసలేం:** గాజాలో ఇజ్రాయిల్ భీకర పోరు వేళ వైద్య సాయం కోసం అంతర్జాతీయ సమాజానికి పలస్తీనా ఆరోగ్యశాఖ పిలుపునిచ్చింది. దయచేసి వైద్య బృందాలను గాజాకు పంపండి అంటూ విన్నవించింది. ఉత్తర గాజాలో వైద్య పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, సిబ్బందిపరికరాల కొరత ఏర్పడిందని వాపోయింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, మెడికల్, సర్జికల్ బృందాలను తమ వద్దకు పంపాలని ఒక ప్రకటనలో కోరింది. ఇజ్రాయిల్ దళాల దురాక్రమణ, భూతల, వైమానిక దాడులు తీవ్రస్థాయిలో సాగుతున్న క్రమంలో ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆసుపత్రికి వైద్య సాయం అత్యవసరమని వెల్లడించింది. గాయపడిన వారిని, రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్సులు సమకూర్చాలని కూడా అంతర్జాతీయ సంస్థలకు ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది. కమల్ అద్వాన్ ఆసుపత్రి సిబ్బందితో పాటు కొందరు రోగులను ఇజ్రాయిల్ దళాలు ఇటీవల నిర్బంధించాయి. ఆసుపత్రికి తీవ్ర నష్టం కలిగించాయి. ఈ పరిణామాన్ని 'మెడిసైడ్' అని ఐరాస ప్రత్యేక విలేకరి అన్నారు. ఆరోగ్య వర్కర్లు, ఆసుపత్రులపై ఇజ్రాయిల్ వ్యూహాత్మక, విస్తృత దాడులను 'మెడిసైడ్'గా ఆ విలేకరి వర్ణించారు. ఇజ్రాయిల్ దళాలు పలస్తీనా ప్రజలపై ఉక్కుపాదం మోపేందుకు ఏ మాత్రం వెనుకాడటం లేదు. ఓ వైపు భూతల, వైమానిక దాడులతో గాజా, లెబనాన్‌ను అస్థిరపరుస్తూ, జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. ఆదివారం ఉదయం హెబ్రాన్ పాత నగరంలోని అన్ని మార్గాలను ముళ్ల కంచెలతో మూసివేశాయి. స్థానిక పిల్లలు స్కూళ్లకు వెళ్లే అవకాశం లేకుండా రహదారులు, రోడ్లలో ముళ్లకంచెలు వేశాయి. ఇజ్రాయిల్ సైన్యం చేసిన ఈ పనితో స్కూలుకు 30 మీటర్ల దూరంలో 40 మంది చిన్నారులు చిక్కుకుపోయారని స్థానిక హక్కుల కార్యకర్త ఆరెఫ్ జబేర్ తెలిపారు.

**గాజాలో 23 మంది మృతి**

ఇజ్రాయిల్ దళాలు గాజాపై జరిపిన తాజా దాడుల్లో 23 మంది పలస్తీనియన్లు చనిపోయారు. ఉత్తర గాజాలో 13 మందితో కలిపి మొత్తం 23 మంది చనిపోయినట్లు గాజా వైద్య వర్గాలు వెల్లడించాయి. గాజా స్ట్రిప్‌పై విచక్షణారహితంగా ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను యూనిసెఫ్ తీవ్రంగా ఖండించింది. 48 గంటల్లో జబాలియాపై ఇజ్రాయిల్ దాడుల్లో 50 మందికి పైగా చిన్నారులు చనిపోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. మరోవైపు పోలియో వాక్సినేషన్‌కూ ఇజ్రాయిల్ దళాలు ఆటంకం కలిగిస్తున్నాయి. గాజా నగరంలోని పోలియో వాక్సినేషన్ కేంద్రంపై స్టన్ గ్రెనేడ్‌తో దాడి చేశాయి. ఈ ఘటనలో నలుగురు పిల్లలు గాయపడ్డారు. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 43,314 మంది పలస్తీనియన్లు గాజాలో చనిపోగా, మరో 1,02,019 మంది గాయపడ్డారు. అలాగే లెబనాన్‌లో 2,968 మంది ప్రాణాలు కోల్పోగా, 13,319 మందికి గాయాలయ్యాయి.

# మా హక్కులను సమర్థించే అభ్యర్థికే ఓటేద్దాం




హారిస్‌కు మద్దతుగా వాషింగ్టన్‌లో మహిళల భారీ మార్చ్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధమైన క్రమంలో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, దేశ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతుగా, గర్భవిచ్ఛిత హక్కులను సమర్థిస్తూ మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. వాషింగ్టన్ డీసీలో నేషనల్ ఉమెన్స్ మార్చ్ జరిగింది. వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. మన హక్కులకు మద్దతు ఇచ్చే అభ్యర్థి... ముఖ్యంగా మహిళకు ఓటేయడం మనకు ఎంతో ముఖ్యం అని ప్రదర్శనకారులు నినదించారు. మొదటి ఓటు ఓ మహిళకు వేయబోతున్నందుకు సంతోషంగా ఉందని ఓ విద్యార్థిని తెలిపారు. 'అబ్బాయిలు... అబ్బాయిలుగానే ఉంటే... మహిళలు అధ్యక్షులు అవుతారు' అన్న ప్లకార్డు ప్రదర్శించారు. 'ఓటు వేయడం ద్వారా అక్కర కురాని అధ్యక్షతను నివారించవచ్చు', మహిళ స్థానం ఓవల్ కార్యాలయంలో' వంటి నినాదాలతో కూడిన బ్యానర్లను ప్రదర్శనకారులు ప్రదర్శించారు. 15వేల మంది ఈ మార్చ్‌లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమెరికాలోని మిగతా నగరాల్లోనూ ఇటువంటి మార్చ్‌లు జరిగాయన్నారు. 'నా మనుమళ్ల ఉజ్వల భవిష్యత్ కోసం ఓ మహిళకే అధ్యక్ష బాధ్యతలు కట్టబెడతాం' అని నెబ్రాస్కా నుంచి వచ్చి ప్రదర్శనలో పాల్గొన్న 70ఏళ్ల వాగ్నర్ అన్నారు. 'ఎన్నికల రోజు కేవలం రాజకీయాకే కాదు మా మనుగడకూ కీలకం', 'మా జీవితాలు బ్యాలెట్ బాక్స్‌పై ఆధారపడ్డాయి' అని కొందరు నినదించారు. వెనక్కి వెళ్లేది లేదంటూ బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు. 'గర్భవిచ్ఛితి మా హక్కు, దానికి మద్దతిచ్చే వారికే మా ఓటు' అని నినాదాలిస్తూ మహిళలు కదం తొక్కారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయితే తమకు అధికారాలు నిరాకరించబడతాయన్న అభిప్రాయాన్ని ప్రదర్శనకారులు వ్యక్తంచేశారు. కమలా హారిస్ ఓ మహిళగా తమ హక్కులను పరిరక్షిస్తారని విశ్వాసంగా చెప్పారు.

# హిజ్బొల్లా టాప్ కమాండర్ హతం



**బీరూట్:** లెబనాన్ కేంద్రంగా పని చేస్తున్న హిజ్బొల్లా మరో కీలక నేతలను కోల్పోయింది. ఆ సంస్థ టాప్ కమాండర్ జాఫర్ ఖాదర్ ఫార్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడిఎఫ్) ఒక ప్రకటనలో పేర్కొంది. ఇజ్రాయెల్‌పై ఇటీవల జరిగిన పలు రాకెట్ దాడుల సూత్రధారిగా ఖాదర్‌ను పేర్కొంటారు. అతనే ఈ రాకెట్ దాడులకు వ్యూహరచన చేసినట్టు అనుమానిస్తున్నారు. అయితే, ఖాదర్ మృతి వార్తను హిజ్బొల్లా ఇంకా ధ్రువీకరించలేదు. నాసర్ బ్రిగేడ్ రాకెట్, మిసైల్ యూనిట్‌కు చెందిన ఖాదర్‌ను దక్షిణ లెబనాన్‌లో హతమార్చినట్టు ఐడిఎఫ్ కథనం. ఇటీవల జరిపిన రాకెట్ దాడిలో 12 మంది చిన్నారులు మృతి చెందగా, అంతకు ముందు మెటులా ఘటనలో ఐదుగురు ఇజ్రాయెలీలు చనిపోయారు. ఈ రెండు దాడుల వెనుక ఖాదర్ హస్తం ఉందని అనుమానం. గత ఏడాది అక్టోబర్ 8న తూర్పు లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులు సైతం అతని ఆధ్వర్యంలోనే జరిగాయని అంటున్నారు. ఇలావుంటే, ఉత్తర లెబనాన్‌లో సీనియర్ హిజ్బొల్లా కార్యకర్తను నిర్బంధించినట్టు ఇజ్రాయెల్ నేవీ ఇంతకు ముందు పేర్కొంది. అయితే ఆ వ్యక్తి ఎవరనే వివరాలు వెల్లడించలేదు. అరెస్టు చేసిన సదరు వ్యక్తిని ఇజ్రాయెల్‌కు తరలించి, విచారణ జరుపుతున్నారు. ఇలావుంటే, లెబనాన్‌కు చెందిన నేవీ కెప్టెన్‌ను కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్టు అధికారులు ప్రకటించారు. ఆ ఘటన వెనుక ఇజ్రాయెల్ పాత్ర కోణంలో దర్యాప్తు చేపట్టినట్టు లెబనాన్ తెలిపింది. అపహరణకు గురైన కెప్టెన్ ఇజ్రాయెల్ చేతికి దొరికి ఉంటాడనే అనుమానాలు లేకపోలేదు.

# అమెరికా కవ్వింపు చర్యలు

**సియోల్:** ఉత్తర కొరియాపై అమెరికా కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియా, జపాన్‌తో కలిసి గతంలో సైనిక విన్యాసాలు చేయడం ఉత్తర కొరియాకు ఆగ్రహం తెప్పించిన విషయం తెలిసిందే. తత్ఫలితంగా ఆ దేశ అధినేత కిమ్ జాంగ్ ఉన్ మిసైల్స్ సామర్థ్యాన్ని పరీక్షించారు. అవసరమైతే అణు దాడులకు వెనుకంజ వేయబోయని ప్రకటించారు. ఇటీవల అమెరికా ప్రధాన భూభాగమైన దక్షిణాన్ని తాకేలా రూపొందించిన కొత్త ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా పరీక్షించింది. దీనికి ప్రతిస్పందనగా యునైటెడ్ స్టేట్స్ ఆదివారం దక్షిణ కొరియా, జపాన్‌తో కలిసి త్రైపాక్షిక డ్రిల్లో సుదీర్ఘ శ్రేణి బాంబర్ను ఎగుర వేసింది. ఉత్తర కొరియా గురువారం నాడు కొత్తగా అభివృద్ధి చేసిన హ్వాసాంగ్19 ఐసిఎంఎఇని పరీక్షించింది, ఇది తాను ప్రయోగించిన ఇతర క్షిపణి కంటే ఎక్కువ ఎత్తులో ప్రయాణించి గాలిలో ఎక్కువసేపు ఉండిపోయింది. కిమ్ దాని ప్రత్యర్థుల నుండి ఎదురయ్యే బాహ్య భద్రతా బెదిరింపులను ఎదుర్కోవటానికి 'సముచితమైన సైనిక చర్య' అని అభివర్ణించారు. కగా, ఆదివారం, కొరియా ద్వీపకల్పం సమీపంలో దక్షిణ కొరియా, జపాన్ యుద్ధ విమానాలతో శిక్షణ పొందేందుకు యుఎస్ బి1బి బాంబర్‌ను ఎగుర వేసి, ఉత్తర కొరియా యొక్క అణు, క్షిపణి కార్యక్రమాలకు ప్రతిస్పందించడానికి మూడు దేశాల దృఢ సంకల్పాన్ని మరియు సంసిద్ధతను ప్రదర్శించారు. ఈ ఏడాది దక్షిణ కొరియా, అమెరికా, జపాన్ త్రైపాక్షిక వైమానిక శిక్షణలో ఇది రెండో కార్యక్రమం. కొరియా ద్వీపకల్పానికి సమీపంలోని దీర్ఘ శ్రేణి బాంబర్లు, ఎయిర్క్రాఫ్ట్ క్యారియర్లు, అణుశక్తితో నడిచే జలాంతర్గాములు వంటి కొన్ని శక్తివంతమైన సైనిక ఆస్తులను తాత్కాలికంగా మోహరించడంతో అమెరికా తరచుగా ప్రధాన ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలకు సహకరిస్తున్నది. దక్షిణ కొరియా సైనికాధికారుల ప్రకటనను అనుసరించి ఈ ఏడాది కొరియా ద్వీపకల్పం మీదుగా లేదా సమీపంలో యుఎస్ బి1బి బాంబర్ విన్యాసాలను నాలుగు పర్యాయాలు నిర్వహించింది. మొత్తం మీద ఉత్తర కొరియాను కవ్విస్తున్న అమెరికా, ఎలాంటి పరిణామాలకు కారణమవుతుందోనన్న భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



# స్పెయిన్ రాజుకు నిరసన సెగ

**అలెన్సియా (స్పెయిన్):** ప్రజలు ఆగ్రహిస్తే రాజైనా, మంత్రైనా తలవంచాల్సిందే. స్పెయిన్‌లో అదే జరిగింది. ఇటీవల భారీ వరదలకు స్పెయిన్ అతలాకుతలమైన విషయం తెలిసిందే. చాలా ప్రాంతాల్లో బురద మేటలుకట్టింది. రోడ్లు ధ్వంసమయ్యాయి. కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోగా, పలు ప్రాంతాల్లో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వరదల పరిస్థితిని తెలుసుకునేందుకు ఆదివారం వచ్చిన స్పెయిన్ రాజు ఫెలిపె VIకు ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వ అధికారులను కూడా ప్రజలు విడిచిపెట్టలేదు. వారిపై బురదను విసిరి అవమానించారు. వరదలతో విధ్వంసానికి గురైన వాలెన్సియా నగర శివార్లలోని పైపోర్టాలో ఇతరులు అతనిపై అరిచినప్పుడు స్థానికులతో మాట్లాడటానికి ప్రయత్నించిన చక్రవర్తితో పాటు ప్రభుత్వ అధికారులు ఉన్నారు. అదే సమయంలో అక్కడి స్థానికులు రాజుపై నిరసన వ్యక్తం చేశారు. వారిని నిలువరించడానికి పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. 'బయటకు పో! బయటికి వెళ్లిపో!'మీరు హంతకులు' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. బురదను, మట్టిని వారిపై విరిసి కొట్టారు. రాజు ఫెలిపె ప్రశాంతంగా ఉండి, వారితో మాట్లాడడానికి ప్రయత్నం చేశారు. ఒక వ్యక్తి భుజంపై చేయివేసి మరీ ఓదార్చాడు. దేశం ఇష్టపడే రీతిలో చక్రవర్తిని అభివర్ణిస్తూ వస్తున్న రాయల్ హౌస్‌కు ప్రజల నిరసన అనుకోని ఎదురుదెబ్బగానే పేర్కోవాలి. తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా స్థానికులు రాజుతోపాటు అధికారులను సైతం నిలువరించే ప్రయత్నం చేశారు. తమకు వెంటనే సాయం అందించాలని డిమాండ్ చేశారు.

## 8న యాదగిరిగుట్టకు సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. అటు యాదగిరి గుట్ట దేవస్థానం అధికారులు కూడా సిఎం రాక సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలలో నిమగ్నమయ్యారు. కార్తీక మాసం క్రమంలో భక్తులకు ఇబ్బంది కల్గకుండా సిఎం పర్యటన ఏర్పాట్లు చేస్తున్నారు. తన యాదగిరి గుట్ట పర్యటన సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి దేవస్థానం అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది

## సలహాలు, సూచనలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ కుల గణన కు అత్యంత ప్రాధాన్యం ఉన్నందున 5వ తేదీన సాయంత్రం 5గంటలకు ఆయన హైదరాబాద్ వస్తున్నారన్నారు. నగరంలో కేవలం ఆయన గంటసేపు మాత్రం ఉంటారని తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జొడో యాత్ర లో కుల గణన చేపట్టి ఆయా వర్గాల జనాభా ప్రకారం సంపద పంపిణీ జరగలన్నది ఆలోచన మేరకే దశాబ్దాల తర్వాత కులగణన చేపట్టడం జరుగుతోందన్నారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగునున్న నేపథ్యంలో ఎలాంటి అంశాలు ఉంటే సమగ్రంగా మరింత లోతుగా ఉంటుందో ఆలోచించి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో అందరి సలహాలు, సూచనలు తీసుకోవడానికి సదస్సును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కుల గణనలో ఎలాంటి అంశాలు ఉండాలో సూచించాలని రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన మేధావులను కోరారు.చారిత్రాక ప్రాధాన్యత గా ఉన్న కుల గణను కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యత గా స్వీకరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లు చాలా పట్టుదలతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నారని ఆయన వెల్లడించారు.

## ఓరుగల్లు అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

తగ్గిపోయిందని, వెంటనే చెరువు పూడికతీతకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను అదేశిచడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే వరంగల్ ప్రాంత వాసులకు ఎయిర్ పోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఓ ఆర్ ఆర్, ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు లతో పాటు రాబోయే 30 సంవత్సరాల వరకు నగర ప్రజలకు అవసరమగు మౌలిక వసతులు, అండర్ డ్రైనేజీ, విద్యుత్‌ధీకరణ తదితర మౌలిక వసతులు కల్పించుటకు ప్రణాళికలను తయారు చేయడం జరిగిందని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళోజీ నారాయణరావు కళా క్షేత్రాన్ని, పట్టణానికి సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. భద్రకాళి చెరువు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సర్వే చేయించి అక్రమ నిర్మాణం తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు, కూడా పిఓ అజిత్ రెడ్డి, జిడబ్ల్యుఎంసిఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ లు భీం రావు, సంతోష్ బాబు, సీతారాం, ఇరిగేషన్, కూడా, జిడబ్ల్యూ ఎంసీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యుత్ పాలసీ




(మొదటి పేజీ తరువాయి)

ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్ర పురోభివృద్ధిని, వ్యవసాయ, పరిశ్రమ, గృహ అవసరాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఏ రంగంలో విద్యుత్ సమస్య రాకుండా పూర్తిస్థాయిలో విద్యుత్ అందించే విధంగా ప్రణాళికలతో ముందుకుపోతున్నట్లు ఆయన చెప్పారు. పరిశ్రమలు, ఇతర అవసరాలకు విద్యుత్ లేదని అనిపించుకోకుండా అన్ని అవసరాలను తీర్చేలా పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నామని, ఇందుకు తగ్గట్లుగా విద్యుత్ ఉత్పాదన చేపట్టి రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుతామన్నారు. ఇందులో భాగంగా సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని బహుళ జాతీ కంపెనీలు తెలంగాణ రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకోని ఆశించిన గ్రీప్ పవర్‌ను అందించేందుకు ఆ విధమైన విద్యుత్ ఉత్పాదనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. థర్మల్, సోలార్, హైడ్రో, పంప్ ఎనర్జీ వంటి రకరకాల విద్యుత్ ఉత్పాదన చేపట్టనున్నామన్నారు. భవిష్యత్తులో తెలంగాణ విద్యుత్‌రంగం దేశానికి ఆదర్శంగా ఉండబోతుందన్నారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రి, మంత్రులు దామరచర్ల వద్ద యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు బొగ్గు అందించే ర్యాకుల రైల్వే వ్యాగన్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక ప్రిన్సిపల్ సెక్రటరీ, వైటీపీఎస్ ఛైర్మన్ సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, వైటీపీఎస్ టెక్నికల్ డైరెక్టర్ అజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ సచ్చిదానంద, సీఈ సమ్మయ్య, టీపీసీసీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఎంతైనా ఖర్చుచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)



రవాణాశాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలసి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ నేతలు సంక్షేమ విద్యార్థులకు మెస్,కాస్మోటిక్స్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచలేదని, అలాంటి వారు తగుదునమ్మా అంటూ మా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బడుగు,బలహీనవర్గాల వారి అభివృద్ధి కోసమే కోరి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో గత పాలకులు 10 ఏళ్ళ పాటు బడుగు,బలహీనవార్గలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని వివరించారు. బడుగు,బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఇందిరమ్మ ప్రభుత్వం దీపావళి పండుగ రోజు 7.50 లక్షల మంది నిరుపేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెస్, కాస్మోటిక్స్ చార్జీలు ఒక్కసారిగా 40 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుందామని, ఆమేరకు ఆదేశాలు జారీ చేశామని తెలియజేశారు. నిరుపేద బిడ్డల ఉజ్వల భవిషత్తు కోసం, బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఎంత ఖర్చైనా భరించేందుకు సిద్దంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి మండలి ఆలోచించి ఇంటర్నేషనల్ స్కూల్స్ కు డిజైన్లు ఇచ్చే ప్రపంచ స్థాయి ఆర్కిటెక్ కు ఈ బాధ్యతలను అప్పగించడం జరిగిందని, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. సామాన్యుడికి అత్యవసరమైన విద్య, వైద్యం పైనే ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలియజేశారు. గత 10 ఏళ్ళల్లో బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీలేదని, ఎస్ఎల్‌బిసిలో ఒక్క కిలోమీటర్ కూడా తవ్వలేదని, 20 నెలల్లో ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణను బిఆర్ఎస్ నేతలు ఆగం పట్టించారని పలు ఆరోపణ అస్త్రాలు గుప్పించారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్‌ను కుర్చీ వేసుకుని కూర్చోని పూర్తి చేయిస్తామని నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పిన గత పాలకులు 10 ఏళ్ళ కాలంలో ఒక్క కిలోమీటర్ సొరంగం కూడా త్రవ్వకం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు.



**మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ....**

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలు గుండెల్లో పెట్టుకుని మూడు దశాబ్దాలుగా తనను ఎన్నుకున్నారని ఈ ప్రాంతాలను దేశంలోనే నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేసి ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని ఉత్తమ్ అన్నారు.ప్రజా ప్రభుత్వంలో సిఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు అందరూ కూడా ప్రజల కోసం పనిచేసి ప్రతి పైసా కూడపెట్టి సంపద సృష్టించి ఆయా డబ్బులను బడుగు,బలహీనవర్గాల కోసం ఖర్చు పెడతామన్నారు. త్వరలోనే పట్టణంలోని ఫణిగిరి సీతారామచంద్రస్వామి గట్టు వద్ద నిర్మాణాలు పూర్తికావచ్చిన జీ ప్లస్ వన్ 2160 ఇండ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. కోట్లాది రూపాయలతో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ .... ఊటీ లాంటి చెరువులు, చెట్లు , గుట్టల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో మంచి నాణ్యమైన విద్యను బోధించేందుకు గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఒకే చోట వెయ్యి మంది విద్యార్థులు భోజనం చేసేలాగా డైనింగ్ హాల్ నిర్మిస్తామన్నారు. కులం,మతం లాంటి బేధం లేకుండా అందరికి విద్యను అందిస్తామన్నారు. పాఠశాలకు డబుల్‌రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డిఆర్‌డిఏ పిడి వి.వి అప్పారావు, డియస్పీ శ్రీధర్‌రెడ్డి, సిఐ చరమందరాజు, తహసీల్దార్ కవిత, ఎంఈవో సక్రూనాయక్, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

## దీపావళి, ఛత్ పూజ పండుగకు

# 32 ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ దీపావళి , ఛత్ పూజ పండుగ సందర్భంగా భారతీయ రైల్వే 7,435 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది. గత సంవత్సరం 4,500 ప్రత్యేక రైళ్లు నడపగా, దక్షిణ మధ్య రైల్వే ఈ పండుగ సీజన్‌లో వివిధ ప్రాంతాలకు 860 ప్రత్యేక రైళ్లను నడిపించడం గమనార్హం . గత ఏడాది 626 ప్రత్యేక రైళ్లతో పోలిస్తే మొన్న శనివారం 32 ప్రత్యేక రైళ్లు నడపగా, నిన్న ఆదివారం 33 ప్రత్యేక రైళ్లను నడిపించింది. ఆదివారం బయలుదేరిన సమయం , ప్రయాణించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిమచిలీపట్నం (రాత్రి 11.20 గంటలకు), తిరుపతి– సికింద్రాబాద్(రాత్రి 7.50 గంటలకు),అకోలా తిరుపతి (ఉదయం .8.10 గం.లకు), నర్సాపూర్ హైదరాబాద్ (రాత్రి 8.00 గం.లకు), మణుగూరు బెల్గాం (3.40 గం.లకు), సికింద్రాబాద్ దానాపూర్( ఉదయం 10.00 గం.లకు), మహబూబ్‌నగర్ గోరఖ్‌పూర్ (రాత్రి 10.22 గం.లకు), సికింద్రాబాద్ నిజాముద్దీన్( రాత్రి 10.45 గం.లకు), సికింద్రాబాద్ విశాఖపట్నం ( సాయంత్రం 4.35 గం.లకు) , తిరుపతి శ్రీకాకుళం ( సాయంత్రం 5.10 గం.లకు), తిరుపతి సాయినగర్ షిర్డీ ( సాయంత్రం 5.30 గం.లకు) కాచిగూడ దర్భంగా (రాత్రి 10.00 గం.లకు), బెల్గాం మణుగూరు (మధ్యాహ్నం 12.30 గం.లకు), గోరఖ్‌పూర్ సికింద్రాబాద్ ( ఉదయం 8.30 గం.లకు), హిసార్ కాచిగూడ ( మధ్యాహ్నం 12.30 గం.లకు), జైపూర్ హైదరాబాద్ ( మధ్యాహ్నం 3.20 గం.లకు), దాదర్ కాజీపేట ( మధ్యాహ్నం 3.15 గం.లకు), బెర్హంపూర్ నాందేడ్ (సాయంత్రం 4.45 గం.లకు), నాగర్‌కోయిల్ కాచిగూడ( రాత్రి 12.30 గం.లకు), పన్వేల్ నాందేడ్ ( మధ్యాహ్నం 12.30 గం.లకు), సంత్రాగచ్చి సికింద్రాబాద్ ( మధ్యాహ్నం 12.20 గం.లకు), విజయవాడ విశాఖపట్నం ( సాయంత్రం 6.30 గం.లకు), విశాఖపట్నం విజయవాడ (ఉదయం 10.00 గం.లకు) ఎస్ఎంవి బెంగళూరు దానాపూర్ (రాత్రి 11.30 గం.లకు), ప్రయాగ్‌రాజ్ ఎస్ఎంవి బెంగళూరు ( రాత్రి 11.00 గం.లకు), బఘత్ కీ కోటి కోయంబత్తూరు (రాత్రి 9 .00 గం.లకు), కలబురగి ఎస్ఎంవి బెంగళూరు( ఉదయం 9.30 గం.లకు), విశాఖపట్నం ఎస్ఎంవి బెంగళూరు ( మధ్యాహ్నం 3.30 గం.లకు ) చెన్నై విశాఖపట్నం ( ఉదయం 10.35 గం.లకు), తిరుచిరాపల్లి అహ్మదాబాద్ (ఉదయం 5.40 గం.లకు), దానాపూర్ ఎస్ఎంవి బెంగళూరు ( మధ్యాహ్నం 3.00 గం.లకు), అగర్తల సికింద్రాబాద్ ( ఉదయం 6.20 ) గంటలకు బయలుదేరి వెళ్తున్నాయని దమ రైల్వే తెలిపింది. రైలు ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేసిందని, స్టేషన్లలోపలకు చేరగానే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది క్యూ ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులకు దొంగతనాల జరగకుండా నివారిస్తామని వెల్లడించింది.

# ఫడ్నవీస్‌కు ఎందుకు భయం?

## ఆయనపై దాడి జరగబోతోందా? : రౌత్



**ముంబయి:** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు భద్రతను పెంచడంపై శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ స్పందించారు.ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. ఆకస్మికంగా భద్రతను పెంచడానికి కారణాలేమిటంటూ ప్రశ్నించింది. ప్రస్తుతం ఫడణవీస్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉంది. అది కాకుండా.. ఆయన కోసం అదనపు ఫోర్స్ వన్ కమాండోలను నాగపూర్‌లో ఉంచినట్లు సమాచారం. దీనిపై తాజాగా సంజయ్ రౌత్ స్పందిస్తూ.. 'మాజీ సీఎం, రాష్ట్ర హోంమంత్రికి ఆకస్మికంగా భద్రతను పెంచారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఆయన.. తన కోసం భద్రతను పెంచుకున్నారు. ఫడణవీస్ నివాసం వెలుపల ఫోర్స్ కమాండోలు నిలబడి ఉన్నారు. నాగపూర్ మరో 200 మంది ఉన్నారు. డిప్యూటీ సిఎం ఎందుకు అంత భయపడుతున్నారు. ఆయనపై దాడి జరగబోతోందా..?అలా ఎవరు చేయాలనుకుంటున్నారు..? ఇజ్రాయెల్ లేదా లెబనాన్ ఫడణవీస్‌పై దాడికి దిగుతున్నాయా..?'' అని ప్రశ్నించారు. భద్రతను పెంచడంపై దేవేంద్ర ఫడణవీస్, డిజిపి వివరణ ఇవ్వాలని సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. డిజిపి రశ్మీ శుక్లాను 'బిజెపి డిజి'గా పేర్కొన్నారు. ఆమె కాషాయ పార్టీతో కలిసి పని చేస్తున్నారని.. ఇలాంటి పోలీసులు ఉంటే త్వరలో రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు సరిగ్గా నిర్వహించలేమని ఆరోపించారు. గతంతో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. డిజిపి తమ ఫోన్లను ట్యాప్ చేశారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వం ఏం చేయబోతుందనేది తెలుసుకుని బిజెపికి లీక్ చేశారంటూ విరుచుకుపడ్డారు.

## అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా..
# క్రీడావిధానం రూపకల్పన



( కె.నరేష్‌గౌడ్ )

డిసెంబర్‌లో నూతన క్రీడా పాలసీ తీసుకువస్తాం
గత బిఆర్‌ఎస్ సర్కార్ క్రీడారంగానికి చేసిందేమీలేదు
'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో 'శాట్స్' చైర్మన్ కె.శివసేనారెడ్డి

"గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదిగేలా క్రీడా విధానాన్ని రూపొందిస్తున్నాం. ఇందు కోసం అంచెలంచెలుగా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ నూతన క్రీడా పాలసీని డిసెంబర్‌లోగా తీసుకువస్తాం" అని తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ కె.శివసేనా రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో క్రీడారంగానికి నూతనంగా చేపడుతున్న చర్యలు, క్రీడా లోగో ఆవిష్కరణ, నూతన క్రీడాపాలసీ రూపకల్పన తదితర విషయాలను ఆయన 'ప్రజాపక్షం'తో పంచుకున్నారు.

**ప్రశ్న : తెలంగాణ క్రీడాపాలసీని ఎప్పుడు తీసుకువస్తున్నారు, విధివిధానాలు ఏమిటి?**

**శివసేనారెడ్డి :** ఇప్పటికే రూపొందించిన క్రీడా లోగో ఆవిష్కరించాం. తెలంగాణ నూతన క్రీడా పాలసీని వచ్చే నెల డిసెంబర్ 2024లోగా తీసుకువస్తున్నాం. ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి పలుదఫాలుగా ఈ క్రీడాపాలసీపై చర్చించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగే క్రీడలు, వాటిలో పతకాలను తెలంగాణ క్రీడాకారులు సాధించడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం. ఈ క్రమంలోనే వివిధ క్రీడారంగ నిష్ణాతులు క్రీడా పాలసీలో పొందుపరచాల్సిన అంశాలను తెలియజేశారు. వారి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం. క్రీడారంగ, క్రీడాకారుల అభివృద్ధి, సంక్షేమ చర్యలు, కొత్త క్రీడా పాలసీలో పొందుపరుస్తాం.

**ప్రశ్న : క్రీడాకారులు రాణించేందుకు స్పోర్ట్స్ అథారిటీ తీసుకుంటున్న చర్యలేమిటి?**

**శివసేనారెడ్డి :** దశాబ్ది కాలం నుండి క్రీడాకారులకు, యువతకు ఎటువంటి ప్రోత్సాహం లేక నిర్వీర్యమైపోయారు. గ్రామీణ ప్రాంతాల నుండి కూడా క్రీడాకారులు రాణించాలంటే స్పోర్ట్స్ అథారిటీని ఉన్నతంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడాకారులు, కుటుంబ సభ్యులందరం కలిసి ఒక టీమ్ వర్క్‌తో పనిచేస్తున్నాం. విద్యార్థులు, యువతను క్రీడల్లో ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యత దక్కే విధంగా, క్రీడా రంగంలో ప్రతీ కార్యక్రమంలో యువతను భాగస్వామ్యం చేస్తున్నాం. తద్వారా శాట్స్‌ను ఒక అత్యున్నత క్రీడా సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. క్రీడా రంగ సంస్థలతో భేటీ అవుతూ వారి సూచనల మేరకు క్రీడారంగ భవిష్యత్తు దిశగా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడల్లో అవార్డులు సాధించిన ప్రముఖులతో రాష్ట్ర క్రీడాకారుల సమావేశాలు ఏర్పాటు చేసి వారి అనుభవాలను తెలియజేయడం ద్వారా వారికి స్ఫూర్తిని కలిగిస్తున్నాం.

**ప్రశ్న : క్రీడాకారుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తారా?**

**జవాబు :** గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో అన్ని రంగాల మాదిరిగానే క్రీడారంగం కూడా కుంటుపడింది. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి సమూల మార్పులు తీసుకురావాలని, చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా శాట్స్ కార్యకలాపాలు నిర్వహించనుంది. ఎక్కడో దూరంగా ఉన్న క్రీడాకారులను హైదరాబాద్‌కు తీసుకువచ్చి వారికి ప్రత్యేక హాస్టల్ వసతి, క్రీడా ప్రాంగణాలను అందుబాటులో ఉంచుతున్నాం. అథారిటి సిబ్బంది, కోచ్‌లను, క్రీడా సంఘాలను వారికి అందుబాటులో ఉండేలా చేస్తున్నాం. ఇప్పటికే యావత్ తెలంగాణ క్రీడా సమాజం కూడా వారికి



తగిన సూచనలు, సలహాలు ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో వివిధ క్రీడాంశాలపైనా వారికి కోచింగ్ ఇస్తున్నాం. 2023 గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో విజేతలైన తెలంగాణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నగదు పురస్కారాలు అందజేసింది. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు ఇస్తుంది.

**ప్రశ్న : ' సిఎం కప్ 2024' ప్రాముఖ్యత ఏమిటి?**

**జవాబు :** క్రీడాకారులను ప్రోత్సహించి, స్ఫూర్తిని కలిగించాలని క్రీడాజ్యోతి పేరుతో 'టార్చ్ రిలే ర్యాలీ'లను రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహించాం. ప్రతి జిల్లాలోనూ జిల్లా కలెక్టర్, ఎస్‌పి స్థాయి అధికారులు సహా జిల్లాల క్రీడాకారులు, పిఈటిలు క్రీడా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాజకీయాలకు అతీతంగా బిఆర్‌ఎస్, బిజెపి ప్రజాప్రతినిధులు కూడా ఈ టార్చ్ రిలే ర్యాలీలో భాగస్వామ్యం కావడం విశేషం. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో పల్లెల నుండి క్రీడా ప్రతిభను గుర్తించి రాష్ట్ర స్థాయికి తెచ్చి వారిని చాంపియన్‌లుగా తీర్చిదిద్దనున్నాం. ఈ దిశగా 'సిఎం కప్ 2024' నిర్వహించనున్నాం. ఆ దిశగా క్రీడలకు సన్నాహాలు చేస్తున్నాం. తద్వారా క్రీడారంగానికి పునర్వైభవాన్ని తీసుకువస్తాం.

## స్పోర్ట్స్ విలేజీ తిరిగి అప్పగించడం హర్షణీయం

* సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు
* శాట్స్ చైర్మన్ కె. శివసేనారెడ్డి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మితమైన స్పోర్ట్స్ విలేజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి శాట్స్ సంస్థకు అప్పగించడం పట్ల శాట్స్ చైర్మన్ కె.శివసేనారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల మాదిరిగానే క్రీడారంగంలో సమూల మార్పులు సాధిస్తున్న సిఎం రేవంత్ తమ క్రీడా రంగ అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. క్రీడాకారుల కోరికను మన్నించి స్పోర్ట్స్ టవర్‌ను క్రీడాభివృద్ధి కోసం ఇవ్వడం శుభపరిణామమని, అప్పట్లో దివంగత మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించిన ఈ స్పోర్ట్స్ టవర్ క్రీడాకారుల వసతికి ఉపకరించడంతో పాటు 2007లో నిర్వహించిన పలు క్రీడలకు వినియోగించుకోగా, దానిని కెసిఆర్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల ద్వారా వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించిందన్నారు. అంతే కాకుండా దాని నిర్వహణను పూర్తిగా మర్చిపోయిందని శాట్స్ చైర్మన్ విమర్శించారు. క్రీడారంగ అభివృద్ధిని విస్మరించిన కెసిఆర్ ప్రభుత్వం క్రీడాకారులు, క్రీడాభిమానులు ఎంత నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. రాబోయే రోజుల్లో పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదిక కానున్న హైదరాబాదు నగరం గచ్చిబౌలి స్టేడియానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని స్పోర్ట్స్ టవర్‌ను అప్పగించడంతో తెలంగాణ క్రీడా సమాజమంతా సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు.




## బిఆర్‌ఎస్ రెండు మేనిఫెస్టోలపై చర్చకు సిద్ధమా?

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై తాము చర్చకు సిద్ధమని, బిఆర్‌ఎస్ పార్టీ గత 10 ఏళ్లలో ఇచ్చిన రెండు మేనిఫోస్టేలపై వారు చర్చకు సిద్ధమా, అయితే వారి మేనిఫెస్టోలు పట్టుకుని రావాలని భువనగిరి ఎంపి చామ కిరణ్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. గత 10 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క రోజు కూడ సెలవు తీసుకోలేదని, అదే కేసిఆర్ పదేళ్లలో 10సార్లు కూడా సచివాలయంలో కూర్చున్న దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌పై విరుచుపడ్డారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో బిఆర్‌ఎస్ నాయకులు తెలంగాణను తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అందుకే బిఆర్‌ఎస్ నిరంకుశ పాలనను తరిమికొట్టి ప్రజలు ప్రజాస్వామ్య పాలనను తెచ్చుకున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు కూడ గెలవలేని బిఆర్‌ఎస్ మళ్లీ ఎన్నికలు పెడితే 100 సీట్లు గెలుస్తామని ఆ పార్టీ నాయకుల వ్యాఖ్యలు సిగ్గుచేటాన్నారు. టిఆర్‌ఎస్ పార్టీని పెట్టింది తెలంగాణ కోసం కాదని, కలెక్షన్లు, కమిషన్లు దండుకోవడానికే అని ఆరోపించారు. కాంగ్రెస్ పొత్తు కారణంగానే రబ్బరు చెప్పులతో వచ్చిన హరీష్‌రావు మంత్రి అయ్యారన్న విషయం మరిచిపోయి మాట్లాతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పుణ్యాన కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి హరీష్‌రావుకు చురకలు అంటించారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉండి రాజభోగాలు అనుభవించిన హరీష్ రావు, కేటీఆర్‌లకు ఈ 10 నెలల నుండి నిద్ర పడతలేదని, అందుకే వారు ప్రభుత్వంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**మహేశ్వర్‌రెడ్డికి బిజెఎల్‌పి పదవి తప్ప సీటు లేదు**

బిజెపి ఎంఎల్‌ఎ మహేశ్వర్ రెడ్డికి బిజెపి శాసన సభా పక్ష నాయకుడి పదవి తప్ప ఆ పార్టీ కార్యాలయంలో కనీసం కుర్చీ కూడ లేని ఆ నాయకుడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. ఆయన కలల లోకంలో తెలియడుతూ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. మా ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తాం. ప్రతిపక్షాలు చేసే విష ప్రచారాలను ప్రజలు నమ్మొద్దనికిరణ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ఏ ఒక్క వాగ్దానం నేరవేర్చలేదు : లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని నేరవేర్చలేకపోయిందని పార్లమెంట్ సభ్యులు, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపి డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. రైతుల రుణ మాఫీ, రైతు భరోసా కాదు కదా కనీసం పండిన పంటలను సైతం సక్రమంగా కొనలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. అధికారం కోసం రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు ఇస్తామని మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక రైతు భరోసాను పక్కనబెట్టి రోజుకో మాట మాట్లాడుతూ రైతులను మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ వచ్చాక 50వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని, ఆ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, పరీక్షలు ఎప్పుడూ నిర్వహించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా గతేడాది శాసనసభ ఎన్నికలకు ముందు అక్టోబర్‌లో అశోక్‌నగర్‌కు వచ్చి ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి విద్యార్థులకు నమ్మబలికారన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యాచరణ

వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో గత 17 ఏళ్లుగా పనిచేస్తున్న 2వ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎఎన్‌ఎంల ప్రథమ మహాసభలో పోరాట కార్యచరణ రూపొందించుకోనునున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్ తెలిపారు. ఈనెల 17వ తేదీన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న రెండవ ఎఎన్‌ఎంల ప్రథమ మహాసభ వాల్ పోస్టర్లను ఆదివారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రెండవ ఎఎన్‌ఎం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్యామల, ఆహ్వాన సంఘ అధ్యక్షులు పానుగంటి పర్వతాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని, వృత్తిపర వివక్షతోపాటు, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప వీరి జీవితాలు మారడంలేదు. కానీ కొత్త పథకాల రూపంలో వీరిపై పని ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులైజేషన్ చేస్తున్నప్పుడు తామంతా సంతోషించామని కానీ, కొర్రీలు పెట్టి కేవలం కొంతమంది మాత్రమే రెగ్యులరైజేషన్ చేసి చేతులు దులుపుకున్నారని ఆయన విమర్శించారు. రెండవ ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి, చివరకు నిరవధిక సమ్మె చేసినా ప్రభుత్వం వీరి సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండవ ఎఎన్‌ఎంల సమస్యలపై పోరాటాలతో పాటు నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సమస్యలను వివరించామన్నారు. రాబోయే రోజులలో రెగ్యులరైజేషన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించుకోవడానికి కావాల్సిన ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవడానికి మహాసభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మహాసభల నిర్వహణకు ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా సమితికి ఈ సందర్భంగా యూసఫ్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి జిల్లా నుంచి ఎన్నుకోబడిన ప్రతినిధులు ఈ మహాసభకు హాజరై సమస్యలపై చర్చించి ఏకనిర్ణయంతో కార్యాచరణలోకి వెళ్లాలని ఆయన సూచించారు. ఈ మహాసభ ద్వారా రెండవ ఎఎన్‌ఎంల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించటానికి కావలసిన చర్చలు జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, కార్యనిర్వహక అధ్యక్షుడు శ్యామల శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాతరాజు నరసింహ, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మీ బాయి ,హసీనా బేగం, పి.సురేష్ తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్‌ఎం యూనియన్ రాష్ట్ర కోశాధికారి జక్కుల పద్మ, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణ , జి. సువర్ణ పాల్గొన్నారు.

## విద్యతోనే అసమానతల నిర్మూలన

తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రభుత్వాలు నాణ్యమైన విద్య అందించడం ద్వారానే సమాజంలోని పేదరికం, నిరుద్యోగం, అసమానతల నిర్మూలన సాధ్యమౌతుందని తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి అన్నారు. ఈ దిశగా ప్రభుత్వానికి తన వంతు సలహాలు సూచనలు చేసి పభుత్వ విద్య బలోపేతం కోసం మరింత కృషి చేస్తానన్నారు. 'పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ విద్య పాత్ర' అనే అంశంపై సదస్సు సిపిఐ ధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ చిలకలగూడ దూద్‌బావి కమిటీ హాల్‌లో జరిగింది. సదస్సుకు ప్రధాన వక్తగా విచ్చేసిన వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పేదవర్గాల ప్రజలకు మెరుగైన విద్య అందినప్పుడే పేదరికం నిర్మూలన జరుగుతుందని, సామాజిక రుగ్మతలు, అసమానతలు తొలగిపోతాయన్నారు. విద్య ద్వారానే మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గాజుల శ్రీధర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించినప్పుడే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని, తద్వారా సమాజంలోని సకల సమస్యల పరిష్కారం సాధ్యమౌతుందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. సదస్సుకు సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు అధ్యక్షత వహించగా సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, సిఆర్‌పిఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీ నారాయణ, తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. సమావేశంలో కమ్యూనిటీ ప్రతినిధులు రామలీల, ప్రవీణ్ కుమార్, జోగు రాములు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డికి
## సిఎం రేవంత్ రెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పాలకుర్తి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ మామిడాల యశస్వినీ రెడ్డి అత్తగారైన కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డిని హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పరామర్శించారు. కొన్ని రోజుల కింద పాలకుర్తిలో జరిగిన ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా వేదిక కుప్పకూలిన ప్రమాదంలో ఝాన్సీ రెడ్డి గాయపడ్డారు. ఝాన్సీరెడ్డిని పరామర్శించిన రేవంత్‌రెడ్డి ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సిఎం రేవంత్ రెడ్డి వెంట టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, సిఎం సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఎ మామిడాల యశస్వినీ రెడ్డి ఉన్నారు.

## ప్రభుత్వంపై అబద్ధపు విషప్రచారం

టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా 'నాదర్‌గుల్‌లో మూడు వందల ఎకరాలకు ఎసరు' అని ప్రభుత్వ పెద్దలంటూ ఆపాదించి 'నమస్తే తెలంగాణ' పత్రిక అబద్ధపు, విషప్రచారం చేస్తున్నదని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. అసైన్డ్ భూములను అమ్ముకునే హక్కు ఎవరికీ ఉండదని, దానిపై అక్టోబర్ 31వ తేదీనే ఎఫ్‌ఐఆర్ నమోదైందని ఆయన స్పష్టం చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు చేసినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని అబద్ధాలతో నమస్తే తెలంగాణ పత్రిక ప్రచురించడం వారి దిగజారుడుతనాన్ని తెలియజేస్తుందన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై బురద జల్లే కుట్ర జరుగుతున్నదన్నారు. అబద్ధపు రాతలు చూసి నమస్తే తెలంగాణ పత్రికను ఆ భూముల రైతులే కాల్చి నిరసన వ్యక్తం చేశారని, రైతులే నమస్తే తెలంగాణ పత్రికపై కేసు పెట్టారని, కథనంలో ఆరోపించిన ప్రవీణ్ రెడ్డిపై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదైందని, అందులో ఉన్నది ఎవరు అనేది కథనం రాసిన వారే చెప్పాలన్నారు. ఈ తప్పుడు కథనాల వెనుక సూత్రధారులు ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. అబద్ధపు ప్రచారం చేస్తున్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలో రోజు రోజుకూ..
# దిగజారుతోన్న రైతాంగం పరిస్థితి

మాజీమంత్రి జగదీశ్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో రైతాంగం పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని మాజీమంత్రి, ఎంఎల్‌ఎ జగదీశ్ రెడ్డి అన్నారు. దొంగ లెక్కలతో రుణమాఫీ చేశామని ప్రభుత్వం అంటుందని, రుణమాఫీని దేశం మొత్తం చెప్పుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు భరోసా ఇవ్వమని రైతులు మొత్తుకుంటున్నారని అన్నారు.

రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం కొనడంలేదన్నారు. వరి ధాన్యం కేంద్రాలు లేకపోవడంతో రైతులు ధాన్యం కల్లాల్లో ఆరబోసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు మిల్లర్లతో చర్చలు జరపలేదన్నారు. వరి ధాన్యం, పత్తి కొనుగోళ్లపై సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు సమీక్ష చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేవన్నారు. సన్న వరి ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారని అన్నారు. పత్తి రైతులకు కాంగ్రెస్, బిజెపి పార్టీలు ద్రోహం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పత్తి పంటకు కేంద్రం 7000 మద్దతు ధర ప్రకటించిందని, గుజరాత్‌లో పత్తి పంటకు 8000 మద్దతు ధర ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చింది గ్రామీణ ప్రాంతాలు ఫోర్త్ సిటీ, ఫిఫ్త్ సిటీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మోదీని తిట్టినా బిజెపి నేతలు సైలెంట్‌గా ఉన్నారన్నారు. రేవంత్ రెడ్డిని విమర్శించే మొగోడు బిజెపిలో లేడన్నారు.

**అరెస్టులతో ఉద్యమాన్ని రేవంత్ రెడ్డి ఆపలేరు..**

అరెస్టులతో ఉద్యమాన్ని రేవంత్ రెడ్డి ఆపలేరని జగదీశ్ రెడ్డి అన్నారు. విద్యుత్ కమిషన్ చైర్మన్ మదన్ బి లోకూర్ ఎప్పుడు పని చేశారో తమకు తెలియదని, విచారణ చేయకుండా నివేదిక ఎట్లా ఇస్తారని ప్రశ్నించారు. విద్యుత్ కమిషన్ విచారణ పూర్తి చేసినట్లు ప్రభుత్వం అధికారికంగా చెప్పిందని, తమ వివరణ చైర్మన్ తీసుకోలేదన్నారు. కమిషన్ వేస్తున్నట్లు సిఎం అసెంబ్లీలో ప్రకటించారని, కమిషన్ విచారణ పూర్తి అయితే అసెంబ్లీలో వివరాలు బయట పెట్టాలన్నారు. నివేదికలో ఏముండదని ముందే లీకులు ఇస్తున్నారని, విద్యుత్ కమిషన్ రిపోర్ట్ ఇస్తే ప్రజల ముందు పెట్టాలన్నారు. తమను జైల్లో వేసే ఆలోచన వస్తే ఆలస్యం ఎందుకు తమను జైల్లో పెట్టడానికి భయపడుతున్నారా ? అని ప్రశ్నించారు. కెసిఆర్ 24 గంటల విద్యుత్ ఇచ్చినందుకు జైల్లో పెడతారా? అని ప్రశ్నించారు.

మూసీ అభివృద్ధిని ప్రారంభించిందే బిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నారు. అసదుద్దీన్ ఒవైసీ గురించి ముస్లింలకు తెలుసాన్నారు. కొన్ని మీడియా సంస్థలు తమపైన విషం కక్కుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఇద్దరు వాచ్‌మెన్లు మృతి



**ప్రజాపక్షం/మణుగూరు :** విద్యుత్ షాక్‌తో ఇద్దరు వాచ్‌మెన్లు మృతి చెందిన ఘటన మణుగూరు మండలంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లో కెళితే... మండలంలోని క్రిస్టియన్ సంస్థకు చెందిన గ్రీస్ మిషన్ హైస్కూల్లో ఉపేందర్, రత్నం అనే ఇద్దరు వ్యక్తులు వాచ్‌మెన్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం స్కూల్లో డ్యూటీ చేస్తుండగా స్కూల్ గోడలపై ఉన్న జెండాలను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో గోడలపై ఉన్న జెండాలు తీసే క్రమంలో సర్వీస్ వైర్ తగిలి ఇద్దరు వాచ్‌మెన్లు అక్కడికక్కడే మృతి చెందారు.

మృతి చెందిన వ్యక్తులు స్థానిక మున్సిపాలిటీలోని శివలింగాపురం, కాళీమాత ఏరియాకు చెందిన ఉపేందర్, రత్నంగా గుర్తించారు. విషయం తెలుసుకున్న సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ సతీష్ కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల వివరాలను స్కూల్ యాజమాన్యం, విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గిట్టుబాటు ధర కల్పించటంలో సర్కార్ విఫలం

మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర దక్కడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి రైతుల మద్దతు కోరాడని,. కాని ఇప్పుడు వడ్లకు కనీస మద్దతు ధర చెల్లించటం లేదని విమర్శించారు. రైతులు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్రంలో పలు జిల్లాలు జగిత్యాల, మహబూబాబాద్ , సూర్యపేట, రాజన్న సిరిసిల్లా జిల్లాలో అన్నదాతలు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. రైతుల ఓట్లు కావాలి..కాని రైతుల వడ్లు పట్టవా అని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం బద్దిపడగ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో హరీష్‌రావు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో వడ్ల కల్లాలు రాకముందే సంచులు పంపించి, మిల్లులకు టైఆఫ్ చేసి,ట్రాన్స్‌ఫోర్టు ఏర్పాటు చేసి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసేవారన్నారు. రేవంత్‌సర్కార్ నెలరోజులైన వడ్లు కొనుగోలు చేయటం లేదని విమర్శించారు. కెసిఆర్ రైతు బంధు రెండు సార్లు ఇస్తే మూడుసార్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశాడని, కాని ఇప్పుడు సిఎం అయ్యాక ఒక్కసారి సైతం రైతుబంధు ఇవ్వలేదన్నారు. పత్తి రూ.7521 కొనుగోలు చేయాల్సి ఉండగా కేవలం 5వేలకు రైతులు అమ్ముకుంటున్నారన్నారు. వడ్లు సైతం మద్దతు ధర లేక 1800 రూపాయలకు క్వింటాల్‌కు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబిన్ పంట కొనుగోలు చేసిన ప్రభుత్వం రెండు నెలలైనా డబ్బులు ఇవ్వటంలేదన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.60లక్షల ఎకరాల్లో వానాకాలం వరిసాగు చేస్తే 9లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయని, కానీ ఇప్పటివరకు అధికారులు వెయ్యి మెట్రిక్ టన్నుల వడ్లు కొనలేదన్నారు. బిఆర్‌ఎస్ నేతలు ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్, సారయ్య, దువ్వల మల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫోకస్

# ఆరోగ్యం

## ఏడుపుగొట్టు మనిషి!



నిజమే. యావత్ జంతుజాలంలో తీవ్రమైన మనోవేదక లేదా మానసిక ఒత్తిడి కారణంగా ఏడిచేది కేవలం మనిషి మాత్రమే. ఇతర జంతువులు కన్నీళ్లు కార్చడాన్ని చూడవచ్చు. కానీ అవి భావోద్వేగాల నుండి ఉద్భవించవు. భావోద్వేగాలతో ఏడ్చేది మనిషి ఒక్కడే. నీటిని మరిగించేంత వేడిని కేవలం అరగంటలో శరీరం ఉత్పత్తి చేయగలదు. ప్రతి గంటకు, మానవ శరీరం 350,000 జూల్స్ శక్తిని సృష్టిస్తుంది, ఇది 100వాట్ లైట్ బల్బ్ వలె అదే శక్తిని సృష్టిస్తుంది. ఇది కేవలం 30 నిమిషాలలో అర గ్యాలన్ నీటిని మరిగించడానికి తగినంత వేడిగా ఉంటుంది. సగటు మనిషి ముక్కు 50,000 రకాల వాసనలను గుర్తుంచుకోగలదు. కుక్క ముక్కు మరింత శక్తివంతమైనది అయినప్పటికీ, ఆ సంఖ్య ఇప్పటికీ ఆకట్టుకుంటుంది. మెదడు 12 నుండి 25 వాట్స్‌తో పనిచేస్తుంది, ఇది ఎల్ఇడి లైట్ బల్బును వెలిగించడానికి తగినంత శక్తి.

ఆరోగ్యంపై నిద్ర యొక్క ఆశ్చర్యకరమైన ప్రభావాలు ఎక్కువ వ్యాయామం చేయ డం వల్ల మంచి నిద్ర ఉండవచ్చు. మితమైన వ్యాయామం మీరు పొందే గాఢ నిద్ర మొత్తాన్ని పెంచుతుంది. మీరు నిద్రపోవడానికి సిద్ధంగా ఉండాలనుకుంటే, మీరు పడుకునే ముందు ఒక మైలు పరుగెత్తకూడదనుకుంటే, రోజులో కొంత వ్యాయా మం చేయడం వల్ల మీ మొత్తం నిద్రవేళ అనుభవాన్ని మెరుగుపరచవచ్చు. ఎవిడేషన్తో పని చేయడానికి ప్రేరణ పొందండి మరియు మీ నిద్రలో మెరుగుదలని మీరు గమనించవచ్చు. నిద్ర శరీరంలోని దాదాపు ప్రతి కణజాలాన్ని ప్రభావితం చేస్తుంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిద్ర మీ పెరుగుదల, హార్మోన్ స్థాయిలు, రోగనిరోధక శక్తి, హృదయనాళ ఆరోగ్యం, రక్తపోటు, ఆకలి మరియు శ్వాసపై ప్రభావం చూపుతుందని సూచిస్తున్నాయి. తగినంత నిద్ర మీ అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. సరిపడా నిద్రపోయినప్పుడు అధిక రక్తపోటు, పక్షవాతం, మధుమేహం మరియు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని స్లీప్ ఫౌండేషన్ సూచిస్తుంది.

# విస్తరిస్తున్న హైపర్ టెన్షన్

సాధారణంగా 'బిపి' అని పిలిచే హైపర్ టెన్షన్ లేదా అధిక రక్తపోటు ఇటీవల కాలంలో వేగంగా విస్తరిస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ఒ) కూడా ఇప్పటికే ఈ విషయంపై అన్ని దేశాలనూ అప్రమ త్తం చేసింది. డబ్ల్యుహెచ్ఒ తాజా నివేదికను అనుసరించి ప్రతి ఎనిమిది మరణాల్లో ఒకటి హైపర్ టెన్షన్‌తో సంబంధం ఉంది. ప్రజలకు ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటిగా దీనిని పేర్కొంటున్నా రు. మానవ శరీరంలో రక్త ప్రసరణ హృదయ సంకోచ, వ్యాకో చనాలు జరుగుతాయి. గుండె ధమనుల నుండి రక్తం శరీర కణ జాలాలకు చేరాలంటే పీడనం కావాలి. దీనినే రక్తపోటు/ బిపి (బ్లడ్ ప్రెషర్) అంటారు. బ్లడ్ ప్రెషర్‌ను స్పిగ్నోమానోమీటర్ ద్వారా లెక్కిస్తారు. హృదయ సంకోచం అంటే గుండె కొట్టుకుంటున్నపుడు రక్తనాళాలలో ఉండే పీడనం, హృదయ వ్యాకోచమంటే గుండె విశ్రాంతిలో ఉన్నపుడు (ప్రతిరెండు చపుళ్ళకు మధ్య వ్యవధి) రక్తనాళాలలో ఉండే పీడనం. దీనిని mmhg (పాదరసపు మిల్లీమీట ర్)లో కొలిచి, హృదయ సంకోచం / హృదయ వ్యాకోచం గా సూచిస్తారు. పై సంఖ్య ఎక్కువగా, క్రిందిసంఖ్య తక్కువగా ఉంటుం ది. ఆరోగ్యంగా ఉన్న వారిలో రక్తపోటు 120/80 గా ఉంటుంది. కాని కొన్ని కారణాల వల్ల బి.పి ఎక్కువ అవ్వడం కాని తక్కువ అవ్వడం గాని జరుగుతుంది. రెండింటిలో ఏదైనా ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన ప్రకారం హృద య సంకోచం 160 ఎంఎంహెచ్‌జి కంటే అధికంగా ఉండి, హృదయ వ్యాకోచం 95 mmhg కంటే అధికంగా ఉన్నప్పుడు అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) అంటాము. నిజానికి అధిక రక్తపోటు అనేది ఒక వ్యాధి కాదు. కానీ, గుండె సంబంధిత వ్యాధులైన ఊబకాయం, మధుమేహం, మూత్రపిండాల వ్యాధుల తీవ్రతను ప్రతిబింబించే లక్షణం. మన దేశంలో 25 శాతం మంది పురుషులు, 24 శాతం మంది మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. 20 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారిలో అధిక రక్తపోటు సమస్య 13.6 శాతంగా నమోదుకావడం ఆందోళన కలిగించే అంశం. 80 సంవత్సరాల వయస్సు, అంతకన్నా ఎక్కువ వయస్సు వారిలో 54.4 శాతం మందికి ఈ లక్షణం ఉంటుంది. సాధారణ శరీర పరిమాణాలతో ఉన్న వారిలో ఈ సమస్య వచ్చే అవకాశం 26 శాతంకాగా, ఊబకాయం ఉన్న వారిలో 48 శాతం వరకూ ఉంది. గ్రామాలలో నివసించే వారి కంటే పట్టణాలలో నివసించే వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అధిక రక్తపోటు వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బ తింటుంది. అందువల్ల గుండె, మూత్రపిండాలు, మెదడు దెబ్బతింటా యి గుండెపోటు అవకాశాలు ఎక్కువ అవుతాయి. గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండ వ్యాధులు, మెదడు, అడ్రినల్ గ్రంథిలో కణతులు ఏర్పడ్డపుడు, హైపర్ థైరాయిడ్ సమస్యల వలన, అండాశయ వ్యాధులు, ఊబకాయం, పిట్యుటరీ గ్రంథి సక్రమంగా పనిచేయనపుడు అధిక రక్తపోటు నమోదవుతుంది. కొంత



మందిలో ఇది వారసత్వంగా సక్రమించ వచ్చు త్తిడికి గురికావడం, మద్యంసేవించడం, ధూమపానం చేయడం వంటి కారణాలతోనూ అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తపోటు ను కొలిచినప్పుడు వ్యాకోచ పీడనం 90/104 ఎంఎంగా ఉంటే స్వల్ప రక్తపోటుగా భావించాలి. 105 /119 ఎంఎం మధ్యస్తం. 120/130 ఎంఎంను అత్యంత ఎక్కువ. ఆహార నియమాలను పాటిస్తే రక్తపోటును నియంత్రణలో ఉంచవచ్చని వైద్యులు అంటున్నారు. ముందుగా ఆహారం ద్వారా శరీరానికి లభించే కెలరీలను తగ్గించుకోవాలి. కెలరీలు, క్రొవ్వులు తక్కువగా, ప్రోటీన్లు సాధారణ మోతాదులో తీసుకోవాలి. సోడియం లభించే పదార్థాలను చాలా వరకు మానుకోవాలి. ప్రోటీన్లు లభించే పదార్థాలలో సోడియం అధికంగా ఉంటుంది. అందుకే రక్తపోటు మరీ అధికంగా ఉన్నప్పుడు ప్రోటీన్లు రోజుకు 20 గ్రాముల కంటే అధికంగా తీసుకోవడం అంత మంచిది కాదు. రక్తపోటు అధికంగా ఉన్నవారు బరువు పెరుగుదలను నియంత్రించుకుంటూ ఉండాలి. అందువల్ల క్రొవ్వు పదార్థాలకు అంటే వేపుళ్ళు, కేకులు, జంక్ ఫుడ్స్‌కి చాలా వరకు దూరంగా ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని, నిపుణులను సంప్రదించడం అత్యవసరం.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- మోనాలిసా ఏ శతాబ్దంలో చిత్రీకరించబడింది?
  16వ శతాబ్దం
- ప్రపంచంలో అత్యంత ధనిక దేశం ఏది?
  ఖతార్
- కాఫీ ఎక్కువగా పండించే కౌంటీ ఏది?
  బ్రెజిల్
- వయోజన మానవుని శరీరంలో ఎన్ని ఎముకలు ఉంటాయి?
  206
- మానవులు ముఖ కండరాలను ఎప్పుడు ఎక్కువగా ఉపయోగించారు?
  చిట్లించుకుంటూ నిద్రపోతున్నప్పుడు
- ఐక్యరాజ్యసమితి (యుఎన్) ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
  1945
- 'సిటీ ఆఫ్ విండ్స్' అని ఏ నగరాన్ని పిలుస్తారు?
  చికాగోసీటెల్
- శాంతి, తటస్థతకు చిహ్నంగా ఉన్న జంతువు ఏది?
  వైట్ క్రేన్
- వజ్రాల ప్రధాన భాగం ఏ మూలకం?
  ఉత్పత్తిఆక్సిజన్
- ఫెర్దినాండ్ మాగెల్లాన్ యొక్క మొదటి విజయవంతమైన ప్రపంచ ప్రదక్షిణ ఏ సంవత్సరంలో జరిగింది?
  1520
- మొదటి మనిషిని ఏ సంవత్సరంలో అంతరిక్షంలోకి పంపారు?
  1961
- ఏ సముద్రం భూమిపై అత్యంత ఉప్పగా పరిగణించబడుతుంది?
  మృత సముద్రం
- పిత్త స్రావానికి మానవ శరీరంలో ఏ అవయవం బాధ్యత వహిస్తుంది?
  కాలేయం
- సౌర వ్యవస్థలోని ఏ గ్రహాన్ని 'మార్నింగ్ స్టార్' లేదా 'ఈవినింగ్ స్టార్' అని పిలుస్తారు?
  శుక్రుడు
- ఏ రసాయన మూలకం 'Cu'గా గుర్తించబడింది?
  రాగి
- ఫ్రెంచ్ విప్లవం ఏ సంవత్సరంలో జరిగింది?
  1789
- మార్స్ వాతావరణంలో ఎక్కువ భాగం ఏ రసాయన మూలకం కలిగి ఉంటుంది?
  కార్బన్ డయాక్సైడ్
- టైటాన్ వాతావరణంలో ఎక్కువ భాగం ఏ రసాయన మూలకం కలిగి ఉంటుంది?
  మీథేన్‌కార్బన్ డయాక్సైడ్
- అంటార్కిటికా ఆవిష్కరణ ఏ సంవత్సరంలో జరిగింది?
  1820
- ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ అండ్ రెడ్ గార్డ్ ఆర్గనైజేషన్ (రెడ్ క్రాస్) ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
  1863
- లియోనార్డో డా విన్సీ యొక్క ప్రసిద్ధ పెయింటింగ్ ది లాస్ట్ సపర్‌లో ఏ వాయిద్యం చిత్రీకరించబడింది?
  వీణగిటార్
- చెర్నోబిల్ అణు విపత్తు ఏ దేశంలో జరిగింది?
  ఉక్రెయిన్
- ఉత్తర అమెరికా, యురేషియా మధ్య ఏ సముద్రం ఉంది?
  అట్లాంటిక్

## అత్యంత ప్రమాదకరమైన జీవి ఏది?



ఈ ప్రశ్నకు ఎవరైనా చిరుత, పులి లేదా సింహం అని సమాధానాలు చెప్తారు. హైనా, తోడేలు వంటి జంతువుల పేర్లు కూడా ప్రస్తావనకు వస్తాయి. కానీ, ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన జీవి ఏదైనా ఉంది అంటే అది దోమ మాత్రమే. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను దోమలు వ్యాపింప చేస్తాయి. ఈ వ్యాధుల కారంంగా సంవత్సరానికి సుమారు 7,25000 మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు అంచనా. తర్వాతి స్థానం పాములు. విషపూరితమైన పాము కాటు కారణంగా ఏటా సుమారు 1,00,000 మంది ప్రాణాలు వదులుతున్నారు. ఆ తర్వాత వరుసగా కుక్కలు, సెట్సే ఫ్లైస్, అసాస్సినింగ్ బగ్స్, మంచినీటి నత్తలు, తేళ్లు, అస్కారిక్ రౌండ్‌వామ్స్, టేండ్ వామ్స్ వామ్స్ ఈ జాబితాలో ఉన్నాయి. ఏదిఏమైనా దోమల కారణంగా ఎక్కువ మంది ప్రజలు రోగాల పాలై, చనిపోతున్నారన్నది ఆశ్చర్యం గొలిపే వాస్తవం.

## వీలుంటే ఓ కప్పు కాఫీ...



ఒక కప్పు కాఫీ తాగడం వల్ల డిప్రెషన్ ఫీలింగ్ తగ్గుతుందని అంటారు. ఒక కప్పు కాఫీ మీ మానసిక స్థితిని పెంచుతుందని మరియు మీ డిప్రెషన్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఒక అధ్యయనం కనుగొంది. కానీ డికాఫ్ కోసం వెళ్లవద్దు. ఈ ప్రభావం కోసం మీకు కెఫిన్ అవసరం. అదే విధంగా, కుక్క లేదా పిల్లి వంటి పెంపుడు జంతువులను పెంచుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. పెంపుడు జంతువులను పెంచుకోవడం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్తపోటు మరియు కొలెస్ట్రాల్ స్థాయిలను, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మితిమీరిన ఒత్తిడి వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం పొంచి ఉంటుంది. ఒత్తిడి కారణంగా గుండె జబ్బు ప్రమాదం పెరుగుతుంది. అయితే, ఇది కార్టిసాల్ స్థాయిని కూడా పెంచుతుంది. ఫలితంగా టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. కార్టిసాల్ రక్తంలో చక్కెల స్థాయిలను పెంచుతుంది.

# సెకండరీ గ్రేడ్ టీచర్స్‌పై పనిభారం తగ్గించాలి

**● సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నాం ● ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష్య కార్యదర్శులు పర్వతరెడ్డి,సదానందం గౌడ్**



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** సెకండరీ గ్రేడ్ టీచర్స్‌పై పనిభారం తగ్గించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష్య కార్యదర్శులు మాడుగుల పర్వతరెడ్డి, జి.సదానందం గౌడ్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఎస్‌టియు భవన్‌లో హన్మకొండ జిల్లా అధ్యక్షులు కామగోని రాంబాబు అధ్యక్షతన జరిగిన ఎస్‌టియు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల అత్యవసర కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పర్వత్ రెడ్డి, జి.సదానందం గౌడ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులకు విధులు కేటాయించడం వల్ల విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. విద్యా వ్యవస్థకు పునాది అయిన ప్రాథమిక పాఠశాల విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా, ప్రాథమిక పాఠశాల స్థితిగతులను ఆలోచించి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్స్‌గా నియమించి పాఠశాలల నిర్వహణకు ఆటంకాలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్ పైన పనిభారం ఎక్కువగా ఉన్నదని, ప్రాథమిక పాఠశాలల పని వేళలు 1గంట భోజన విరామంతో కలుపుకుని 7:00 గంటల పని వేళలు మాత్రమే ఉండాలని విద్యా హక్కు చట్టం సూచిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షకులైన జిల్లా విద్యా శాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారులు ఉన్నత పాఠశాల టైం పాటించాలని ప్రాథమిక పాఠశాల పని వేళలను పెంచుతూ ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాల పని వేళలపైన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని పాఠశాల విద్యా సంచాలకులను ఎస్‌టియు పక్షాన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను రాష్ట్రోపాధ్యాయ సంఘం వరంగల్ జిల్లా శాఖ పక్షాన స్వాగతిస్తున్నామన్నారు. సర్వే విధుల నుండి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న వారిని, దివ్యాంగులను, చంటి పిల్లల తల్లులను మినహాయించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి విధిగా మంజూరు చేయాల్సిన డిఎ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, పిఆర్‌సిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిఎస్‌సి2003 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన, ఇతర సప్లమెంటరీ బిల్లులు ఈ కుబేర్‌లో చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగుల జిపిఎఫ్ బిల్లులు సైతం పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉపాధ్యాయులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రభుత్వం వేంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భీమనాథుని రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నామాని సాంబయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర రమేశ్, రాష్ట్ర కార్యదర్శి రూపిరెడ్డి సుధాకరరెడ్డి, వ రంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూల మధులిమాయే, నాగరాజు దానం, ములుగు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ. మధుసూదన్, ఎస్. సతీష్ కుమార్, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. గణేష్ వరంగల్, హన్మకొండ జిల్లాల ఆర్థిక కార్యదర్శులు రాచమల్ల తిరుపతి,మేడిపల్లి విద్యాసాగర్, హన్మకొండ జిల్లా బాధ్యు లు ఆర్. లక్ష్మ ణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సంకల్పం మంచిదైతే సమాజ తోడ్పాటు ఉంటుంది

**● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ● సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని ప్రజాసేవలు చేయాలి : కూనంనేని ● కాశయ్య, ఎస్‌వి నారాయణ విగ్రహాల ఆవిష్కరణ**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సంకల్పం మంచిదైతే సమాజతోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం పోలెపల్లి పంచాయతీపరిధిలోని గురుదక్షిణ ఫౌండేషన్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెరుకూరి కాశయ్య, ఎస్‌వి నారాయణ విగ్రహాలను మంత్రి తుమ్మల, వ్యవస్థాపకులు దుగ్గినేని సత్యనారాయణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు. గురుదక్షిణ ఫౌండేషన్ వారు తీసుకున్న సంకల్పం మంచిది కాబట్టే అన్ని పక్షాల నుంచి సహాయ స హకరాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు ఎ న్నో మంచి కార్యక్రమాలను చేస్తున్న సంస్థకు తమలాంటి వారు సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో తమ నుండి పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. సంస్థ యొక్క భూముల హద్దులను ఏర్పాటు చేసి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టా, సుఖలలో పాలు పంచుకుంటున్న ఇటువంటి సంస్థలకు తోడ్పాటును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందన్నారు. కాశయ్య, ఎస్‌విల సేవలు వెలకట్టలేనవని కొనియాడారు. అనంతరం ఎస్‌వి నారాయణ కుమారుడు డాక్టర్ జతిన్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుల పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నాయకులు కృష్ణ ప్రసాద్, ఖమ్మం మేమర్ నీరజ, గురుదక్షిణ ఫౌండేషన్ చైర్మన్ చావా సత్యనారాయణ, సెక్రటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలి

**ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్ డిమాండ్**



**ప్రజాపక్షం / మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లాలో మేలాదిమంది మన్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రేగ్యులరైస్ చేయాలని డిమండ్ చేశారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలో ఎఐటియుసి నాలుగో మహాసభను ఆదివారం మహజన్ పంక్షన్‌హాల్‌లో నిర్వహించారు, ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు, అనంతరం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ , కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, రాష్ట్ర ప్రభుత్వం కార్యికులందరికి ట్రెజరీ ద్వారా 26 వేల రూపాయలు అమలు చేయాలి, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాటాడు తూ ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా కార్మిక కుటుంబం లో ఒకరికి ఉద్యో గం ఇవ్వాలని అన్నారు, పదవి విరమణ పోందిన జి. గంగమ్మకు రాష్ట్ర అధ్యక్ష లు కార్యదర్శి ఘనంగా సన్మానించారు, ఈ స మావేశంలో మెట్ పల్లి మున్సిపల్ నూతన కార్మికుల కమీటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, గైరవ అధ్యక్షలు బి.మధురమ్మ, సలహదారులు హుస్సేన్, అధ్యక్షులు బి.లక్ష్మ ణ్, ఉపాధ్యక్షలుగా ఎల్. సంజీ వ్, డి.తిరుపతమ్మ, ప్రధాన కార్యదర్మి టి.నవీన్, సహయ కార్యదర్మలుగా ఎల్.మహేష్, బి. నర్సయ్య. డి.లక్ష్మి , ఆర్గనైజర్ సెక్రెటరీలు యు.శ్రీను, జై. సాయిలు. కోశాధికారి ఎల్. శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# 23, 24 తేదీలలో భారత జాతీయ మహిళా సమాఖ్య నిర్మాణ మహాసభ

**మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన**

**ప్రజాపక్షం/కోదాడ :** 23, 24 తేదీల్లో హైద్రాబాద్‌లో జరగనున్న భారత జాయతీ మహిళ సమాఖ్య తెలంగాణ రాష్ట్ర నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని మహిళ సమాఖ్య రాష్ట్ర మహా సభల గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో ఆ హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను గుర్తించి వారిని న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పతల కోటమ్మ, దేవరం మల్లేశ్వరి, సహాయ కార్యదర్శి అలివేలు, ఉపాధ్యక్షురాలు జయసుధ, కోదాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు సట్టు అంజమ్మ, సట్టు పార్వతి, వీరకుమారి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



# సాంబయ్య మృతి పేద ప్రజలకు తీరనిలోటు

**సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి**



**ప్రజాపక్షం/దామెర :** సిపిఐ దామెర మండల కార్యదర్శి అంబి సాంబయ్య మృతి సిపిఐకి, పేద ప్రజలకు తీరనిలోటు అని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి అంబి సాంబయ్య స్వగ్రామంలో ఆయన మృతదేహంపై పార్టీ కండువా కప్పి పూలమాలతో నివాళులర్పించారు. సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై వరంగల్ ఉమ్మడి జిల్లాలో, హనుమకొండ జిల్లాలో పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు కావాలని పోరాడారని అన్నారు. దామర మండలంలోని ఓగులాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించాలని, దశలవారీగా ఉద్యమించిన నాయకులు అని, రైతుల సమస్యలపై కార్మికుల సమస్యలపై, వ్యవసాయ కూలీల సమస్యలపై అనేక సమస్యలపై ఉద్యమించి చురుకైన పాత్ర పోషించి సిపిఐ మండల కార్యదర్శిగా కొన సాగుతున్నారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఈ ప్రాంత ప్రజలకోసం ఇళ్ల స్థలాలు పక్కా ఇల్లు వచ్చే వరకు భూ పోరాటం నిర్వహిస్తామని బిక్షపతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్,జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్య వర్గ సభ్యులు మునగాల బిక్షపతి, జిల్లా నాయకులు కట్టపాక రవి,శంకర్ నాయక్, కండె నరసయ్య, మండల నాయకులు ఐలయ్య, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు

బిస్కెట్లతో వీధికుక్కలను కట్టడిచేసి...

# ఉగ్ర కమాండర్‌ను మట్టుబెట్టిన బలగాలు

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన అగ్ర కమాండర్ ఉస్మాన్‌ను భద్రత బలగాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. రెండేళ్లలో శ్రీనగర్‌లో చోటుచేసుకున్న కీలక ఎన్‌కౌంటర్ ఇదే. ఈ ఆపరేషన్ విజయం వెనుక సైన్యం వ్యూహాత్మక ప్రణాళికే గాకుండా.. ఓ అసాధారణ సమస్యకు పరిష్కారం కూడా దాగి ఉంది. అదే.. వీధి శునకాలకు బిస్కెట్లు వేయడం. శ్రీనగర్‌లో జనసాంద్రత అధికంగా ఉన్న ఖన్యార్ ప్రాంతంలో ఉస్మాన్ నక్కి ఉన్నట్లు నిఘా సమాచారం అందుకున్న భద్రత బలగాలు రంగంలోకి దిగాయి. పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు కలిసి ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. అప్పటికే పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. అయితే, స్థానికంగా వీధి శునకాల సమస్య అధికంగా ఉండటం సవాల్‌గా మారింది. అవి మొరిగితే అతడు అప్రమత్తమయ్యే వీలుంది. పైగా పరిసరాలపై పూర్తి అవగాహన ఉండటంతో తప్పించుకునే అవకాశాలు ఎక్కువ ఉండటంతో జవాన్లు జాగ్రత్తగా వ్యవహరించారు. సమస్య పరిష్కారానికి తమ వెంట బిస్కెట్లను తీసుకెళ్లారు. వీధి శునకాలకు ఆహారంగా వేస్తూ.. వాటిని కట్టడి చేశారు. 20 ఏళ్లకుపైగా ఉగ్ర కార్యకలాపాల్లో నిమగ్నమైన ఉస్మాన్.. స్థానికంగా అనేక దాడులకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. పాకిస్థాన్‌లో కొద్ది కాలం పనిచేసిన తర్వాత 2016–17 ప్రాంతంలో తిరిగి జమ్మూకశ్మీర్‌లోకి చొరబడినట్లు చెప్పారు. గత ఏడాది పోలీసు అధికారి మస్రూర్ వనీపై కాల్పుల ఘటనలో అతడి ప్రమేయం ఉందని వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు భద్రత సిబ్బందికీ గాయాలయ్యాయి. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.



# రైతులను మోసగించిన 'అధికార' మహాయుతి కూటమి

## మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విమర్శల జోరు



న్యూఢిల్లీ : మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమిపై కాంగ్రెస్ పార్టీ తన ఆరోపణల స్వరా న్ని మరింత పెంచింది. మహాయుతి కూటమి మోసం పునాదులపై నిర్మితమైందని, వారి వాగ్దానాల వైఫల్యాన్ని మహారాష్ట్ర ప్రజలు క్షమించబోరని ధ్వజమెత్తింది. కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ ఆదివారం నాడు సామాజికమాధ్యమం 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో మహాయుతి కూటమిపై ఆరోపణల దాడికి దిగారు. మహారాష్ట్ర రైతులకోసం మహాయుతి పెద్ద పెద్ద వాగ్దానాలు చేసిందని, రైతులకోసం వారు ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. ప్రతీ గ్రామానికి పైపుల ద్వారా తాగునీరు అందించేందుకు మరాట్వాడా నుంచి వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపడతామన్న వాగ్దానం ఇంతకాలమైనా నెరవేర్చలేదన్నారు. మహాయుతి ప్రభుత్వం మోసాలతో ఏర్పడిందని, అయితే వారిని వారు విధేయత, ఆదర్శవాదం కలిగిన వారుగా మహారాష్ట్ర ప్రజల ముందు గొప్పలు చెప్పుకుంటున్నారని జైరాం రమేష్ ఎద్దేవా చేశారు. మహాయుతి ప్రభుత్వం మహారాష్ట్ర రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. జలయుక్త్ శివారును వాగ్దానం చేసిన వారు జల్‌ముక్త్ శివారుకు మాత్రమే పంపిణీ చేశారని, మహారాష్ట్ర ప్రజలు వారిని ఎట్టిపరిస్థితులలోనూ క్షమించరని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి మహాయుతి కూటమిని తూర్పారబట్టారు. 2019లో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రూ.20,000నుంచి రూ.25,000 కోట్ల ప్యాకేజీతో వాటర్ గ్రిడ్ నిర్మించి మరట్వాడ నుంచి పైపు లైన్ ద్వారా ప్రతీ గ్రామానికీ తాగునీరు అందిస్తామన్న వాగ్దానాన్ని అటకెక్కించారన్నారు. మరట్వాడలో తీవ్రస్థాయిలో నీటి కొరత ఏర్పడి ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. మరట్వాడలో 600కు పైగా గ్రామాలు, 178కుగ్రామాలు తాగునీటికోసం ట్యాంకర్లు తెప్పించుకుని నిల్వ చేసుకుంటున్నారని జైరాం రమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం 40శాతం నీటిని రిజర్వాయర్లకు వదిలితే, ఈసారి కేవలం 19శాతం మాత్రమే రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయడం బాధాకరమన్నారు. నవంబరు 20న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మహాయుతి అధికారకూటమిలో భాగమైన మహావికాస్ అఘాడి (ఎంవిఎ), బిజెపి, శివసేన, ఎన్‌సిపి పై విమర్శల దాడిని పెంచింది. కాంగ్రెస్ పార్టీ ఉద్ధవ్ థాక్రే శివసేన, శరద్‌పవార్ ఎన్‌సిపితో జతకట్టి మహాయుతి కూటమి నుంచి అధికార పీఠం దక్కించుకునేందుకు కుస్తీపడుతోంది.

# నిధుల విడుదల జాప్యానికి బిజెపిదే బాధ్యత: జైరాం రమేష్

న్యూఢిల్లీ : ప్రజల నుంచి ఓట్లు అడి గే ముందు జార్ఖండ్‌కు పెండింగ్‌లో ఉన్న బొగ్గు రాయల్టీ రూపంలో 1.36 లక్షల కోట్ల రూపాయలను విడుదల చేయడంలో జాప్యానికి బిజెపి బాధ్యత వహించక తప్పదని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. జార్ఖండ్‌కు బొగ్గు రాయల్టీలు, కేం ద్ర పథకాల ప్రయోజనాలలో కేంద్రం లక్షల కోట్ల రూపాయలను బకాయిపడిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. జార్ఖండ్‌లో కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన అనుబంధ సంస్థలు బొగ్గు గనులను నిర్వహిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'భూపరిహారం చెల్లించనందుకు' రూ.1,01,142 కోట్లు, 'కామన్ కాజ్ బకాయిలు' కింద రూ. 32,000 కోట్లు, 'కడిగిన బొగ్గు రాయల్టీ' కింద రూ. 2,500 కోట్లు బకాయిలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో బిజెపి ఎందుకు విఫలమైందని, ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని జార్ఖండ్ బిజెపిని ప్రశ్నించారు. 'ఈ నిధులను విడుదల చేయడంలో నాన్‌బయోలాజికల్ ప్రధానమంత్రి ఎందుకు విఫలమయ్యారు? జెఎంఎం–కాంగ్రెస్ కూటమికి ఓటు వేసినందుకు జార్ఖండ్ పట్ల సవతి తల్లిగా వ్యవహరిస్తోందా? రాష్ట్ర బిజెపి నాయకత్వం ఎందుకు రాష్ట్రానికి నిధులు తేలేకపోయింది? అని రమేష్ ఎక్స్‌పై పోస్ట్‌లో ప్రశ్నించారు. జార్ఖండ్ ప్రజల నుండి ఓటు అడిగే ముందు, రాష్ట్రానికి 1.36 లక్షల కోట్లు విడుదల చేయడంలో జరిగిన ఈ జాప్యానికి బిజెపి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

# చొరబాటుదారులను తరిమికొడతాం

## జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ర్యాలీలో అమిత్ షా



రాంచీ : జార్ఖండ్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తున్న చొరబాటుదారులను సహించబోమని, వారిని తరిమికొడతామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరించారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ జార్ఖండ్‌లోకి బంగ్లాదేశ్ చొరబాటుదారులను ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఆదరిస్తున్నారని ఆయన ఆరోపించారు.ఆదివారం నాడు తూర్పు సింగ్‌భమ్ జిల్లా ఘట్‌శిలలోని ధల్‌భుమ్‌గర్ వద్ద నిర్వహించిన బిజెపి ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి అమిత్ షా ఉపన్యసించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం నక్సలిజాన్ని అంతమొందించాలని చూస్తుంటే, జార్ఖండ్ ముక్తి మోర్చా నక్సలిజానికి మద్దతు పలుకుతోందని ఆరోపించారు. బిజెపి అధికారంలోకి వస్తే ఇతరులపై రిజర్వేషన్ ప్రభావం పడకుండా జార్ఖండ్‌లో ఒబిసి కమ్యూనిటీ వారికి 27శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారు .నిరుపేద గిరిజనుల నిధులను జెఎంఎం ప్రభుత్వం మింగేస్తూ అవినీతికి పాల్పడుతున్నదని ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్ర అభివృద్ధి కేవలం బిజెపి వల్లనే సాధ్యం అవుతుందని నొక్కిచెప్పారు. సెరాయికెలా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపాయి సోరేన్‌కు, ఘట్‌శిల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న చంపాయి సోరేన్ కుమారుడు బాబులాల్ సోరేన్‌కు, బహ్రగోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న దినేషానంద్ గోస్వామికి ప్రజలు ఓట్లేసి గెలిపించాలని అమిత్‌షా విజ్ఞప్తి చేశారు. జార్ఖండ్ రాష్టంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నవంబరు 13, నవంబరు 20వ తేదీన రెండు దశలలో పోలింగ్ జరుగనుంది. కాగా నవంబరు 23న ఓట్ల లెక్కింపుతో జార్ఖండ్‌లో ఏ పార్టీ అధికార పీఠం దక్కించుకోనున్నదనేది తేలనుంది.

# నెలకు 7 కిలోల రేషన్ బియ్యం

## జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హామీ



రాంచీ : జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఓటర్లను ఆకట్టు కునేందుకు పులు పార్టీలు కీలక హామీలు ఇస్తున్నాయి. ఈ నేప థ్యంలోనే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ తమ ప్రభుత్వం ఏర్పడితే పిడిఎస్ కిం ద అందించే రేషన్ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చారు. దీంతో పాటు పెన్షన్ మొత్తాన్ని పెంపు చేయడంతోపాటు మరికొన్ని హామీలు ప్రకటించారు. ప్రస్తుతం ప్రభుత్వం 5 కిలోల రేషన్ ఉచితంగా ఇస్తుండగా, దానిని 7 కిలోలకు పెంచుతామన్నారు. జార్ఖండ్‌లో జెఎంఎం నేతృత్వంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వీటిని అమలు చేస్తామని హేమంత్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. అంతేకాదు జార్ఖండ్‌లో బిజెపి అధికారంలో ఉన్నపుడు 11 లక్షల మందికి రేషన్ కార్డులు రద్దు చేశారని హేమంత్ సోరెన్ ఆరోపించారు. రేషన్‌కార్డుల రద్దు వల్ల జార్ఖండ్‌లో చాలా మంది గిరిజనులు, దళితులు ఆకలితో చనిపోయారని వ్యాఖ్యానించారు. బిజెపి హయాంలో రాష్ట్రంలో గిరిజనులు, దళితులు ఆకలితో చనిపోవడం సర్వ సాధారణమన్నారు. కానీ మా ప్రభుత్వంలో మాత్రం జార్ఖండ్ ప్రజలు రేషన్, పెన్షన్ పెంపు, మంచి పోషకాహారం పొం దుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంకా మిగిలి ఉన్న వారిని కూడా పిడిసి ఎస్‌లో చేర్చుతామని సోరెన్ చెప్పా రు. ఇది కాకుండా మాయన్ సమ్మాన్ యోజన కింద మహి ళలకు నెలకు రూ. 2500 ఇవ్వనున్నట్లు ప్రకటించారు. జార్ఖం డ్‌లో ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనంలో పిల్లలకు గుడ్లు, పండ్లు కూడా అందజేస్తామన్నారు. మా ప్రభుత్వం సామాజిక భద్రత విషయంలో అనేక చర్యలు తీసుకుం దన్నారు. 40 లక్షలకు పైగా వృద్ధులు, ఒంటరి మహిళలు, విక లాంగులకు సామాజిక భద్రతా పెన్షన్‌తో అనుసంధా నించడం. శ్రామిక వర్గానికి పెన్షన్ వయస్సు 60 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలకు తగ్గించడం. 18–50 సంవత్సరాల వయస్సు గల మహిళలకు మైయా సమ్మాన్ యోజన వంటి అనేక పథకాలను అమలు చేసినట్లు గుర్తు చేశారు.

# అడ్వకేట్ల ఉన్నతికి 'ముందడుగు పడని ' 'సుప్రీం' సిఫారసు!

- జస్టిస్ డివై.చంద్రచూడ్ నేతృత్వంలోని 'సుప్రీం' కొలీజియం సిఫారసు 'తిరస్కృతి'
- నవంబరు 11న సుప్రీంకోర్టు నూతన ప్రధానన్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్‌ఖన్నా బాధ్యతలు




న్యూఢిల్లీ : నవంబరు 10వ తేదీన పదవీ విరమణ చేయనున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై. చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కోసం పునరుద్ఘాటించిన పేర్లపై ఇప్పటి వరకూ ఎలాంటి ముందడుగు పడలేదు. ఈ కొలీజియం 2023 జనవరిలో అడ్వకేట్లు సౌరభ్ కిర్‌పాల్ పేరును ఢిల్లీ హైకోర్టు జడ్జిగా, ఆర్.జాన్ సత్యన్ పేరును మద్రాస్ హైకోర్టు జడ్జిగా, అమితేష్ బెనర్జీ మరియు సక్యసేన్ పేర్లను కోల్‌కతా హైకోర్టు జడ్జీలుగా ఉన్నత స్థానం కోసం సిఫారసు చేసింది. అంతేకాకుండా ఈ సర్వోన్నత న్యాయస్థానం కొలీజియం అడ్వకేట్ సోమశేఖర్ సుందరేసన్ పేరును బాంబే హైకోర్టు జడ్జిగా 2023 జనవరిలోనే సిఫారసుచేసింది. అయితే 2023 నవంబరులోనే సోమశేఖర్ సుందరేసన్ బాంబే హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిలుగా అపాయింట్‌మెంట్ ప్రొసీజర్ గురించి ప్రజల్లో బాగా అవగాహన ఉన్నదని తెలిసినప్పటికీ సిఫారసు చేయబడిన కిర్‌పాల్, ఆర్.జాన్‌సత్యన్, అమితేష్ బెనర్జీ, సక్యసేన్ దస్త్రాలు ఇప్పటి వరకూ ప్రభుత్వం వద్దనే పెండింగ్‌లోనే ఉండటం చర్చనీయాంశమవుతోంది. 2023జనవరిలో సుప్రీంకోర్టు కొలీజియం రెండవసారి అమితేష్ బెనర్జీ, సక్యసేన్ పేర్లను కోల్‌కతా హైకోర్టు జడ్జీలుగా ఉన్నతి కోసం పదే పదే సిఫారసు చేసినప్పటికీ ఈ దస్త్రంతెరవబడదని ప్రభుత్వం గట్టిగా చెబుతోంది.అడ్వకేట్ బెనర్జీ 2002లో గోద్రా వద్ద జరిగిన సబర్మతీ ఎక్స్‌ప్రెస్ అగ్నిప్రమాద విషాధంలో 58మంది కరసేవకులు మృతి చెందిన ఘటనపై నియమించిన కమిషన్‌కు నేతృత్వం వహించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి యుసి.బెనర్జీ కుమారుడు. అయితే యుసి.బెనర్జీ ఈ విషాధ ఘటనలో ఎలాంటి కుట్రకోణం లేదని తేల్చిచెప్పారు.అడ్వకేట్ సేన్ కోల్‌కతా హైకోర్టు శాశ్వత జడ్జిగా 1986లో ఉన్నతి సాధించిన జస్టిస్ శ్యామల్‌సేన్ కుమారుడు. ఆ తర్వాత జస్టిస్ శ్యామల్‌సేన్ అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అయ్యారు. అంతేకాకుండా జస్టిస్ సేన్ మే 1999 నుంచి డిసెంబరు 1999వరకు పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా కూడా సేవలు అందించారు. బెనర్జీ, సేన్ పేర్లతోపాటు ముగ్గురు జడ్జిల కొలీజియం అడ్వకేట్ కిర్‌పాల్‌ను ఢిల్లీ హైకోర్టు జడ్జిగా, అడ్వకేట్ సత్యంను మద్రాస్ హైకోర్టు జడ్జిగా, అడ్వకేట్ సోమశేఖర్ సుందరేసన్‌ను బాంబే హైకోర్టు జడ్జిగా సిఫారసు చేసింది. ఇదిలాఉంటే నవంబరు 11న సుప్రీంకోర్టు తదుపరి ప్రధానన్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. డివై.చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగా నవంబరు 10న పదవీవిరమణ చేసిన మరుసటి రోజేజస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరునెలల లోపు తక్కువ కాలంలో 2025మే 13న ఆయన కూడా పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టు పదవీవిరమణ వయస్సు 65సంవత్సరాలకు అనే విషయం తెలిసిందే.

# రాజ్యాంగాన్ని రక్షించడం ప్రధాన పోరాటం

## రాజ్యాంగాన్ని ద్వేషంతో కాకుండా ప్రేమతో రాశారు : రాహుల్

వయనాడ్ : రాజ్యాంగాన్ని రక్షించడం, భద్రపర్చడమే నేడు దేశంలో ప్రధాన పోరాటమని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగాన్ని ద్వేషంతో కాకుండా వినయం, ప్రేమతో రాశారని చెప్పారు. నేడు దేశంలో ప్రథమంగా దేనిపైన అయిన పోరాటం చేయాల్సింది ఉంది అంటే అది భారత రాజ్యాంగం కోసమేనని రాహుల్ నెక్కి చెప్పారు. మనకు లభించే రక్షణ, మన దేశం గొప్పతనం ఇవన్నీ రాజ్యాంగం నుంచి ఉద్భవించినవేనన్నారు. తన సోదరి, ఎల్‌డిఎఫ్ అభ్యర్థి ప్రియాంకా గాంధీ తరుపున ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాహుల్ గాంధీ మనంతవాడిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించారు. మన రాజ్యాంగాన్ని కోపంతోనో, ద్వేషంతోనే రాయలేదన్నారు. బ్రిటీష్ వారితో పోరాటం చేసిన వారు, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న వారు, సంవత్సరాల తరబడి జైలు జీవితం గడిపిన ప్రజలు రాశారని రాహుల్ వ్యాఖ్యానించారు. అందులోనూ ప్రేమ, ఆప్యాయత, వినమ్రతతో రాశారని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు ప్రేమ, ద్వేషం మధ్య, విశ్వాసం, అభద్రత మధ్య పోరాటం సాగుతోందన్నారు. ఈ పోరాటంలో విజయం సాధించాలంటే మీ హృదయాల నుంచి కోపాన్ని, ద్వేషాన్ని తొలగించడానికి మీరే దోహదం కావాలన్నారు. అదే విధంగా ప్రేమ, ఆప్యాయత, కరుణ నింపాలన్నా మీ సహాయం అవసరమని ప్రజలకు సూచించారు. తన సోదరి గుణాలను, చిన్నతనం నాటి జ్ఞాపకాలను రాహుల్ ఈ సందర్భంగా ప్రజలతో పంచుకున్నారు. తాను మొదటిసారిగా తన సోదరి కోసం ఓట్లు అభ్యర్థిస్తున్నానన్నారు. ఆమె ఇప్పటి వరకు తన కోసం, తన తల్లిదండ్రుల కోసమే ఎన్నికల ప్రచారం నిర్వహించిందని చెప్పారు. ఇదిలా ఉండగా, రెండవదఫ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ప్రియాంకా గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధాని నరేంద్ర మోడీ తన స్నేహితులకు ప్రతి ఒక్కటీ సమకూర్చారన్నారు. మోడీ ప్రభుత్వం కేవలం తన వ్యాపార మిత్రుల కోసమే పనిచేస్తుందని మండిపడ్డారు. అతన్ని లక్ష్యం ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించడం కాదని,



యువతకు కొత్త ఉద్యోగాలను సృష్టించరని దుయ్యబట్టారు. అదే విధంగా సరైన ఆరోగ్యం, విద్య సౌకర్యాలను కల్పించరని, ప్రజల క్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజల్లో చీలికలు తీసుకువస్తుందని, వారిలో ద్వేషాన్ని వ్యాప్తి చేస్తుందని, వారి హక్కులను లాక్కోవడంతో పాటు ప్రజాస్వామిక సంస్థలను విధ్వంసం చేస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా హక్కుల కోసం పోరాడుతున్న రాహుల్‌పై దాడులు చేస్తున్నారన్నారు. మనంతవాడిలో పూర్థిస్థాయి వైద్య సౌకర్యాలు కలిగిన వైద్య కాలేజీ కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తానని ప్రియాంక హామీనిచ్చారు. ప్రియాంక తన ప్రసంగంలో రాత్రిపూట నిషేధం, ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు, జంతువులతో మానవుల ఘర్షణలు, పర్వత నియోజకవర్గంలోని గిరిజనులు, వ్యవసాయ సమస్యలను కూడా లేవనెత్తారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) గిరిజన సమాజానికి ఎంతో మేలు చేస్తుందని ఆమె ప్రస్తావిస్తూ, ఈ కార్యక్రమానికి కేంద్రం నిధులు, పథకం ద్వారా ఉద్యోగ లభ్యత తగ్గిపోయిందని ఆరోపించారు. పార్లమెంటులో, అన్ని వేదికలపై తమ వాణిని పెంచాల్సిన అవసరం ఉందని చెబుతూ నిధులను పెంచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కాగా, మనంతవాడిలోని గాంధీ పార్కులో జరిగిన సభ అనంతరం మనంతవాడి అసెంబ్లీ నియోజకవర్గంలోని వాలాడ్ కోరంలో వేర్వేరుగా జరిగిన కార్నర్ సమావేశాలకు ఆమె హాజరయ్యారు.

# 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అమలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

## తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్



చెన్నై: ఒకే దేశం – ఒకే ఎన్నికను అమలు చేసే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని, ఈ చర్యను ఖండిస్తున్నట్లు సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ పేర్కొన్నారు. దేశమంతా ఒకే సారి ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జమిలి' ప్రతిపాదనను ఆయన వ్యతిరేకించారు. తన పార్టీ జిల్లా ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులతో ఆదివారం తొలిసారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టివికెను సంస్థాగతంగా బలోపేతం చేయడం, ప్రజలకు చేరువయ్యే అంశాలపై ప్రధానంగా చర్చించి 26 తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా డిఎంకె, బిజెపి పాలనపై మండిపడిన విజయ్.. తమిళనాడులో శాంతిభద్రతల అంశంపై విమర్శలు గుప్పించారు. తమిళనాడులో కులగణన చేపట్టాలని కోరిన ఆయన.. పరందూర్ విమానాశ్రయం ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిర్దేశిత గడువు నిర్దేశించుకొని క్రమంగా మద్యం దుకాణాలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీరుపైనా విమర్శలు చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ రివ్యూలో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు 2024ను ఫెడరలిజంపై దాడిగా పేర్కొన్నారు. ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా నిలిచిన విజయ్.. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని కోరారు. తమిళనాడు ప్రజల సామరస్యత, ఐక్యత కోసం పనిచేసే తమ పార్టీ సిద్ధాంతం లౌకికవాదం, సామాజిక న్యాయమేనన్నారు.

# పత్తి దిగుమతులపై నిషేధం విధించండి

## ప్రధాని మోదీకి మహారాష్ట్ర పిసిసి చీఫ్ నానా పటోలే లేఖ




ముంబయి : పత్తి దిగుమతులను వెంటనే నిషేధించాలని మహారాష్ట్ర పిసిసి చీఫ్ నానా పటోలే కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దిగుమతుల వల్ల దేశ రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మద్దతు ధర రూ. 7,122కు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో ఈనెల 20వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పటోలే ప్రధాని మోడీకి లేఖ రాశారు. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే మహారాష్ట్ర రెండవ స్థానంలో ఉందని, దాదాపు 40 లక్షలపైగా మంది రైతులు రైతును పండిస్తున్నారని పటోలే ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రం పుష్కలంగా పత్తి దిగుబడిని ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, 22 లక్షల బేళ్ల పత్తి దిగుమతికి సంబంధించిన నివేదికలతో దేశీయ పత్తి ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టడం ఆందోళన వ్యక్తమవుతున్నాయన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పత్తి దిగుమతులపై కేంద్రం తక్షణమే నిషేధం విధించాలని, హామీ ధరకు పత్తిని కొనుగోలు చేసేలా సిసిఐని ఆదేశించాలని పటోలే విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పత్తి ధర క్వింటాల్‌కు రూ.6,500 నుంచి రూ.6,600 మధ్య ఉందని, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) రూ.7,122 కంటే తక్కువగా ఉందన్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తమ పత్తిని అమ్ముకోవడం మానుకున్నారని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. పత్తి నిల్వలు రైతులతో పాటు సిసిఐ వద్ద కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. దేశంలో ఇప్పటికే ఇంత పెద్ద నిల్వ ఉన్న పత్తిని దిగుమతి చేసుకోవడం పత్తి మార్కెట్ పతనానికి దారి తీస్తుందని, వ్యాపారులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చగా, రైతులను గణనీయంగా ప్రభావితం చేస్తుందని పటోల్ చెప్పారు. మహారాష్ట్రలోని పత్తి రైతులు ఇప్పటికే గిట్టుబాటు ధరలేక, వ్యవసాయ పరికరాలపై 12 నుంచి 18 శాతం జిఎస్‌టి, అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతికూల వాతావరణం వల్ల ఈ ఏడాది 19 లక్షల హెక్టార్లలో పత్తి దెబ్బతిన్నదని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారం కాగితాలపైనే మిగిలిపోయిందని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు కాకుండా బీమా కంపెనీలకు మేలు చేస్తుందని పటోలే పేర్కొన్నారు.



# శ్రీనగర్‌లో గ్రెనేడ్ దాడి

శ్రీనగర్ : జమ్ము కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో ఆదివారంనాడు గ్రెనేడ్ దాడి జరిగింది. టూరిస్ట్ రెసెప్షన్ సెంటర్ (టిఆర్‌సి) సమీపంలో రద్దీగా ఉండే మార్గెట్‌పై ఉగ్రవాదులు ఈ దాడి జరిపారు. ఈ ఘటనలో 11 మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది. క్షతాగాత్రులను హుటాహుటిన ఎస్‌హెచ్‌ఎంసి ఆసుపత్రిలో చేర్చారు. శ్రీనగర్‌లో వరుసగా రెండో చోటు ఉగ్ర ఘటనలకు చోటుచేసుకోవడంతో స్థానిక దుకణదారుల్లో ఆందోళన వ్యక్తమైంది. లోయలో గత కొద్ది రోజులుగా దాడులు, ఎన్‌కౌంటర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయనీ, ఆదివారం శ్రీనగర్‌లో సండే మార్కెట్‌లో అమాయక దుకాణదారులపై గ్రెనేడ్ దాడి జరగడం దు రదృష్టకమని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక ప్రజలను టార్గెట్ చేయడాన్ని ఏమాత్రం సమర్థనీయం కాదదన్నా రు. భద్రతా బలగాలు సాధ్యమైనంత త్వరలో ఈ వరుస దాడులకు కళ్లెం వేయాలని, తద్వారా ప్రజ లు ఎలాంటి భయాందోళనలు లేకుండా జీవనం సాగించడం సాధ్యమవుతుందన్నారు. డౌన్‌టౌన్ శ్రీనగర్‌లోని ఖన్యార్ ప్రాంతంలో భద్రతా బలగా లు శనివారంనాడు లష్కరే తొయిబా టాప్ కమాండర్ ఒకరని మట్టుబెట్టిన క్రమంలో శ్రీనగర్ లో తాజా దాడి చోటుచేసుకుందని పోలీసు వర్గా లు అనుమానిస్తున్నాయి. ఘటనా స్థలికి చేరుకు న్న భద్రతా బలగాలు క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్చడంతో పాటు ఉగ్రవాదులను పట్టుకునేందుకు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

# సాహితీ విహారి

# గేయం ఒకటే... భావాలెన్నో!

5న దాశరథి కృష్ణమాచార్యుల వర్థంతి

'దాశరథి'గా సుపరచితులైన దాశరథి కృష్ణమాచార్యుల గురించి ప్రత్యేంగా చెప్పాలనుకోవడం సూర్యుడిని దివిటీతో చూపించే ప్రయత్నం చేయడమే. తెలంగాణలో అగ్రగణ్యులైన సాహితీవేత్తల్లో ఒకరైన దాశరథి వేలాది గేయాలు, పద్యాలు రాశారు. ఆయన ప్రతిభకు మచ్చుతునకగా చెప్పుకోదగినది 'ఆ చల్లని సముద్ర గర్భం..' గేయం. ఎన్నో భావాలను, ఆలోచనలను ప్రజ్వలింప చేసే ఆ పాట గురించి ఎంత చెప్పినా తక్కువే.

**ఆ చల్లని సముద్ర గర్భం**
**దాచిన బడబానలమెంతో?**
**ఆ నల్లని ఆకాశంలో**
కానరాని భాస్కరులెందరో? అంటూ ప్రారంభమయ్యే పల్లవితోనే ఆయన సాహితీ మహోన్నత శిఖరాలను అధిరోహించారు. తెలంగాణ ప్రాంతంలో ఎక్కడికి వెళ్లినా, ఉద్యమ నేపథ్యంలో ఏ కార్యక్రమం జరిగినా ఈ పాట వినిపించి తీరుతుంది. రచయిత సంధించిన ఒక్కో ప్రశ్న మన సులోతుల్లోకి దూసుకెళుతుంది. సమాధానాలను వెతుక్కోవాలని సూచిస్తుంది. ఆ వెంటనే సమాజంలో నిరాటంకంగా కొనసాగుతున్న దోపిడీ వ్యవస్థల వికృత రూపం మన కళ్ల ముందు కదలాడుతుంది. రచయిత చెప్పిన చల్లని సముద్ర గర్భం సగటు మానవ సమూహమైతే, దాచిన బడబాగ్నులు వారి ఆవేదనకు, ఆగ్రహాలకు నిదర్శనాలు. ఆశలు, ఆశయాలు చితికిపోయి, జీవితాల్లో కన్నీటి ధారలు తప్ప మరేమీ లేని పరిస్థితులు, అదే సమయంలో తిరగబడాలని అంతరాంతరాలలో కదలాడుతున్న తపనను ఈ రెండు పంక్తులు వివరిస్తాయి. 'ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో' అంటూ నిలదీస్తాడు రచయిత దాశరథి. అసమానతలు... దోపిడీలు.. అణచివేతలను నల్లని ఆకాశంతో పోల్చాడు. వాటిని ఎదిరించి, పోరాడే ఆగ్రహావేశాలు ఉన్న యోధులు ఎంతో మంది ఉన్నారంటూ దోపిడీదారులకు హెచ్చరికలు కూడా జారీ చేస్తాడు. ఉవ్వెత్తున ఎగసిపడే ఉద్యమ తరంగాలను నిరోధించడం అసాధ్యం. అదే విధంగా కష్టాల చీకట్లను తరిమికొట్టే క్రాంతి కిరణాలను ఎవరూ అడ్డుకోలేదు. వందల వేల సంఖ్యలో ఉద్యమకారులున్నారన్న అర్థం రచయిత పదాల్లో గోచరిస్తుంది.

**'భూగోళం పుట్టుక కోసం**
**కూలిన సురగోళాలెన్నో?**
**ఈ మానవ రూపం కోసం**
**జరిగిన పరిణామాలెన్నో?'** భూగోళ ఆవిర్భావానికి సంబంధించి లెక్కలేనన్ని సిద్ధాంతాలున్నాయి. అయితే, భూమి పుట్టుక ఏ ఒక్కరోజు లేదా అతి కొద్దికాలంలోనే జరగలేదని ఈ పంక్తుల్లో స్పష్టం చేస్తున్నాడు రచయిత. వివిధ మత గ్రంథాలు పేర్కొన్నట్టు భూగోళాన్ని ఎవరో ఒకరు సృష్టించలేదని చెప్పకనే చెప్పారు. ఎన్నో సురగోళాలు కూలితేగానీ భోగోలం ఆవిర్భవించలేదు. విజ్ఞాన శాస్త్రం చెప్తున్న నిజాలను వివరిస్తూ, మతం పేరుతో మూర్ఖపు వాదన చేసే వారికి చెంపపెట్టు సమాధానాన్ని ప్రశ్న రూపంలో ఇవ్వడం రచయిత చాతుర్యానికి నిదర్శనం. అదే విధంగా ఎన్ని పరిణామ క్రమాలను దాటిన తర్వాత మానవుడు ప్రస్తుత రూపాన్ని సంతరించుకున్నాడన్నది డార్విన్ తన సిద్ధాంతంలో వివరించాడు. అదే అంశాన్ని దాశరథి మర్మగర్భంగా ప్రస్తావిస్తూ, మనిషిని ఎవరూ తయారు చేయలేదని తేల్చిచెప్పాడు. మానవ పరిణామక్రమాన్ని గుర్తుచేస్తూ, అంధ విశ్వాసాలను పారద్రోలే ప్రయత్నం చేశాడు. మత విశ్వాసాలను ఖండించాడు.




**'ఒక రాజును గెలిపించుటలో**
**ఒరిగిన నర కంఠాలెన్నో?**
**శ్రమజీవుల పచ్చి నెత్తురులు**
**త్రాగని ధనవంతులెందరో?'** అనే చరణంలో చారిత్రక నగ్నసత్యాలను ఆవిష్కరిస్తాడు. రాజులు యుద్ధాలు చేశారని, మహావీరులనీ భజన చేసే సామ్రాజ్యవాద కట్టుబానిసలకు మొదటి రెండు పంక్తులు సరైన సమాధానాన్నిస్తాయి. ఒక రాజు గెలిచాడంటే, ఎంతో మంది సామాన్యుల ప్రాణాలు గాల్లో కలిశాయన్నది నిజం. సైనికులేకాదు.. ప్రజలు కూడా యుద్ధాలకు బలవుతారు. ఇప్పటికీ ఈ వైనం మన కళ్ల ముందు కనిపిస్తునే ఉంది. గాజా లేదా బీరూట్... ఎక్కడైతేనేం? హమాస్ లేదా హిజ్బొల్లా.. ఎవరైతేనేం? యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోతున్నది. మాత్రం సామాన్యుడే. వేలాది మంది ప్రాణత్యాగమే ఒక రాజును లేదా రాజ్యాన్ని గెలిపిస్తుంది... నిలబెడుతుంది. ఇక శ్రమ దోపిడీ గురించి ఎంత చెప్పినా తక్కువే. దోపిడీదారుడు నిరంతరం దోచుకుంటునే ఉంటాడన్న నిజాన్ని రచయిత రెండు పంక్తుల్లో చెప్పాడు. శ్రమ జీవుల పచ్చినెత్తును తాగని ధనవంతుడు లేనేలేడని తెల్చేశాడు. కోట్లకు పడగలెత్తే వారంతా ఏ రీతిలో శ్రమ దోపిడీకి పాల్పడ్డారో సూక్ష్మంగానేగానీ, చాలా బలంగా చెప్తాడు దాశరథి.

**'అన్నార్తులు అనాథలుండని**
**ఆ నవయుగ మదెంత దూరమో?**
**కరువంటూ కాటకమంటూ**
కనిపించని కాలాలెపుడో?' అనాథలుగానీ.. అన్నార్తులుగానీ ఉండని నవయుగాన్ని రచయిత కోరుకున్నాడు. ఆకలి లేని రాజ్యం రావాలని కలలుకన్నాడు. కానీ, అది ఎంత దూరంగా ఉందోనని అనుమానం వ్యక్తం చేస్తాడు. దార్శనికుడు దాశరథి అనుమానం నిజమే. ఇప్పటికీ అలాంటి సమాజం రూపొందలేదు. ఆకలి కేకలు సమసిపోలేదు. అనాథలను ఆదుకునే ఆపన్న హస్తాలు అసలే లేవు. కరువు కాటకాలు లేని కాలాలు ఎప్పుడు వస్తాయా అని ఆత్రంగా ఎదురుచూశాడు. అలాంటి వాతావరణం అంటూ ఏర్పడుతుందా అన్న సందేహం కూడా అందులో కనిపిస్తుంది. ఆకలితో అల్లాడే వారు లేనేలేని సమాజ స్థాపన కోరుకున్నాడుగానీ, దురదృష్టవశాత్తు ఇప్పటికీ ఆ కల సాకారం కాలేదు.

**'అణగారిన అగ్ని పర్వతం**
**కనిపెంచిన 'లావా' ఎంతో?**
**ఆకలితో చచ్చే పేదల**
శోకంలో కోపం యెంతో?' అగ్నిపర్వతం పైకి ప్రశాంతంగా కనిపించినప్పటికీ, లోలోన లావా ఉప్పొంగుతునే ఉంటుంది. కంటికి కనిపించనంత మాత్రాన అది లేదనుకోవడం, పర్వతాన్ని బద్దలుకొట్టుకొని బయటకు రాదని ఊహించడం ప్రమాదకరం. ఆకలితో అల్లాడుతున్న పేదల్లో గూడుకట్టుకున్న కోపం కూడా లావా మాదిరి ఎప్పుకో ఒకసారి బయటపడుతుందని, అప్పుడు దుర్మార్గపు పాలన ముగుస్తుందని కవి హృదయం. లావా మాదిరి ఉబుకుతున్న కష్టజీవి ఆకలి శోకంలో కోపం కట్టలు తెంచుకోవడం తథ్యమని చెప్పకనే చెప్తున్నాడు దాశరథి. పసిపాపల భవిష్యత్తులపై కమ్ముకున్న నీలినీడలను, కవి గుండె లోతుల్లో తచ్చాడుతున్న కావ్యాలను ఉదహరిస్తూ...

**'పసి పాపల నిదుర కనులలో**
**ముసిరిన భవితవ్యం ఎంతో?**
**గాయపడిన కవి గుండెల్లో**
**రాయబడని కావ్యాలెన్నో?'** అంటాడు. పసిపాపల కనుపాపల కదలాడే దైన్యాన్ని అందరికంటే ముందుగా చూశాడు దాశరథి. అసమానతలు, వైషమ్యాల ఉచ్చులు వాళ్ల జీవితాలను ఏ విధంగా నరకప్రాయం చేస్తాయో ఊహించగలిగాడు. సమాజంలో పేరుకుపోయిన కుళ్లు చూసి గాయపడిన మనసుతో బాధపడ్డాడు. ఎన్ని బాధలను, కష్టాలను వర్ణిస్తూ కవులు ఎన్ని రచనలు చేస్తున్నా, ఇంకా మనసు పొరల్లో కొట్టుకులాడుతున్న గాధలు ఎన్నో ఉంటాయని తేల్చిచెప్తాడు.

**'కులమతాల సుడిగుండాలకు**
**బలియైన పవిత్రులెందరో?**
**భరతావని బలపరాక్రమం**
**చెరవీడేదింకెన్నాళ్లకో?'** అంటూ దేశం దేశంలాలేని వైనాన్ని కళ్లకు కట్టాడు. కులమాతల సుడిగుండాల్లో చిక్కుకొని ఆశలనేకాదు.. జీవితాలను కూడా కోల్పోయిన వారు ఎంతో మంది ఉన్నారు. ఈ క్రూర మనస్తత్వాలకు, మూఢ విశ్వాసలకు బలైన ఎంతో మంది అమాయకులను పవిత్రులుగా పేర్కోవడంలోనే వారి పట్ల రచయితకు ఉన్న ఉన్నత స్థానం స్పష్టమవుతుంది. కులమతాలు లేని సమాజాన్ని కవి కోరుకున్నాడు. తాడిత, పీడిత, అణగారి వర్గాల పక్షాల నిలిచి సమాజాన్ని దాశరథి ప్రశ్నించిన తీరు అద్భుతం. అణచివేతలకు, దౌర్జన్యాలకు, కక్షలకు, కార్పణ్యాలకు కారకులైన వారి తీరును ఎండగట్టాడు. ఎన్నో సామాజిక పార్శ్వాలను స్పృశించే ఈ గేయం అజరామరం.

– సత్య శ్రీ




## కాలాతీత గ్రంథాలయం!

క్రీస్తుపూర్వం కొన్ని వేల సంవత్సరాల క్రితమే గ్రంథాలయాలు ఉంటాయని అంటారుగానీ, నిర్దిష్టమైన ఆధారాలు లేవు. ఒకవేళ కొన్ని అవశేషాలు పురావస్తు తవ్వకాల్లో బయటపడిపడినప్పటికీ, అవి ఏనాడో కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పటికీ మనుగడలో ఉన్న అతి పురాత గ్రంథాలయంగా ఈజిప్టులోని సినాయ్ ద్వీపకల్పం, మౌంట్ సినాయ్ (బెజెల్ మూసా) పాదాల వద్ద ఉన్న సెయింట్ కేథరిన్ మోనాస్ట్రీ లైబ్రరీ తన ప్రత్యేతను చాటుకుంటున్నది. క్రీస్తు శకం 527లో ప్రారంభమైన ఈ లైబ్రరీ వయస్సు అక్షరాలా 1499 సంవత్సరాలు. బైజాంటియన్ చక్రవర్తి జస్టినియన్ I అదేశాల మేరకు క్రీస్తు శకం 527లో ప్రారంభమైన ఈ లైబ్రరీ భవన నిర్మాణాలు 565లో ముగిశాయి. ఆ ప్రాంతంలో అనధికారిక క్రైస్తవ మత సంఘం ఉండేది కాబట్టి, ఈ లైబ్రరీ అంతకు ముందు నుంచే కొనసాగుతుండవచ్చన్న వాదన కూడా ఉంది. రోమన్ సామ్రాజ్యం చివరి దశలో, ప్రముఖ యాత్రికుడు ఎగేరియా క్రీస్తు శకం 383లో రాసిన తన అనుభవాల గ్రంథంలో, సివాయ్ గ్రంథాలయం గురించి ప్రస్తావించాడు. అక్కడ అనేక రాత ప్రతులు, గ్రంథాలు ఉన్నాయని వివరించాడు. ప్రపంచంలోనే మరెక్కడాలేని అనేక రాతప్రతులు అక్కడ ఉన్నాయి. కనీసం 3380 అత్యంత పురాతన గ్రంథాలు, పత్రాలు (పాలిమెర్స్) అక్కడ ఉన్నాయని చెప్తారు. వాటిని భద్రంగా దాచిపెట్టారు. కొన్ని గ్రంథాలను ప్రచురించి, పాఠకులకు అందుబాటులో ఉంచారు. గత దశాబ్దకాలంగా అంతర్జాతీయ ఇమేజింగ్ శాస్త్రవేత్తల బృందం ఇక్కకి రాత ప్రతులను స్కానింగ్ చేసి, వాటికి డిజిటల్ రూనాన్ని ఇస్తున్నది. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నది. ఆ పనులు పూర్తయిన తర్వాత, ప్రపంచానికి పురాతన గ్రంథాలు అందుబాటులోకి వస్తాయి. నాటి చరిత్రను తెలుసుకోవడానికి, అధ్యయనం చేయడానికి ఉపయోగపడతాయి.



## చరిత్రను తెలిపే శాసనం



రాతి పలకలపై చెక్కిన శాసనాలు ఆయా కాలాల చరిత్ర తెలుపుతుందని, వివరాలు తెలియచేస్తుందని అనడానికి ప్రకాశం జిల్లా (ఆంధ్రప్రదేశ్) అయ్యంబొట్లపల్లిలో లభించిన శాసనమే నిదర్శనం. తెలుగులో రాసి ఉన్న ఈ శాసనం తెలంగాణ సాహినీ రాజవంశానికి చెందిన కాయస్థ రాజు గంగాయ మరణ కాలాన్ని వివరిస్తుంది. ఆయన క్రీస్తు శకం 1262లో మరణించాడని ధ్రువీకరించే శాసనంలోని సమాచారం ద్వారా పురావస్తు నిపుణులు గుర్తించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) మైసూరు శాఖకు చెందిన నిపుణులు ఈ శాసనంలోని వివరాలను నేటి వాడుక భాషలోకి మార్చి ప్రకటించారు. సాహినీ కాయస్థ రాజవంశానికి తొలి పాలకుడిగా గంగాయను పేర్కొంటారు. అతనికి కాకతీయ రాజవంశానికి చెందిన గణపతి దేవ చక్రవర్తితో స్నేహసంబంధాలు ఉన్నాయి. కాయస్థ పాలకులు ప్రస్తుత తెలంగాణలోని నల్లగొండ జిల్లా పానుగల్లు నుంచి ప్రస్తుత కర్నాటకలోని కోలార్ సమీపంలో ఉన్న చింతామణి వరకు రాజ్యాన్ని విస్తరించారు. కాయస్థులు వివిధ కారణాలవల్ల ప్రస్తుత మహారాష్ట్ర ప్రాంతం నుంచి ఆంధ్రకు వలసవచ్చినట్టు భావిస్తున్నారు. కాగా, తెలుగులో ఉన్న ఈ శాసనం ప్రకారం గంగాయ శక సంవత్సరం 1184, దుందుభి నామ సంవత్సరం, భాద్రపద సుద్ధమి రోజున మరణించాడు. అంటే ఆయన మరణించిన తేదీ క్రీస్తుశకం 1262, ఆగస్టు 21. ఈ శాసనం ద్వారా ప్రస్తుత తెలుగు రాష్ట్రాలు ఉన్న ప్రాంతంలో ఎవరెవరి పాలన కొనసాగిందో, ఆయా కాలాల్లో సామాజిక పరిస్థితులు ఏ విధంగా ఉండేవో అధ్యయనం చేయడానికి మార్గం ఏర్పడింది.

# పదును తగ్గని 'వజ్రాయుధం'

అప్పుడెప్పుడో... దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో, ఆవంత్స సోమసుందర్ సంధించిన 'వజ్రాయుధం' పదును నేటికీ తగ్గలేదు. మార్క్సిజాన్ని అణువణువునా నింపుకొన్నారు కాబట్టే, దేశకాల పరిస్థితులను అర్థం చేసుకున్నారు. దోపిడీ వ్యవస్థను వ్యతిరేకించారు. దేశ పరిస్థితిని కళ్లకుకట్టినట్టు చూపారు. సామాజిక రుగ్మతలపై ఆయన నడిపిన అక్షర కవాతు 'వజ్రాయుధం'. 1949లో తొలి ముద్రణ... తాజాగా ఇప్పుడూ మరోసారి ముద్రితమైంది. ఒక కవికి... కవిత్వానికి శాశ్వతత్వం ఉందనడానికి ఇంకంటే నిదర్శనం ఏముంటుంది? నాటి తొలి ముద్రణ తొలిపలుకుల్లోనే రాంషా ఈ పుస్తకాన్ని గొప్పగా విశ్లేషించారు. ఒక వ్యక్తి సాంఘిక జీవితమే అతని చైతన్యాన్ని నిర్ణయిస్తుందన్న మార్క్స్ మాటలు సోమసుందర్‌పై బలంగా పని చేశాయి. అందుకే, మనిషి సాంఘిక జీవితం ప్రగతిపథంలో సాగాలని కోరుకున్నారు. అదే సమయంలో సమాజ తీరుతెన్నులను, దోపిడీ ధోరణులను ఎదిరించే అక్షరాలు పంపించారు.

**'తన చరిత్ర తనె పఠించి ఫక్కున నవ్వింది ధరణి'**

తన గాథను తనె స్మరించి, భోరున ఏడ్చింది ధరణి' అంటూ వాస్తవాలు వక్రీకరించే విధానాన్ని, దేశ దుస్థితిని సూటిగా, నిర్మొహమాటంగా చెప్పారు. ఇది ముమ్మాటికీ పరాధీన పురాలోకమే. ఎక్కడ చూసినా వక్రగతి కృతకత్వమే. ఈ వాక్యాలు రాస్తూ 'నిరాశనలమ్మె దీనులు వ్రేల్చిన కుటిలత్వం' అని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ వ్యవస్థను గురించి చెప్తూ 'నిర్భాగ్యుల గుండె చీల్చి

**ధనికులు త్రావిన రక్తం**
**నరభక్షకుడగు దుందుభి**
**కట్టిన ఎముకల దుర్గం'** అంటారు కవి. 'ధ్రువతార' కవితలో రష్యా విప్లవయోధుడు లెనిన్‌ను 'శతసహస్ర విశ్వశ్రామిక సేనల అక్షౌహిణికి అధినేత'గా అభివర్ణించారు. దుర్మార్గపు రాచరికం నుంచి రష్యాను విముక్తం చేయడంలో కీలక భూమిక పోషించిన లెనిన్‌ను శాంతి కోసం విప్లవ శంఖం పూరించిన వ్యక్తిగా పేర్కొన్నారు. 'ఖరార్‌నా మా' కవితలో మనిషితో 'ఒప్పందం' కుదుర్చుకుంటారు.

**'అస్తిత్వ ప్రయోజనం**
**ఊహకు అందనిదవగా**
**తన చరిత్ర చెరిపేసుక,**
**తనదారిని మళ్లిపోయే**
**మానువుడిక పుట్టబోడుస;**
**సుడిగుండంలో పడి తిరగడు'** అని ఆశాభావం వ్యక్తం చేస్తారు.ఉన్నదొక్క జీవితమేనని, మానవునిగ, వీరునిగా బతకాలని హితవు పలుకుతారు. 'మౌనఘోష'లో పేదల ఆకలి కేకలు వినిపిస్తాయి. 'లోపలి కోరిక'లో భరత మాత తో సంభాషిస్తూ, అత్యధిక శాతం మంది బడుగువర్గాల జీ వితాలపై ప్రశ్నలు వేస్తారు. సమాధానలనూ కవి సూచించడం విశేషం. 'భగత్‌సింగ్' ఘనతను ఒక కవితలో శ్లాఘిస్తారు. 'ఫ్యాక్టరీ'ని అహంకార దిక్కృతిగా పేర్కొంటారు. భువిపేగులు దద్దరిల్లేలా నీతిమాలి




గర్జిస్తున్నదంటూ శ్రమ దోపిడీని కళ్లకుకట్టారు. 'బాడుగ గోడీలు' సామాన్యులపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే, 'ఆకలి నాలుకలన్నీ' కవిత పేదల బతుకు చిత్రాన్ని, ఆకలి బాధను వివరిస్తుంది. ఈ పుస్తకం చివరిలో 'బానిసల దండయాత్ర', 'మలయా ప్రభంజనం' అనే సుదీర్ఘ కవితలున్నాయి. మొదటి కవితలో సామ్రాజ్యవాదానికి, మానవ హక్కులకు మధ్య జరిగే ఘర్షణను వివరిస్తే, రెండో కవితలో మలయా విప్లవాన్ని, పోరాటాన్ని ఆవిష్కరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, 'వజ్రాయుధం' నిజంగానే దోపిడీవర్గాల కుత్సితాలను తెగనరికే రచనల ఖడ్గమే. నాటికి, నేటికీ దోపిడీ చేస్తున్న వర్గం, దోపిడికి గురవుతున్న వర్గం కొనసాగుతునే ఉన్నాయి. పోరాటాలు, ఉద్యమాలు జరుగుతునే ఉన్నాయి. దేశాన్ని తిరోగమన పథంలో వేగంగా తీసుకెళుతున్న ధనికవర్గ అనుకూ పాలకులు చేస్తున్న దురాగతాలపై 'వజ్రాయుధం' ఇప్పటికీ ఓ అస్త్రమే. ఈ ఆయుధం పదును తగ్గలేదు. నిజానికి మరింత పెరిగింది. సమసమాజాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.

**పుస్తకం పేరు: వజ్రాయుధం**
**రచయిత: ఆవంత్స సోమసుందర్**
**వెల: రూ. 80**
**ప్రతులకు..**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్**
**12-1-493/VA**
**గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జిఎస్ఐ పోస్టు**
**హైదరాబాద్: 500068, తెలంగాణ**
**ఫోన్: 040–29884453/54.**

## ఈ వారం కవితలు

### పల్లె తల్లి బాధలు



కోడి కూతలు మాయమై..
సెల్ అలారమ్ మోతలు మోగె
భానుడి స్పర్శ తాకినాకె..
ఊరంతా ఒళ్లు విరిచి లేచే
యాప పుల్లలు చిన్నబోయి..
టూత్ బ్రష్‌లు నోట్లో నాట్యమాడె
సద్దన్నం అంతరించి..
చాయ్, టిఫిన్ పుట్టుకొచ్చె
ఊరు సావడి ఎడారై..
టివీలకు అతుక్కు పోయే
ఇంటి అరుగులు మూగబోయి..
సెల్ ఫోన్లో ఊరి జనం దూరె
పొద్దుట నుంచే పల్లె గాలిలో..
గుప్పున గుడుంబా వాసన కమ్మె
ఊరి జనం ఛీప్ లిక్కరు తాగి..
పల్లె దారులెంట ఊగి తూగె
ఇరుగు పొరుగు బంధాలు తరిగి..
యూట్యూబ్ ముచ్చట్లకు ఎగబడి
బర్రె, ఆవు పాలు అరుదై పోయి..
ప్యాకెట్ పాలు దర్శనమిచ్చె
కూరగాయలు కరువై పోయి..
ఊరంతా దుకాణానికి పరుగిడె
కోతుల దాడులకు భయపడి..
పల్లె పల్లంతా తలుపులు మూసె
కాలి నడక, సైకిల్ దూరమై..
బైకులు, ఆటోలు పుట్టుకొచ్చె
పనిబాటలకు పల్లె జనమంతా..
పట్నం పనులకు ఎగబడె
పెంకుటిండ్లు కూలి పోయి..
కాంక్రీట్ కొంపలు ప్రత్యక్షమాయె
సాగు భూమి ధరలు కొండెక్కి..
పట్నం ఆసాముల పంచన చేరె
అన్నదాత నాగలి తుప్పుపట్టి..
ట్రాక్టర్ మోతలు సాలు పట్టె
పల్లె వాసనలు పలుచబడి..
పట్నం మేకప్ రంగులు వేసె
ఎద్దు ఎగుసం మాయమై&
యాంత్రీకరణ పుట్టు కొచ్చె
నీతి న్యాయ దీపాలు కొండెక్కి..
వ్యాపార సంబంధాలు మెలిచె
పెళ్లి పందిళ్లు పాత కథలై..
టెంట్ షామియానాలు వెలిసె
సర్కారు బడి పోరగాండ్లు తగ్గి..
ప్రైవేటు బడుల దారి పట్టె
నాటి పల్లెల సువాసనలు పోయి..
పట్నం వేషం కట్టి మురిసి పోయె
మానవత్వాలు మాసి పోయి..
నకిలీ ఇకమతులు పక్కున నవ్వె
ఏక తాటిపై నడిచిన పల్లె..
ఎక్కెక్కి ఏడుస్తూ చేతులెత్తేసె !

**మధుపాళీ**
**9949700037**

### ఒద్దొద్దు 'ఉపా చట్టం'

ఉద్యమించాలే.. ఉద్యమించాలే
ఈ ఉపా చట్టమొద్దంటూ ఉద్యమించాలే
దండు గట్టాలే.. దండు గట్టాలే
ఈ కుట్ర చట్టాలొద్దంటూ దండు గట్టాలే
ఉన్నది ఉన్నట్లంటే తీవ్రవాదులంటుంద్రు
ఉపా చట్టాలంటూ ఉసురుదీసి సంపుతుంద్రు
పెన్ను మీద గన్ను వెట్టి నరమేధం జేస్తుంద్రు
రాజ్యం నూరిన కత్తికి మేధావుల భళిస్తుంద్రు
హక్కుల నేతల పైన తప్పు కేసులేస్తున్నరు
లేనిపోని నేరాలు నెత్తి మీద ఏస్తున్నరు
ఇండ్ల మీద సోదా చేసి చెరసాలలో పెడుతున్నరు
మాట్లాడే హక్కుపై నిర్బంధం చేస్తున్నరు
ప్రజా హక్కులపై ఉక్కు పాద మేస్తున్నరు
నినదించే గొంతులను అంతమొందసూస్తున్నరు
ప్రభుత్వాల ప్రశ్నిస్తే ప్రాణాలను తీస్తున్నరు
నాజీలను మించినట్టి యమపాలనా చెస్తున్నరు
ఓట్లేసిన జన మంతా ఒకటవ్వాలే ఒకటవ్వాలే
ఉపా చట్టం రద్దు కొరకు ఉద్యమించాలే
ఉద్యమించాలే... నియంతృత్వ సర్కారును
గద్దె దింపాలే గద్దె దింపాలే...
యెతలు లేని సమాజాన్ని ఎన్నుకోవాలే
మనం ఎన్నుకోవాలే...



**గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, 9866510399**

### సెల్ ( ఫోన్) మోహనరంగా

సెల్ ఫోన్ ఓ మినీ ప్రపంచం శ్రీ
కృష్ణ లీలలను మించి
ఓ అద్భుత మాయాజాలం
ధ్వని తరంగం ఆవిష్కరించు అంతరంగం

ఇల్లాలి ముచ్చట్లు శ్రీవారి అగచాట్లు
పేకమేడలు పాకులాటలు
టీవి సీరియల్ జీవితాలు
పెళ్ళిలకు పేరంటాళ్లుచావులు తద్దినాలు

లంచాలకు మంచాలకు
అవసరాలకు అనవసరాలకు
సిద్ధాంతాలకు రాద్ధాంతాలకు
సెల్ ఫోన్ ఓ తుంటరి టక్కరి

ఓ విదూషకుడు ఓ అవధాని
ఓ వరం సెల్ ఫోన్ ఓ జలగ ఓ జిడ్డు
సర్వరోగాలకు హేతువు
ఆరిపోయే దీపాలకు దాతువు

ట్రిక్ లోజయం
చిటికెలోమాయం
ఏమిరా ఈ సెల్ ఫోన్
ప్రపంచాన్ని ఖైదు చేసింది

జేబుదొంగల పట్టిస్తుంది
జేబులో రూకల పుట్టిస్తుంది
నాడు తోకలేని పిట్ట
నేడు నసపెట్ట ఓ వసపిట్ట

ఓ అగంతకుడు మానస చోరుడు
జేబుదొంగల పట్టిస్తుంది
జేబులో రూకల పుట్టిస్తుంది
పిజ్జా బర్గర్ సర్వర్ సెల్ పోన్
చాటింగులు డేటింగులు
ఈటింగులు లూటింగులు

ఏకాంతవాసంలో సహచరి
పెట్టాలన్న తిట్టాలన్న
కొట్టాలన్న నెట్టాలన్న
అన్నిటికీ ఒకే తాయిలం సెల్ ఫోన్

సర్వర్ డౌన్లకు హ్యాకింగ్లకు
చెకింగ్లకు ఎమర్జన్సీకీ
యుద్ధానికి యుద్ధ నివారణకు
రాయబారాలు నెరపి
దౌత్య సంబంధాలు కలిపి
దేశదేశాల చుట్టేస్తుంది



గూగుల్ మాయా బజార్‌లో
సెల్ పోన్ ఓ మత్తు
బతుకు చిత్తు సెల్ ఫోన్ ఓ గమ్మత్తు

ఏంటి సంగతి పాప ఏడ్చింది
సెల్ అందుకో నవ్వులకు
ఏడుపులకు ముడుపులకు
అనంత కోటి ఆలోచనలతో
ప్రపంచశాంతికీ విశ్వంతరాలను
తాకి భవిష్యత్ దర్శశినిగ నిలుస్తుంది

**డా. భూతం ముత్యాలు**

## కడవరకూ కమ్యూనిస్టుగా జీవించడం కొందరికే సాధ్యం

సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** అత్యున్నతమైన వ్యక్తిత్వం కలిగిన వారే కడవరకు కమ్యూనిస్టులుగా జీవిస్తారని సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్ అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామంలో సిద్దినేని కోటయ్య 18వ వర్ధంతిని నిర్వహించారు. సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టులకు సామాజిక స్పృహతో పాటు పార్టీ పట్ల ఉన్న అంకితభావంతోనే సాధ్యమవుతుందన్నారు. కమ్యూనిస్టుగా మృతిచెందిన తర్వాత మృతదేహంపై ఎర్రజెండా కప్పుకోవడం ఎంతో ఉన్నతమైన క్షణంగా అభివర్ణించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిద్దినేని కర్ణకుమార్, మంగయ్య, బోస్, గట్ల బాబు, ఉదయ్‌కుమార్, ఉపేందర్, శేఖర్, నందయ్య, వెంకటేష్, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ మల్లేశ్వరి మృతికి సిపిఐ నాయకుల సంతాపం



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలం విట్టల్‌రావునగర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి మణుగూరు ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తూ శనివారం భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మీ నారాయణ, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె సర్వర్, ఎఐటియుసి మణుగూరు మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, పట్టణ కార్యవర్గ సభ్యులు మంద కోటి, రావుల రాములు తదితరులు మల్లేశ్వరి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## పెద్ద కమల మృతికి ఎఐటియుసి నివాళి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** స్థానిక జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్‌లో డిఎల్‌ఆర్ కార్మికురాలిగా పనిచేస్తున్న పెద్ద కమల అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఎఐటియుసి, సిపిఐ నాయకులు కమల పార్దీవదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళ్ళులర్పించిన వారిలో నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ళ యోబు, డిఎల్‌ఆర్ కార్మికులు తదితరులున్నారు.

## నాదెండ్లకు మంత్రి పొంగులేటి నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాదెండ్లబాబురావుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. ఇటీవల ఆయన మరణించగా ఆదివారం దశదినకర్మను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాదెండ్ల ఆశయసాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య, బండి జగదీష్, యువజన కాంగ్రెస్ నాయకులు తమ్మినేని నవీన్, బెల్లం శ్రీను, కళ్లెం వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కొప్పుల అశోక్, భూక్య సురేష్‌నాయక్, దండ్యాల వెంకటేశ్వరరావు, నాగండ్ల శ్రీనివాసరావు, ఆరెంపుల రామయ్య, తేజావత్ పంతుల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేకు మెటీరియల్ అందజేత



**ప్రజాపక్షం/కల్లూరు :** సమగ్ర కుటుంబ సర్వే కొరకు కల్లూరులోని తహశీల్దార్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే మెటీరియల్‌ను ఆదివారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని సర్వే సిబ్బంది 170 మంది ఉన్నట్లు తహశీల్దార్ పులి సాంబశివుడు తెలిపారు. సూపర్‌వైజర్లు, పర్యవేక్షకులు సర్వే సిబ్బంది వారికి అవసరమగు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీఓ ఏనుగు సురేష్ బాబు తదితరులు పరిశీలించారు. సర్వే సమయంలో ఆధార్, రేషన్, పట్టాదారు పాస్ బుక్, కులములకు సంబంధించిన సంబంధిత పత్రాలను సర్వే సిబ్బందికి తప్పనిసరిగా చూపించి నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ వివరించారు.

## పోలీసుల డ్రోన్ దాడులను నిరసిస్తూ సిజిలో ఆదివాసీల ర్యాలీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని బీజాపూర్‌లో ఆదివాసీ గ్రామాలపై పోలీసులు డ్రోన్ దాడులు చేస్తున్నారని, ఇది తమకు తీవ్ర ఇబ్బంది కరంగా ఉందంటూ ఆదివాసీ గ్రామాల ప్రజలు దండకారణ్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివా సీ గ్రామాలపై విచక్షణా రహితమైన దాడులు చేయడం సరికాదని, మహిళలను కూడా లైగింకంగా వేదిస్తున్నారని, మావోయిస్టులతో తమకు ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ తీవ్ర ఇబ్బందులు పాలు చేస్తున్నారని ఆదివాసీలు ఏకరవు పెట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. .

# ఓటుకు దక్కిన ఫలితం

### అభివృద్ధి పథంలో కొత్తగూడెం
### కలిసివచ్చిన కూనంనేని ఆలోచన
### ప్రభుత్వ సానుకూలత
### పారిశ్రామిక పట్టణాలకు మహర్దశ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఓటు వేసిన తర్వాత నేనేందుకు ఓటు వేశానని బాధపడుతుంటారు. అదే తమ ఓటుతో విజయం సాధించిన అభ్యర్థి అందుబాటులో ఉంటూ అభివృద్ధి ఫలాలను ప్రజల ముంగిటకు చేరుస్తుంటే ఓటు వేయని వారు మేమెందుకు ఓటు వేయలేదా అని బాధపడుతుంటారు. ఇప్పుడు కొత్తగూడెం నియోజకవర్గంలో అచ్చు ఇదే జరుగుతుంది. ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు మంజూరు కావటం, శాశ్వత ఫలాలు దరి చేరుతుండడంతో ఓటు విషయంలో తమ నిర్ణయం సరైందన్న ఆనందంలో ఉన్నారు.2023 శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజక వర్గం నుంచి అఖండ విజయం సాధించిన కూనంనేని సాంబశివరావు ఏడాది పూర్తి కాక ముందే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తూ నియోజక వర్గంలో విద్య, వైద్యం, రవాణా, త్రాగునీరు, సాగునీరు, మౌలిక వసతుల కల్పన, పారిశ్రామికాభివృద్ధి పై కూనంనేని దృష్టిసారించారు. కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి ఏర్పాటుతో కూనంనేని ప్రతిష్ట మరింత ఇనుమడించింది. నియోజక వర్గ నైసర్గిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ప్రజల అవసరాలపై స్పష్టమైన అవగాహన, ఆలోచన కలిగిన కూనంనేని తనదైన పద్దతిలో చిక్కుముడులు విప్పుకుంటూ నియోజక వర్గాన్ని అభివృద్ధి పథాన నడుపుతున్నారు.

కొత్తగూడెం నియోజక వర్గానికి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత ఉంది. పట్టణసంస్కృతి ఒక పక్క, అత్యంత వెనకబాటుతనంతో కూడిన గిరిజన, పల్లె సంస్కృతి మరో వైపు ఉంటుంది. కేటిపిఎస్, నవభారత్, సింగరేణి తదితర భారీ కర్మాగారాలు, పలు చిన్న పరిశ్రమలకు నెలవైన కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు ఈ నియోజక వర్గంలోనే ఉన్నాయి. లక్ష్మీ దేవిపల్లి, పాల్వంచ రూరల్ మండలాల్లో ఇప్పటికీ అడవులపై ఆధారపడి నివసించే గిరిజనులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఆధునిక వ్యవసాయానికి పెట్టింది పేరైన సుజాత నగర్ మండలం కూడా ఈ నియోజక వర్గంలోనే ఉంది. ఈ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఉన్న కూనంనేని ప్రభుత్వ వైద్యంపై తొలుత దృష్టి సారించారు. ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లాలంటే భయపడే ప్రజలు ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి మెరుగు అన్న భావనలో ఉన్నారు. పాల్వంచ, కొత్తగూడెం ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అన్ని వసతులు కల్పించారు. ఐటీవల డయాలసిస్ సౌకర్యాలను కూడా కల్పించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు అనే తేడా లేకుండా రహదారి సౌకర్యాల కల్పనకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించిన కూనంనేని పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలతో మమేకమవుతూ వినతులు స్వీకరిస్తూ వాటికి పరిష్కారం చూపుతూ మందుకు సాగుతున్నారు. వ్యవసాయాభివృద్ధి పై ప్రత్యేక దృష్టిసారించి చెరువులు, కుంటలను అభివృద్ధి పరుస్తూ ముందుకు సాగుతున్నారు. అన్నింటికి మించి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి ఏర్పాటు నియోజకవర్గ దశ దిశ మారనుంది. జంట పారిశ్రామిక పట్టణాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కోట్లాది రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వర్గ రాజకీయాలు, పెత్తందారితనం, అభద్రతా భావం మధ్య నలిగిన కొత్తగూడెం నియోజక వర్గ ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయులు పీల్చుకుంటున్నారు. కొత్తగూడెం నియోజక వర్గంలో ఎవరికి దక్కని భారీ మెజార్టీని కూనంనేనికి అందించారు. 26,214 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచిన కూనంనేని రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుపోతూ నియోజక వర్గంపై తనదైన ముద్ర వేస్తున్నారు. సిపిఐ, కాంగ్రెస్‌ల మధ్య స్నేహబంధం, కూనంనేని పరిచయాలు నియోజక వర్గ అభివృద్ధికి సానుకూలంగా మారాయి.

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి : కూనంనేని



అనేక దశాబ్దాలుగా కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గంలో పనులు చేపడుతున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ఒక పక్క అభివృద్ధి, మరో పక్క వెనకబాటుతనం, ఒక పక్క వ్యవసాయం, మరో పక్క పారిశ్రామిక ప్రాంతం కలగలిసిన సమ్మిళితం కొత్తగూడెం నియోజకవర్గమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపక్షంతో మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధితో పాటు వ్యవసాయ రంగాన్ని, వెనకబాటుకు గురైన గిరిజన ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని నిర్దేశించుకున్నామని అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఒక్కొక్కటిగా నిధులు సాధిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పదాన నడిపిస్తున్నామని మంత్రుల సహకారం, ప్రభుత్వ సానుకూలత కూడా అభివృద్ధికి కారణమవుతుందన్నారు. నియోజక వర్గ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. తాగునీరు, సాగునీరు, మౌలిక వసతుల కల్పన, ప్రజారోగ్యం, విద్య, పారిశ్రామికి కరణ, ఉపాధి కల్పన, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని సాంబశివరావు తెలిపారు.

## కార్తీక వన సమారాధనలో ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పట్టణ శివారులోగల జలగం వెంగళరావు పార్క్ ఎదురుగా గల శ్రీ ప్రసన్న గణపతి చారిటబుల్ ట్రస్ట్, హిందూ భక్త ధార్మిక వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సకల జన వన కార్తీక సమారాధనకు సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే దంపతులకు శ్రీ ప్రసన్న గణపతి చారిటబుల్ ట్రస్ట్ భాద్యులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానం చేశారు. అనంతరం జరిగిన సత్యనారాయణ స్వామి వ్రత పూజలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ బాద్యులు, సభ్యులు, భక్తులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే దంపతులు. అనంతరం వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఒక్కరి ఇంట లక్ష్మి దేవి ఆశీస్సులు ఉండాలని, భగవంతుని ఆశీస్సులు అందరకీ కలగాలన్నారు. కార్యక్రమంలో కమల్ పాషా, గాదె చెన్నారావు తదతరులు పాల్గొన్నరు.

## మంగళగిరి లింక్ రోడ్డుకు మరమ్మతులు

### ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** మంగళగిరి లింక్ రోడ్డును మరమ్మతులు చేయించండి అంటూ బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహ్మారావు వైరా ఎమ్మెల్యేకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నరసింహ్మారావు మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలో అన్నారుపాడు గ్రామపంచాయతీలో ఉన్న మంగళగిరి లింక్ డొంకకు గత ప్రభుత్వం మంచిగా ఉన్న డొంకను అభివృద్ధి చేస్తానంటూ నల్లటి రేగడ మట్టిని రోడ్డు పై పోయించారన్నారు. దీంతో చిన్నపాటి వర్షం వచ్చిన రైతులు ఆ రోడ్డులో నడిచే వీలు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే మంగళగిరి లింకు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తంబర్ల తెలిపారు.

## నూతన ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఇటీవల ఉపాధ్యాయ కొలువులు కైవసం చేసుకున్న ఎంపి కాలనీ యూస్ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఈ మేరకు కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన ఉపాధ్యాయులు నరేష్, సాయిరాం, కృష్ణవినోద్ లకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలని అందించి అభినందించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తరగతి గది నుండే దేశభవిష్యత్‌ను తీర్చిదిద్దే మేధావులు తయారు అవుతారని, అలాంటి మేధావులను తయారు చేసే గురతర బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. చేస్తున్న వృత్తికి వన్నె తెచ్చి సమాజాభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. కొత్త ఉపాధ్యాయులు భావితరాలను ఆదర్శవంతంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో నక్కా ప్రసాద్, రజనీ టాప్ రాము, నవాబ్, లోకేష్, రాజా కిరణ్, విజయ్ ప్రేమ్, బాలరాజు, హరీష్, అంజన్‌రావు తదితతరులు పాల్గొన్నారు.

## సర్వేకు సహకారం : ఆర్‌డిఒ రాజేంద్ర

**ప్రజాపక్షం/కల్లూరు :** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన గృహస్తులు సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని ఆర్‌డిఒ రాజేంద్ర కోరారు. ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి మండలాలకు చెందిన 90,535 వేల మంది కుటుంబాల వారు ఉన్నారని, 651 మంది సర్వే సిబ్బంది, 65 మంది సూపర్వైజర్లు ఈ సర్వేలో పాల్గొంటున్నారని, సర్వేకు సంబంధించిన అర్హత పత్రాలను వారికి అందించి నమోదు చేయించుకోవాలని ప్రజలను కోరారు. ఈ సర్వే అందరికీ అనుకూలంగా ఉపయోగపడే సర్వే అని కావున ఈ యొక్క సర్వేను సద్వినియోగం చేసుకోవాలని, ఆరు మండలాల ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆదివారం కల్లూరులోని సర్వేకు ముందు స్టిక్కరింగ్ అంటించే విధానాన్ని మరియు తహసీల్దార్ పులి సాంబశివుడు, సిబ్బంది పరిశీలించారు. సర్వే సిబ్బంది తప్పుల్లేకుండా వివరాలు సేకరించాలని ఆర్‌డిఒ తెలిపారు.



## రక్తదానం ఆదర్శం



**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలంలో నిధి యుపిఎస్సి ఐటి సాఫ్ట్‌వేర్ ఇన్స్‌స్టిట్యూట్, మోక్షిత నిధి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామోజి ఉప్పలాచారి జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ విచ్చేసి అందరికి ఆదర్శవంతంగా రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామోజి ఉప్పలాచారి వైరా మండలం పరిసర ప్రాంత యువతకు ట్రైనింగ్ ఇస్తూ నిరుద్యోగ నిర్మూలనలో ఎంతో ప్రముఖమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. చిన్న పిల్లల డాక్టర్ కూరపాటి ప్రదీప్ హాజరై ఇలాంటి రక్తదాన కార్యక్రమాలు చేయడం ఎంతో మంది తలసేమియా చిన్నారి జీవితాలను కాపాడటంలో చారి తన జన్మదిన సందర్భంగా ముందుకు రావడం ఎంతో హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు లక్ష్మ ణ్, భాస్కర్, శరత్, సతీష్, సురేష్, బాషా, రాకేష్, నర్సింహారావు, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు

### సుజాతనగర్ ఎస్ఐ జుబేదా బేగం
### భారీఎత్తున గంజాయి పట్టివేత




**ప్రజాపక్షం/సుజాతనగర్ :** నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సుజాతనగర్ ఎస్ఐ జుబేదాబేగం హెచ్చరించారు. శనివారం సుజాతనగర్ నాయకులగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయినీ షిఫ్ట్‌కారులో తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సుజాతనగర్ ఎస్ఐ జుబేదా బేగం 84 కేజీల నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఐ జుబేదాబేగం వివరాలు వెల్లడించారు. సీలేరు అటవీ ప్రాంతం నుంచి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్న గంజాయిని యాదాద్రి భువనగిరి జిల్లా జహీరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు షిఫ్ట్ కారులో తరలిస్తున్నారని సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పట్టుకున్నామని, కారు డిక్కీలో ఉన్న సుమారు 84 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు నుంచి మూడు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేయడం జరిగిందని, మరో నలుగురు వ్యక్తులు గంజాయి రవాణాలో పాత్ర ఉందని తెలియగా వారిని గుర్తించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొరికిన ఇద్దరూ వ్యక్తులను ఆదివారం జ్యూడిషియల్ కస్టడీకి తరలించామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ జుబేదా బేగం మాట్లాడుతూ సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో అనుమానితులు ఎవరైనా కనబడితే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలన్నారు, యువత మాదక ద్రవ్యాలు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తుకు బానిస అవడం వలన తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. మత్తు పదార్థాలను తరలించినా, అమ్మడానికి ప్రయత్నించినా మాకు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదక ద్రవ్యాలు సేవించినా, రవాణా చేసినా సహించేది లేదని, అలాంటి వారిపై చట్ట రీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ ఆపరేషన్‌లో ఏఎస్ఐ బి.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, పిసి రమేష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశరావు ఆశయాలు కొనసాగిస్తాం



**ప్రజాపక్షం/బోనకల్:** పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అమరజీవి తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిస్తామని బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి ఆదివారం మేఘశ్రీ హాస్పటల్‌లో బిపి, షుగర్, కంటి 50వ ప్రత్యేక క్యాంపును అదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ50వ ప్రత్యేక క్యాంపునకు ముఖ్యఅతిథిగా ట్రస్ట్ ఛైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్‌లతో కలిసి పాల్గొని 100 మంది పేషంట్లకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపును రూపొందించి మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలనే సేవా దృక్పథంతో ప్రతి నెల క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించి, పేదల ఆసుపత్రిగా పేరుగాంచిన మేఘ శ్రీ హాస్పటల్, వైద్యులను అభినందించారు. మున్ముందు మరిన్ని గ్రామాల్లో అన్ని విభాగాల వైద్యులతో వైద్యక్యాంపులను నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపులో ప్రముఖ జనరల్ వైద్య నిపుణులు టి పవన్‌కుమార్, డి సాయికుమార్‌లు వైద్య సేవలందించగా క్యాంపు సహాయకులు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ ఎంపిడబ్ల్యుఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, యంగల గిరిలు క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, క్యాంపు సహాయకులు యంగల గిరి, సిపిఐ నాయకులు కొంగర కృష్ణయ్య, బోళ్ల ప్రసాదరావు, టిడిపి నాయకులు గోళ్లపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### రాష్ట్ర మంత్రులు తుమ్మల, పొంగులేటి





**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉద్యోగుల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని; రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదుటపడిన తర్వాత తొలి ప్రాధాన్యత ఉద్యోగులకే లభిస్తుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉద్యోగుల సహకరం లేకపోతే ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదని వారు తెలిపారు. సకల ఉద్యోగుల వన సమారాధన ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం చెరుకూరివారి మామిడితోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు హాజరయ్యారు. సకల ఉద్యోగుల ఝశ్రీఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బ్యాలెట్లలో స్పష్టమైన తీర్పును ఇచ్చారని ఆ తీర్పుకు అనుగుణంగా పని చేస్తున్నామని అధికారులు, ఉద్యోగులు వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో మంచి చేస్తే ప్రజలు జీవితకాలం గుర్తు పెట్టుకుంటారని తుమ్మల తెలిపారు. ఉద్యోగుల కష్టాలను ప్రభుత్వం గుర్తిస్తుందని ఉద్యోగుల సహకారం వల్లనే తనకు ఈ స్థాయి గుర్తింపు వచ్చిందని తుమ్మల స్పష్టం చేశారు. నీతిగా నిజాయితీగా పనిచేస్తే ప్రజల నుంచి ఆదరణ ఉంటుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘాలు పోరాటాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. ఉద్యోగులు గత పాలనపై విరక్తి చెంది ఇందిరమ్మ రాజ్యం కావాలని కోరడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగులకు భరోసా ఇవ్వడంతో పాటు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామన్నారు. పెండింగ్‌లోఉన్న డిఎలను క్రమపద్దతిలో మంజూరు చేస్తామని పొంగులేటి తెలిపారు. ఏప్రిల్ తర్వాత ఉద్యోగులు సంతృప్తి చెందే రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్బంధం కొనసాగిందని ఇప్పుడు స్వేచ్ఛగా హక్కుల గురించి ప్రశ్నించే అవకాశం లభించిందన్నారు. సర్వీస్ రూల్స్, జేఏసిలు గత ప్రభుత్వంలో లేవని ప్రశ్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేశారని ఏలూరి తెలిపారు. దీపావళి తర్వాత ఆర్థికేతర సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. జెఏసి చౌర్మన్ మారం జగదీష్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సామాజిక సేవకులు వనజీవి రామయ్య, అన్నం శ్రీనివాసరావు తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఎంఎల్‌సి ఎ.నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మేయర్ పునుకొల్లు నీరజ, టిజిఒ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, వివిధ సంఘాల నాయకులు రుక్మారావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి కోసం తపిస్తున్న దళితులు

చేరుపల్లి గ్రామం ఎస్‌సి కాలనీలో మంచినీటి కోసం మహిళల తిప్పలు..



**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం చేరుపల్లి(కొత్తపేట) గ్రామ పంచాయతీ ఎస్‌సి కాలనీలో నెల రోజుల నుంచి మంచినీళ్ల కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎస్‌సి కాలనీకి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి పటించుకున్న పాపాన పోలేదని దళిత వాడలు అంటే చిన్న చూపు చూస్తున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుంచి ఇబ్బంది పడుతున్న అధికార పార్టీ నాయకులు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు... ఎన్నికలు వచ్చినప్పుడు ఓటేయండి అందుబాటులో ఉంటా మీకు ఏమైనా సమస్య ఉంటే అండగా నిలుస్తామని చెప్పి మాయమాటలతో గద్దెనెక్కి ప్రజలకు ఇబ్బంది వచ్చిన పట్టించుకోని నాయకులు ఎందుకని మహిళలు ప్రశ్నించారు. ఇప్పటికైనా మండల ప్రత్యేకాధికారి తుల రవి, ఎంపిడిఒ బద్రునాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకొని ఎస్‌సి కాలనీలో నీటి సమస్య తీర్చాలని మహిళలు కోరారు.ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి స్వప్నను ప్రజాపక్షం చరవాణి ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. వాటర్‌మ్యాన్‌ను అడగ్గా చేస్తామని మాట దాట వేస్తున్నారు.

## స్విమ్మింగ్‌లో స్న వెస్లాకు బంగారు పతకం




**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** తెలంగాణ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 3 వరకు ఎల్‌బి నగర్‌లో జరిగిన 68వ ఎస్‌జిఎఫ్ అండ ర్. 19 స్విమ్మింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపి 50మీటర్ల బటర్ ఫ్లై పో టీల్లో బంగారు పతకాన్ని సాధించిన కడార్ల స్న వెస్లాను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. హసన్‌పరిలోని టిఎస్‌ఆర్‌జెసిలో ఇంటర్ చదువుతున్న స్న వెస్లా స్విమ్మింగ్‌లో అనేక పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ హిందుమతి తెలిపారు. స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో బంగారు పతకంతోపాటు 100 మీటర్ల ఫ్రీఫైన్‌లో సిల్వర్ మెడల్, 50 మీటర్ల బ్రెట్ స్ట్రోక్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి ఈనెల 24 నుంచి గుజరాత్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్విమ్మింగ్ కోచ్ నవీన్ తెలిపారు. పాఠశాలలో చదువుతోపాటు స్విమ్మింగ్‌లో రాణిస్తూ ఎంతో చురుకుగా ఉండే స్న వెస్లా జాతీయ స్థాయిలో సైతం మంచి ప్రతిభ చూపాలని కళాశాల సిబ్బంది ఆకాంక్షించారు. కడార్ల స్న వెస్లా క్రీడల్లో రాణించడానికి కళాశాల పిడి నాజర్, రేష్మ తదితరుల ప్రోత్సాహం ఎంతో ఉపయోగపడిందని ప్రిన్సిపాల్ హిందుమతి తెలిపారు. రాష్ట్రస్థాయిలో అనేక పతకాలను సాధించిన విద్యార్థి స్న వెస్లాను కళాశాల సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు.

## నేడు నెక్కొండలో పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ:** నేడు నెక్కొండ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం సిసిఐ ద్వారా చేస్తున్నామని మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి తెలిపారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు పిఎసిఎస్ చైర్మన్ మారం రాము సిఇఒ మోడెం సురేష్ లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పత్తి సీసీఐ నిర్ణయించిన మాదిరిగా తేమ శాతాన్ని చూసుకొని తేవాలని తెలిపారు. అలాగే రైతులు వరి ధాన్యంలో మట్టి పేల్లలు, తాలు లేకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తెలిపినట్టుగా మ్యాచ్ వచ్చేలా చూసుకోవాలని మోడెం సురేష్ తెలిపారు.

## శ్రీసోమేశ్వర స్వామికి వెండి చత్రం, చామరాం సమర్పణ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** శ్రీసోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి వారికి 933 గ్రాముల మిశ్రమ వెండితో తయారుచేసిన చత్రం, చామరాంను భక్తుడు ఆదివారం ఆలయానికి సమర్పించినట్లు ఆలయ ఈవో మోహన్‌బాబు తెలిపారు. శ్రీసోమేశ్వర స్వామివారికి ప్రతి నెలా నిర్వహించే ఆరుద్రోత్సవ కార్యక్రమంలో పునఃపూజలలో ఉపయోగించడానికి ఆలయ ముఖ్య అర్చకుడు దేవగిరి అనిల్ శర్మ సూచనతో వరంగల్‌కు చెందిన కాసం శివకుమార్, పద్మ, మహేష్, మౌనిక, మహిక కుటుంబ సభ్యులు స్వామి వారికి రూ.1లక్ష విలువైన మిశ్రమ వెండి చత్రం (గొడుగు), చామరాం (విసనకర్ర) ఆలయానికి సమర్పించినట్లు ఈవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి అనిల్‌శర్మ, నాగరాజు, సిబ్బంది సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్మీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గ్రేటర్ వరంగల్ 32వ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండీ దస్తగిరి నివాసంలో ఆదివారం జరిగిన గ్యార్మీ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర వ రంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మె ల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్, మాజీ కుడా డైరెక్టర్ మోడెం ప్రవీణ్, దొనికెల ప్రవీణ్, రజాక్, శ్యామ్, చింత వేణు తదితరులు పాల్గొన్నారు.

## మన భద్రత.. మనందరి బాధ్యత

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 12వ డివిజన్ లక్ష్మి మెగా టౌన్‌షిప్ నందు ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కమిటీ సభ్యులందరూ కలిసి స్వచ్ఛ భారత్ అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ శ్రమదానం ముఖ్య ఉద్దేశం శ్రమదానం వల్ల కాలనీలో పరిశుభ్రత పచ్చదనం పెంపొందించడమే కాకుండా కాలనీలోని తాగునీటి, కరంటు, డ్రైనేజీ, ఇతర సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. అదేవిధంగా కమిటీ సభ్యులు నెలకు ఒక్కసారైనా మీటింగ్ పెట్టి సమస్యలపై చర్చించినందుకు దానికి అనుగుణంగా అధికారులతో టౌన్‌షిప్‌లో నివసించే వారితో కమిటీ సభ్యులందరూ కలిసి సమస్యలు పరిష్కరించుకోవడమే దిశగా అందుకు అనుగుణంగా అందరి అభిప్రాయాలు అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని కమిటీ సభ్యులు తెలిపారు. టౌన్‌షిప్ సభ్యులు, గృహ యజమానులు నివసించే వ్యక్తులు పాల్గొన్నారు.

# కులగణన దేశానికే రోల్ మోడల్

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములు కావాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్, పరకాల మండలం, నడికూడా మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, గణన సర్వేపై అవగాహన కల్పిస్తూ కార్యకర్తలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నెల 6 నుండి 16 నుంచి నిర్వహించే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల, బడుగుల సంక్షేమం కోసం, రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చిందని అన్నారు. కులగణన దేశానికే రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 కుటుంబాలను సేకరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమగ్ర కుల గణన సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయడానికి వచ్చిన ఎన్యుమరేటర్ లకు సహకరించాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నీ సర్వేతోనే సాధ్యమవుతుందని, రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగానే సిఎం రేవంత్ రెడ్డి సర్వే చేయాలని నిర్ణయించారని, ఈ సర్వే దేశంలో ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. ఈ సర్వే ద్వారా బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని, వివిధ కులాలకు చెందిన ప్రతి కుటుంబం సామాజిక స్థితి, ఆదాయ, సంపద, విద్య, ఉపాధి, ఇళ్ల నిర్మాణం, భూమి పైన హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి వివిధ అంశాలను మదింపు చేయడం ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని అన్నారు. అందుకు తాను నిత్యం ప్రజలతో ఉంటూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ నియోజకవర్గంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నాను అని తెలిపారు. ఈ 7 నెలల కాలంలో మొత్తం నియోజకవర్గంలో 101 కోట్ల 79 లక్షల 20వేల432 రూపాయలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజల అభివృద్ధి సంక్షేమానికి ఖర్చు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి సామాజిక ఆర్థిక ప్రయోజనాలు సమకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

**సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పిఎసిఎస్ డైరెక్టర్ బుర్రి బిక్షపతి, సీనియర్ నాయకులు పుట్ట బద్రి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ పల్లబోయిన శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు పుట్టరాజు, మాజీ ఉపసర్పంచ్ ఆముదాపల్లి క్రాంతిపాల్గొన్నారు.

## మడికొండలో సిఎంకు ఘన స్వాగతం

స్వాగతం పలికిన ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/కాజీపేట :** హన్మకొండ జిల్లా పర్యటనలో భాగంగా మడికొండకు చేరుకున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి తదితర ఎమ్మెల్యేలు పుష్ప గుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. మడికొండలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద మంత్రులు కొండ సురేఖ, దనసరి సీతక్క, ఎంపిలు పొరిక బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్వినిరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, గండ్ర సత్యనారాయణ, సిరిసిల్ల రాజయ్య, నగర మేయర్ గుండు సుధారాణి,మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ఎంపి కావ్య,మాజీ ఉపముఖ్యమంత్రి కడియంస్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

**జంగా రాఘవ రెడ్డి కుమార్తె వివాహానికి హాజరైన ఎంపి, ఎమ్మెల్యే కడియం** మడికొండ సత్యసాయి కన్వెన్షన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి కుమార్తె వివాహానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులైన డాక్టర్ నికితా రెడ్డి,డాక్టర్ అవినాష్ రెడ్డి లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## సుజాత పాఠశాలకు కాకతీయ మహానంది అవార్డు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** మండల కేంద్రంలోని సుజాత పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతారాం కర్ణకు హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో అంజలి మీడియా ఫౌండేషన్ అందరి టీవీ 10వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న హమనీయులకు కాకతీయ మహానంది 2024 అవార్డుల ప్రధానోపాత్సవం చైర్మన్ కామిశెట్టి రాజు ఆధ్వర్యంలో సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట శాంతారాం కర్ణకు అవార్డు అందచేశారు. ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్వామిజీ లక్ష్మి నారాయణ గురు భవాని, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, అనితారెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. శాతారాం కర్ణ గత 30 ఏళ్లుగా సుజాత విద్యానికేతన్ పాఠశాల విద్యా రంగం, పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో అనేక పర్యావరణహిత కార్యక్రమాలు, మట్టి వినాయక విగ్రహాల తయారీ ఉచిత పంపిణీ, గ్రీన్ దివాలి, గ్రీన్ హోలీ, వాటర్ కన్జర్వేషన్ ప్రోగ్రాం, గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే, హరితహారంలో 30 వేల మొక్కలు నా టడం, పంపిణీ చేయడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో ఆరుసార్లు పర్యావయవర మిత్ర అవార్డును అందుకున్నారు. ఇద్దరు రాష్ట్రపతులు ఏ పీజే అబ్దుల్ కలామ్, ప్రణబ్ ముఖర్జీ, ఇద్దరు గవర్నర్లు తమిళసై సౌందర్య రాజన్, బండారు దత్తాత్రేయ, ప్రధాని నరేంద్ర మోదీ, సిఎం శివరాజ్‌సింగ్ చౌహా, ఐదుగురు కేంద్ర మంత్రులచే అవార్డులు, ప్రశంసలు అందుకున్న దేశంలో ఏకైక పాఠశాల సుజాత విద్యానికేతన్ అన్నారు. సుమారు 50 సార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతోపాటు రూ. 60వేల బహుమతులు పాఠశాలకు రావడంలో కృషి చేసినందుకు గుర్తింపుగా కాకతీయ మహానంది అవార్డు ప్రధానం చేస్తున్నట్లు కామిశెట్టి రాజు తెలిపారు. ఈఅవార్డురావడం పట్ల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## కరాటే క్రీడా కారుడికి ఆర్థిక సహాయం

ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ కు ఎంపికైన క్రీడాకారునికి మాజీ ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కరాటే క్రీడాకారుడు సార్థక్ కుమార్ ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించి చేయూతనిచ్చారు. జఫర్ గడ్ మండలం, ఓబులాపురం గ్రామానికి చెందిన సార్థక్ కుమార్ ఈ నెల 6వ తేదీన గోవాలో జరగనున్న అంతర్జాతీయ వరల్డ్ కప్ కరాటే ఛాంపియన్ షిప్ కు ఎంపికి అయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడి పరిస్థితి తెలుసుకున్న ఎంపీ, డా.కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండ, కనకదుర్గ కాలనిలోని వారి క్యాంపు కార్యానికి బాలుడిని పిలిపించి కడియం ఫౌండేషన్ ద్వార ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా సార్థక్ కుమార్ ను వారు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఓబులాపురం మాజీ సర్పంచ్ నీరజా రెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీలేని సమాజ నిర్మాణమే రవికి నిజమైన నివాళి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** దోపిడీ లేని సమాజ నిర్మాణమే రవికి నిజమైన నివాళి అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్ సిపిఐ కాలనీ వాసి, సిపిఐ నర్సంపేట మండల సమితి సభ్యుడు మెంద్రాతి రవి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు దోపిడీ పెరిగిపోయి సామాన్య ప్రజలు రేపు అవస్థలకు గురవుతున్నారు, వారి సమస్యలు పరిష్కారం కావాలంటే దోపిడీ లేని సమసమాజ వ్యవస్థ రావాలని, దేశానికి స్వాతంత్రం వచ్చి ఏన్నో ఏళ్లు గడుస్తున్నప్పటికీ కొన్ని సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. ఇప్పటికీ నిలువ నీడలేని పేద ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనైనా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని, చాలీచాలని వసతుల మధ్య అనేక ఇబ్బందులు పడుతూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించి, కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారని, వీటన్నిటికీ సరైన మార్గం కమ్యూనిజమని, ఆ బాటలో నడిచిన రవి అకాల మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను ఉనికిపుచ్చుకొని కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త ముందుండి పని చేయాలన్నారు. అప్పుడే రవికి నిజమైన నివాళి అర్పించిన వారమవుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాష్‌మియా, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, బుస రవీందర్, గన్నారపు రమేష్, జిల్లా సమితి సభ్యులు గడ్డం యాకయ్య, కందిక చెన్నకేశవులు, ఆరెల్లి రవి, దామెర కృష్ణ, పాలక కవిత, మియాపురం గోవర్ధన్, యాకూబ్, ఇల్లందుల సాంబయ్య, రవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బిసిల కులగణనపై బిఆర్‌ఎస్ వైఖరి సిగ్గుచేటు

బిసి కులగణను వ్యతిరేకించడం దిగజారుడుతనం



**ప్రజాపక్షం/నెక్కొండ:** రాష్ట్రంలో చేపడుతున్న బిసి కులగణను వ్యతిరేకించడం సిగ్గుమాలిన చర్య అని బిసి కులాలు రాజ్యాధికారం చేపట్టడం ఇష్టం లేని కొన్ని వర్గాలు భారత రాష్ట్ర సమితి పార్టీ నేతలు దిగజారుడు ప్రకటనలు చేయడం విచారణమని వరంగల్ జిల్లా నెక్కొండ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, లు అన్నారు. వారు ఇరువురు మాట్లాడుతూ, రాష్ట్రంలో బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కోటా పెంచేందుకు బీసీ కులగణను చట్ట బద్ధంగా చేపడుతుంటే హర్షించేది పోయి విమర్శించడం సిగ్గుమాలిన చర్య అని వారు బయ్యబట్టారు. బిసి లకు రిజర్వేషన్లను పెంచడానికి బిఆర్‌ఎస్ పార్టీ అనుకూలమా వ్యతిరేకమా చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఉనికి కోసం ఇలా దిగజారి క్షేత్రస్థాయి నేతలతో ప్రకటన ఇప్పించడం ఆ పార్టీకి నష్టమేనని, వారు జోష్యం చెప్పారు. మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రమిస్తే అప్పుల కుప్పగా చేసిన బిఆర్‌ఎస్ పార్టీ నేడు ఆ అప్పుల మిత్తి కట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పడుతుందన్నారు. రాష్ట్రం రాకముందు చెప్పులు లేని బిఆర్‌ఎస్ నాయకులు కోట్లకు ఎలా పడగలెత్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమంగా సంపాదించకపోతే భయం ఎందుకని డిమాండ్ చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్న ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున విమర్శించడం తగదని అన్నారు. గత ప్రభుత్వంలో లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తే రైతులు తీసుకున్న అప్పుకు మిత్తికి సరిపోలేదు అన్నారు. గత ప్రభుత్వం ఏ ఆట 25 రుణమాఫీ చేస్తే అప్పుకు అప్పు పెరిగి రైతు నష్టపోయాడు బ్యాంకులు దివాలా తీసాయని అలాంటిది ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేస్తే విమర్శించడం ఆ పార్టీ నేతల అవివేకం నికి నిదర్శనం అన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని బిఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గత పది సంవత్సరాలలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వని నాయకులు ఈరోజు మాట్లాడడం సరికాదన్నారు. నెక్కొండకు సివిల్ హాస్పిటల్ ను తీసుకురావాలని మాట్లాడే బిఆర్‌ఎస్ నాయకులు అధికారం ఉన్నపుడు గుడ్డి గుర్రానికి పండ్లు తోమరా అని విమర్శించారు. నెక్కొండను ఎలా అభివృద్ధి చేయాలో మా నాయకుడు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి తెలుసని మీరు నెక్కొండకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నెక్కొండను మాజీ మంత్రి హరీష్ రావు దత్తత తీసుకొని ఏం చేశారో చెప్పాలని అ దత్తపుత్రుడిని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా బుద్ధి మార్చుకోకపోతే స్థానిక సంస్థల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఓబిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మండల కాంగ్రెస్ నాయకులు కెవి సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, జమ్ముల సోమయ్య, బొమ్మెర బోయిన రమేష్, మాజీ వార్డ్ మెంబర్ పోలిశెట్టి భాను ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు జంగిలి రాములు, ముప్పు వెంకటేశ్వర్ రెడ్డి, బత్తుల సుబ్బారెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ‘నేతకాని’ల బతుకమ్మ ఉత్సవాలు

పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/ హనుమకొండ /హసన్‌పర్తి:** తెలంగాణలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నేతకాని కులస్థులు జరుపుకునే దీపావళి బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామ నేతకాని కులస్థులు దీపావళి పండుగ రోజున బతుకమ్మ ఆడటం ఇక్కడ పూర్వం నుంచి వస్తున్న ఆచారం. మూడు రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకలను గ్రామానికి చెందిన నేతకాని కులస్థులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డా పండుగ రోజు గ్రామానికి చేరుకుంటారు. నేతకాని కులస్థులు, బంధువులుతో పండుగ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉత్సవాల్లో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. దీపావళి పండుగ రోజు బతుకమ్మ ఆడటం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన దీపావళి బతుకమ్మ ఉత్సవాలు ముగిశాయి. గ్రామంలోని నేతకాని మహిళలు తీరొక్క పూజలతో బతుకమ్మను పేర్చి పిల్లా పాపలతో బతుకమ్మను ఊరేగింపుగా బయలుదేరి డీజే సౌండ్స్‌తో బతుకమ్మ పాటలు పడుతూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల మధ్య పండుగ జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను ఊరు శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో మూడు రోజుల దీపావళి బతుకమ్మ పండుగ సందడి నేటితో ముగిసింది. ఉత్సవాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు, ఆత్మకూరు మార్కెట్ వైస్ ఛైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, డైరెక్టర్ జాడి రాజీవ్‌గాంధీ, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు తోకల లక్ష్మారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, నేతకాని సంఘం నాయకులు శరత్, చేరాలు, మహిళలు పాల్గొన్నారు.

# పల్లెల్లో ‘స్థానిక’ సందడి షురూ

**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఎన్నో రోజులుగా ఎప్పుడెప్పుడు గ్రామ పంచాయితి ఎన్నికలు నిర్వహిస్తారనే ఎదిరి చూస్తున్న ప్రజా ప్రతినిధులకు ఎట్టకేలకు డిసెంబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు డిసెంబర్ లోనే నిర్వహించాలనే ప్రభుత్వం ససూచన ప్రాయం నిర్ణయంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొన్నది. ప్రభుత్వం డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి సంక్రాంతి వరకు నూతన సర్పంచ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని నిర్ణయించడంతో గ్రామాలలో సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహుల్లో నూతన ఉత్సాహం మొదలైంది. గతంలో గెలిచిన వారు మల్లి ఎన్నికల్లో పోటీ చేయాలనే కుతూహలం మొదలైంది. అట్లాగే ఏదైన చేసి కొత్తగా సర్పంచికి పోటిచేసి గెలవాలనే ఆశావాహులు ఉత్సాహంతో ఉన్నారు. కొత్త పాత కలయికతో ఇక నుండి పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి వాతావరణం సంతరించుకోనుంది. ఇప్పటి నుండి వివిధ పార్టీల నాయకులు గ్రామంలోని ప్రజలను కలు సుకుంటు యోగ క్షేమాలు తెలుసుకుంటు ప్రజా జీవితంలోకి వెల్లాలని చూస్తున్నారు.ఇప్పటికే రిజర్వేషన్లు మారుతాయ లేదా అనే సందిగ్ధంలో ఉన్ననాయకులు ఈ ప్రభుత్వ సూచనతో మల్లి నాయకుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎట్లాగైన మల్లి తన అదృష్టాన్ని పరిక్షించుకోవాలని నాయకులు పోటీపడబోతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 11 మండలాలు ఉండగా అందులో 241 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని మేజర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత సంవత్సరం డిసెంబర్‌లో సర్పంచ్‌ల పది కాలం ముగిసింది. అంతలో



బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి చెంది కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ప్రభుత్వం నుండి ఎన్నికలు నిర్వహించడం లేటవడం జరిగింది. గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు లేక పోవడంతో గ్రామ పాలన పడకేసింది. ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా గ్రామ పరిపాలన తయారైంది. కార్యదర్శిలకు గ్రామాలలో ఉన్న సమస్యలు అర్థం కాక అనేక ఇబ్బందులు పడుతు సంవత్సకాలం ఎల్లాదీశారు.ఎలాగైన ప్రభుత్వం ఎట్టకేలకు డిసెంబర్‌లో గ్రామ పంచాయితి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో అధికారులు కొంత ఉత్సాహం నెలకొన్నది. ఈ సందర్భంగా పల్లెలో గ్రామ పంచాయతీ ఎన్నికల వాతావరణం కనబడుతుంది. ఇప్పటి నుండి రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నారు. ఎలాగైన అధికార పార్టీ నుండి టికెట్ వచ్చే విధంగా ప్రమయత్నాలు మొదలు పెడుతున్నారు.ఏదేమైన మల్లి గ్రామాలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు అనగానే గ్రామాలలో చర్చ మొదలైంది. మన గ్రామంలో ఈ సారి ఎవరైతే సర్పంచ్‌గా ఉంటే భాగుంటదనే చర్చ ప్రతి గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేత

**ప్రజాపక్షం/ కమలాపూర్:**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కమలాపూర్ మండలంలో నేడు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను నేరుగాలబ్ధిదారుల ఇళ్ల వ ద్దకే అందజేయబోతున్నారు. కమలాపూర్ మండలంలోని గుండేడు, కన్నూరు, భీంపల్లి, ఉప్పులపల్లి, ఉప్పల్, దేశరాజుపల్లి, కానిపర్తి, శంభునిపల్లి, కమలాపూర్, గూడూరు, అంబాల, శ్రీరాముపల్లి, మాదన్నపేట, శనిగరం, గోపాలపూర్, నేరెళ్ళ, వంగపల్లి, పంగిడిపల్లి, మర్రిపల్లిగూడెం గ్రామాలలో అందజేస్తారు. ప్రతిఒక్కరి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న పాడి కౌశిక్ రెడ్డి ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు సహాయంచేరాలనిఆయన సంకల్పం అని తెలిపారు.



## విద్యుత్ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి : ఫ్రాంక్లిన్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రతినెల మొదటి ఆదివారం నిర్వహించే విద్యుత్ గ్రీవెన్స్ డేను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఫ్రాంక్లిన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ ఫిరమిడ్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌డేలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఏలాంటి సమస్యలు ఉన్న గ్రీవెన్స్ డేలో దరఖాస్తు చేసుకోవాలని వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 మండలాల్లోని వినియోగదారులు సర్వీస్ సెంటర్లను వినియోగించుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి అనునిత్యం పని చేస్తున్నామని, ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఓ సత్యనారాయణ, డిఈ శ్రీనివాస్, ఎడిఈ శ్రీనివాస్, ఎఎఓ లింగయ్య, సిఎస్‌సి సభ్యులు మల్లేష్ గౌడ్, నసీర్ పాల్గొన్నారు.

## బిసిల రాజ్యాధికారం కోసం ఉద్యమిస్తాం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్రంలో 60శాతం ఉన్న బిసిలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో మిర్యాలగూడలో చేపట్టిన బిసి గర్జనకు జిల్లా కేంద్రం నుండి తరలి వెల్లిన వాహన శ్రేణిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో బిసిల రిజర్వేషన్‌లను 33శాతం నుండి 23శాతానికి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐసిసి నాయకులు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు జనాభా ప్రతిపదికన 42శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర భారత దేశంలో బిసిలు అన్ని రంగాల్లో దగాపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, కుంభం నాగరాజు, మీర్ అక్బర్, మాజీ సర్పంచ్ మల్లయ్య, సుమన్, లింగస్వామి, వల్లాల సైదులు, ఆవుల అంజయ్య, కరుణాకర్, శరత్, శోభన్, ఫణి నాయుడు, సైదులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంధాలయాల అభివృద్ధికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో నూతనంగా ఎన్నికైన వంగవీటి రామారావును ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్ మాట్లాడుతూ వంగవీటి రామారావు కోదాడ ప్రాంత వాసిగా జిల్లా గ్రంధాలయచైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నా నియమాకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎంఎల్ఏ పద్మావతిరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ వేనేపల్లి చందర్‌రావు, పిసిసి డెలిగెట్ లక్ష్మి నారాయణరెడ్డి, డిసిసి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ ఎంపిపి మల్లెల రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, ఓరుగంటి శ్రీనివాస్, నలజాల శ్రీనివాసరావు, నంబూరి సూర్యం పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట పట్టణ ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా పోతు భాస్కర్, ఉప్పల ఆనంద్, అధ్యక్షులుగా మొరిశెట్టి యోగి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాకొళ్ళపు రామకృష్ణ, కోశాధికారిగా ఉప్పల రమేష్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్లు పబ్బా ప్రకాష్, మిరియాల రామమూర్తి, ఉప్పల ప్రవీణ్, శ్రవణ్ కుమార్, రవి, బద్దం వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మడుగుల రుక్మాధర్, రామమూర్తి, కర్నాటి నారాయణరావు, మిర్యాల నాగరాజు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును జాతీయ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కార్యకర్తలను కుటుంబసభ్యులుగా భావించే చంద్రబాబునాయుడు జెండా మోసే కార్యకర్తల కోసం ప్రమాద బీమా రూ.2లక్షల నుంచి రూ.5లక్షలు పెంచి చనిపోయిన కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల కోసం రూ.10వేలు అందిస్తుందన్నారు. వడ్డెబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు నసీరొద్దిన్‌బాబా, రాష్ట్ర వానిజ్య సెల్ నాయకులు ఏచూరి అనంతరాములు, రాష్ట్ర టీఎన్‌టీయుసీ నాయకులు ఉప్పలపాటి గోపాల కృష్ణ, నాయకులు దాసరాజు జయరాజు, చవల వెంకటేశ్వర్లు, దాసోజు కాంతాచారి, సజ్జల వెంకట్‌రెడ్డి, అనుముల సైదులు, బొల్లెద్దు నవీన్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు



# పేదల బియ్యంతో పెద్దోళ్ల దందా!

పేదల కోసం ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యంతో కొందరు పెద్ద వ్యాపారులు అక్రమ దందా చేస్తూ కోట్లు గడిస్తున్నారు. అక్రమ మార్గంతో ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి నూకలుగా మార్చి తౌడులో కలుపుతూ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తౌడు మిల్లులు నిర్వహిస్తూ వ్యాపారం సాగిస్తున్నట్లు బయట కవరింగ్ ఇస్తూ లోన మాత్రం పేదల బియ్యంతో దందా చేస్తున్నారు.



### నూకలుగా మార్చి తౌడులో కలుపుతూ...
### నెలవారీ మామూళ్లతోనే సరి..
### కల్లేదుటే కనబడుతున్నా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలో తౌడు మిల్లులను నిర్వహిస్తున్న వ్యాపారులు గుట్టుగా పిడిఎస్ బియ్యం అక్రమ దందా చేస్తున్నారు. ప్రతి రోజు లక్షలాది రూపాయల బియ్యాన్ని కొనుగోలు చేస్తూ వాటిని నూకలుగా మార్చి తౌడులో కలుపుతూ కోళ్ళదాణ పరిశ్రమలకు అమ్ముతూ కోట్లు గడిస్తున్నారు. సూర్యాపేటలోని క్రిష్ణాటాకీస్, సుధాకర్ పివిసి సమీపంలోని ఇండస్ట్రీయల్ పార్కు, బీబిగూడెం, దురాజ్‌పల్లి జీయో పెట్రోల్ బంక్ దగ్గరలో, తిరుమలగిరి మండల కేంద్రం, కోదాడ సమీపంలోని కోమరబంద, హుజూర్‌నగర్‌లోని మిర్యాలగూడ రోడ్డు, నేరేడుచర్లలో ఉన్న తౌడు మిల్లుల్లో ఈ దందా గత కొన్ని ఏళ్ళ నుండి యదేశ్చగా సాగుతుంది. ఈ మిల్లర్లు ఆయా ప్రాంతాల్లోని రేషన్ డీలర్లు, ప్రభుత్వ గోదాంల ఉద్యోగులతో ఒప్పందం కుదుర్చుకొని గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లోని తమ గోదాంలకు తరలిస్తున్నారు. రోజు వారిగా ఆ బియ్యాన్ని తౌడు మిల్లులకు తీసుకవచ్చి నూకలుగా మారుస్తున్నారు. తౌడు మిల్లుల వ్యాపారులు సాగిస్తున్న ఈ అక్రమ పిడిఎస్ దందాను అరికట్టాల్సిన సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు నెలవారి మామూళ్ళతో సరి పెట్టుకొని ఆ మిల్లుల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరు సాగిస్తున్న ఈ క్రమదందా వారి కళ్లేదుటే కనబడుతున్న ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో పోలీసులు రహదారుల వెంట వెళ్తున్న వాహనాల తనిఖీలో జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యంను వేలాది క్వింటాలు పట్టుబడ్డాయి. విచారణ పేరుతో పోలీసులు, పౌర సరఫరాల శాఖ అధికారులు కాలయాపన చేసి కేసులను నీరుగార్చిన పరిస్థితులు లేకపోలేదు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారీ ఏళ్ళ తరబడి పిడిఎస్ బియ్యం అక్రమ రవాణ సాగిస్తున్నాడు. ఇతగాడిని అందరు శంకర్ దాదాగా పిలుస్తారు. ప్రస్తుతం అతను ఈ వ్యాపారం వదులుకొని రియల్ ఎస్టేట్, వైద్య రంగంలో అడుగుపెట్టిన ఇతడి కనుసైగలోనే అంతా సాగుతుందనే విమర్శలు లేకపోలేదు. ఎక్కడ పిడిఎస్ బియ్యం పట్టుబడిన ఇతడి మూలాలే కనబడుతున్నాయి. ప్రభుత్వాలు, అధికారులు మారిన తన వాగ్ధాటితో వారిని మచ్చిక చేసుకొని జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలకు కూడా ఈ అక్రమ పిడిఎస్ బియ్యం రవాణాను సాగిస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు ఈ అక్రమ దందాపై దృష్టి సారించి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్‌:** మనువాద పార్టీలు వర్గీకరణ అంశాన్ని రెచ్చగొడుతూ మాల మాదిగల మధ్య అంతరాలను పెంచుతూ భారత రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చే కుట్ర జరుగుతుందని సమత సైనిక్ దళ్ నేషనల్ సెక్రటరీ దిగంబర్ కాంబ్లే అన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని స్థానిక ఎన్ఆర్ఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మాల ఉద్యోగుల స్వాభిమాన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివక్షతకు గురవుతున్న 1168 జాతులను షెడ్యూల్ కులాలుగా మార్చి వారికి విద్య ఉద్యోగ ఆర్థిక అంశాలలో 15 రిజర్వేషన్ల రూపంలో అవకాశాలు కల్పించాలని తెలిపారు. 1168 కులాల కు సమాన అవకాశాలు కల్పించిన క్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏ వృత్తి లేని మాలలు కేవలం చదివే వృత్తిగా భావించి అంబేద్కర్ చూపించిన బాటలో నడుస్తూ చదువులు చదివారు కానీ మాదిగలను దోసుకోలేదని అన్నారు. మాలలు మనువాదులు అని అంటున్న వాళ్లు మొదట వాళ్లు ఆత్మ పరిశీలన చేసుకోవాలని కేవలం వారి సొంత లాభం కోసం మనవాధ రాజకీయ పార్టీ చేతిలో కీలుబొమ్మలుగా మారి దళిత కులాల మధ్య అనైకృతకు కారణమవుతున్న మీరు ఒకసారి గుండె మీద చేయి వేసుకొని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కవి గాయకులు ఒక్క రేంజర్ల రాజేష్, తలమల్ల హుస్సేన్, ముండ్లగిరి కాంతయ్య, గోలి సైదులు, తెలగమల యాదగిరి, రేఖల సైదులు, అనిల్ కుమార్, రూప యాదగిరి, గాలి రవి, కిషన్, చింతమల రమేష్, విజయ్ పాల్గొన్నారు.

## రైతన్నకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : బీర్ల



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వెల్మజాల ఐకేపి, గుండాల, వస్తాకొండూరు పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతన్నకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు వడ్లను కేంద్రాలకు తీసుకువచ్చిన వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలలో వరి కొనుగోలు డబ్బులను జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోస పోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏలూరి రాంరెడ్డి, రవికుమార్, గ్రామశాఖ అధ్యక్షులు యాదయ్య, సినియర్ నాయకులు డా. వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ లింగాల బిక్షం, డైరెక్టర్లు అంజయ్య, వ్యవసాయ అధికారి, ఆర్ఐ, ఏవో క్రాంతి పాల్గొన్నారు.

**అమ్మయాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు**

అమ్మయాది పెండెం ఫౌండేషన్ సాహిత్య సామాజిక విద్యా కళా సేవ సంస్థ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గుండాల మండలం బ్రహ్మణపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య పాల్గొని కవులకు, కళాకారులకు, ఉపాధ్యాయులకు అమ్మయాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సినిగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రభాకర్‌తేజ, ఎస్సి సెల్ అధ్యక్షులు రాజరత్నం, అశోక్, గోపాల్, యాదగిరి, ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, శాంతికుమారి, కవులు, కళాకారులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు పంపించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/(నల్లగొండ) కనగల్:** తేమ శాతం 17కు మించకుండా కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని అదేరోజు కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం రాత్రి కురిసిన వర్షం వల్ల నల్లగొండ జిల్లా, కనగల్ మండలం ,పొనుగోడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిందని తెలియగా ఆదివారం ఆమె పొనుగోడు దాన్ని కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన తేమశాతంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అదే రోజే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, ఒక వేళ ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా జాప్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను లోతట్టు ప్రాంతాల్లో కాకుండా, ఎత్తు ప్రాంతాలలో ఏర్పాటు చేసినట్లయితే కొనుగోలు కేంద్రంలోకి వర్షానికి నీరు రాకుండా ఉంటుందని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ప్రతిరోజు తేమశాతాన్ని నమోదు చేయాలని, రిజిస్టర్‌లను తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో లారీలు సరిగా ఏర్పాటు చేయనట్లయితే కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, కేంద్రం నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

## గొర్రెల కాపరులపై ఫారెస్ట్ అధికారుల దాడులు...



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం దట్టమైన అటవి ప్రాంతంతో నిండి ఉండడం అడవి చుట్టూ గ్రామాలు గ్రామాలలో ప్రజలు జీవనం సాగిస్తున్న క్రమంలో కుటుంబ పోషణ కోసం చాలా కుటుంబాలు అడవిపైనే ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో చాలా మంది తమ గొర్రెలను, పశువులను మోపడానికి అడవిలోకి తీసుకువెళుతూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని శతాబ్దాల నుండి ఇక్కడి ప్రజలు అడవిపైనే జివిస్తున్న తరుణంలో ఈ మధ్య ఫారెస్టు అధికారులు రైతులను అడవిలోకి వెళ్లనివ్వకుండా వారిపై దాడులు చేస్తూ వారి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉమ్మడి చందంపేట మండలంలోని కంబాలపల్లి, రేకులగడ్డ, చిత్రియాల, కొత్తపల్లి, గువ్వల గుట్ట ప్రాంతాలలో చాలా మంది రైతులు తమ యొక్క గొర్రెలను, పశువులను మోపడానికి అడవులకు వెలుతూ వారి రక్షణ కోసం వారి వెంట కొడ్డలను, కత్తులను తీసుకువెళుతుంటారు ఇప్పుడు ఫారెస్టు అధికారులు వారి వద్ద నుండి వాటిని లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైన ఫారెస్టు అధికారులు కృరమృగాల నుండి రక్షణ పొందేందుకు రైతులు తీసుకువెళుతున్న కొడ్డళ్లలను, కర్రలను పట్టుకోకుండా పై అధికారులు చొరవ చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి చివరి ఒసి సిఎం...

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సిఎం రేవంత్‌రెడ్డి చివరి ఒసి సిఎం అని, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆఖరి ఒసి ఎమ్మెల్యే అని మిర్యాలగూడలో కుట్రలు, కుతంత్రాలు చెల్లవని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జోస్యం చెప్పారు. పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన బిసి గర్జన సభలో ఆయన మాట్లాడుతూ దామరచర్ల మండలంలో డిప్యూటీ సిఎం, మంత్రుల కార్యక్రమం పెట్టింది బిసి గర్జనను విఫలం చేయడానికేనన్నారు. తీన్మార్ మల్లన్న పనితనం నచ్చకుంటే వెంటనే రాజీనామా చేస్తా, పనితనం మంచిగా లేదంటే ఈ క్షణం రాజీనామా చేస్తానన్నారు. పిడికెడు మంది లేనోళ్లు ఒసి ఎమ్మెల్యేలను రాజకీయ సమాధి చేస్తానని, బిసి గుర్రాలు జాడించి కొడితే గల్లంతు అవుతారని అన్నారు. తమిళనాడు అసెంబ్లీలో 8 మంది ఒసిలు, మిగిలినవారంతా బిసిలేనన్నారు. ఆ పరిస్థితి తెలంగాణాలో రావాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. 119 సభలు పెడతామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు బిసిలు అండగా ఉంటారన్నారు. నరేంద్ర మోడి కులగణన చేస్తారా కుర్చీ వదులుకుంటారా లేదా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పేరా ప్రజల సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. సభ వేదికకు తీన్మార్ మల్లన్న తదితరులను ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీగా బిసి నేత తమ్మడబోయిన అర్జున్ ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. సభలో మాట్లాడుతూ తీన్మార్ మల్లన్ననను సిఎంగా చూడాలని అన్నారు. జెఏసి కన్వీనర్ తమ్మడబోయిన అర్జున్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఎస్ మాజీ అధికారి చిరంజీవులు, రజిని, ప్రొఫెసర్ లక్ష్మ ణ్, వెంకటరాజులు, పుట్ట మల్లన్న, కుమారస్వామి, శాసనమండలి మాజీ వైస్ ఛైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఆకుల లలిత, చెరుకు సుధాకర్, వట్టె జానయ్యయాదవ్, పిల్లి రామరాజుయాదవ్, విద్యుత్ ఉద్యోగుల బీసీ నేత ప్రేమ్‌కుమార్, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కోల సైదులు, మారం శ్రీనివాస్, నాగార్జునచారి, పుప్పాల సత్యం, ఈశ్వరచారి, జయరాజు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనకు సిపిఐ పోరాటం



**ప్రజాపక్షం/చిట్యాల:** దోపిడీ లేని వ్యవస్థ కోసం సమ సమాజ స్థాపన కోసం నాడు స్వాతంత్ర పోరాటంలో అగ్రభాగంలో నిలిచి పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొడిగె సైదులు అన్నారు. ఆదివారం జరిగిన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించి బ్రిటిష్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా పోరాడి ఎన్నో నిర్బంధాలను కుట్రలను జైలు జీవితాలను ఎదుర్కొని త్యాగాలు చేసిన గొప్ప చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు. అదే విదంగా తెలంగాణ ప్రాంతంలో దొరలు, భూస్వాములకు, వ్యతిరేకంగా వెట్టిచాకిరి విముక్తి కోసం,నైజాం ప్రభుత్వాన్నికి వ్యతిరేకంగా తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం నడిపి 4500 మంది అమరత్వంతో లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచి వేలాది గ్రామాలను రజాకార్ల కబంధాహస్తాల నుండి విముక్తి కలిగించిందన్నారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తుందన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 30వ తేదీన జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు జిల్లా లింగస్వామి అధ్యక్షత వహించగా గ్రామశాఖ కార్యదర్శి జిల్లా సత్యం నాయకులు బుడిగె బక్కశెట్టి, జిల్లా లక్ష్మయ్య, ఏర్పుల రాములు, సీమ అంజయ్య, జిల్లా యాదయ్య,రెడపాక రవి,పైల శేఖర్, బొడిగె సతీష్, వెంకటేష్,బెదరకోట సైదులు, అశోక్, పానుగుల శివ,రత్నం, లింగస్వామి, శంకరయ్య పాల్గొన్నారు.

## ఆసిఫ్‌నగర్ కాల్వను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో ప్రవహిస్తున్న ఆసిఫ్‌నగర్ కాల్వను కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆసిఫ్‌నగర్ కాల్వ ప్రక్షాళనలో భాగంగా ఆసిఫ్‌నగర్ కాల్వను, తుమ్మలగూడెం పెద్ద చెరువును పరిశీలించారు. త్వరలో మూసి ప్రక్షాళన రాష్ట్ర మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమం కానుంది. ఆయన వెంట రామన్నపేట, వలిగొండ తహసీల్దార్లు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పూస బాలకిషన్, పంచాయతీ సెక్రటరీ రసూల్, గర్దాసు రాఘవులు, మిరియాల వెంకన్న, మల్లేష్, మేకల నరేష్, మల్లేష్, భిక్షపతి, మహేష్, నరేష్, విజయ్, విక్కి, వేణు, సాయి, బాలరాజు పాల్గొన్నారు.

**చివరి గింజవరకు కొనుగోలు**

రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఎ.హనుమంతరావు అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మలగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కావాల్సిన తేమశాతం వచ్చేవరకు అన్నిరకాలుగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో వి.శేఖర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ లాల్‌బహదూర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు శోభా, రాజేష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఐకేపీ ఏపీఎం ప్రసాద్ ఉన్నారు.

## జాతీయ సేవారత్నం అందుకున్న కిషన్‌రెడ్డి

### జగిత్యాల జిల్లాలో ఆరుగురికి ప్రదానం



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి:** అంజలి మీడియా గ్రూప్ అందరి టీవి 10వ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని కాకతీయ నంది పురస్కారాల పేరిట అవార్డులను పలు రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు వరంగల్ పశ్చిమ ఎంఎల్ఎ రాజేంధర్‌రెడ్డి ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిలో జగిత్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్‌రెడ్డికి జాతీయ సేవారత్నం, బుగ్గారంకు చెందిన డాక్టర్ నక్క రాజుకు కాకతీయనంది, గాండ్లమధురిమకు జాతీయ సేవారత్న్యం, పడాల మమతకు కాకతీయ నంది, చింత సుధీర్‌కు కాకతీయ నంది, కోరుట్ల గణేష్‌కు జాతీయ సేవా రత్న అవార్డులు అందుకున్నారు. అంజలి మీడియా చైర్మన్ కామిశెట్టి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంగా రఘువీర్‌గౌడ్, కూచన నాగజ్యోతి బాబా మియా, నక్క జితేంధర్, పాల్గొన్నారు

## పేదలకు ఆరోగ్యమే ధ్యేయంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ

### జగిత్యాల ఎంఎల్ఎ డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్ పల్లి గ్రామంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. ప్రారం భించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ మంచాల కృష్ణ, ప్యాక్స్ చైర్మన్ సందీప్ రావు, రోటరీ క్లబ్ సభ్యులు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీనివాస్, వైద్యులు డా.జైపాల్, డా.కనదుర్గా, డా.అర్జున్, నాయకులు బాల ముకుందం,గడ్డం నారా యణ రెడ్డి, మహేశ్వర్ రావు, చిర్ర నరేష్, అంజయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఇండ్ల పరిశీలన ప్రక్రియ



**ప్రజాపక్షం /రామగిరి :** సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా నేటి ఆదివారంతో ఎన్యూమరేటర్ల ఇండ్ల గుర్తింపు ప్రక్రియ ముగిసింది. మండలంలో 78 మంది ఎన్యూమరేటర్లు 8 మంది పరిశీలకుల పరిశీలనలో ఈ కార్యక్రమం పూర్తి చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఇండ్ల గుర్తింపు సేకరణలో భాగంగా ఇంటింటికి ఎన్యూమరేటర్లు స్టిక్కర్స్ అంటించారు. ఈ నెల 6వ తేదీ నుండి సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎన్యూమరేటర్లు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించనున్నారు. ఇండ్ల గుర్తిం పు సర్వే ప్రక్రియ పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ లలిత, తహశీల్దార్ వాసంతి, ఎంపిఒ భాస్కర్ పాల్గొన్నారు.

## నిరంతరం అండగా ఉంటాం

### చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి: అర్జీ -1 జిఎం లలిత్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం తబితా ఆశ్రమంలో అర్జీ 1 జిఎం అనిత లలిత్ కుమార్ కుటుంబసమేతంగా రామగుండం తబితా ఆశ్రమాన్ని సందర్శించి పిల్లలతో కాసేపు గడిపి పిల్లలందరికీ స్వీట్స్, చక్లెట్స్, కేక్స్, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లలందరికీ నిరంతరం మా వంతుగా పిల్లలకు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.మద్దెల దినేష్, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికల్లో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన పోతుపెద్ది కిషన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కిషన్‌రెడ్డి ఎన్నిక పట్ల ముత్తారం మండలంలోని మండలంలో సింగిల్ విండో మాజీచైర్మన్ గుజ్జుల రాజిరెడ్డిహర్షంవ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఈనెల 3 నుండి 5 తేదీ వరకు మహబూబాబాద్ లో జరిగే పాఠశాలల అండర్ 14, 17 బాల బాలికల ఆర్చరీ పోటీలకు ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రణీత్, మనస్విని, సానియా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్ర కుమార్ పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం సురేంద్ర ప్రసాద్ తెలిపారు.ఎంపికైన విద్యార్థులను పాఠశాల సీనియర్ ఉపాధ్యాయు రాలు వాణిశ్రీ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# నిరుద్యోగ యువతకు ప్రత్యేక యాప్

* పట్టభద్రులందరూ సద్వినియోగం చేసుకోవాలి
* కరీంనగర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి విస్తృతప్రచారం





**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రయివేట్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ పట్టణ కేంద్రంలోని గిద్దె పెరుమాండ్ల స్వామి ఆలయ మైదానంలో వాకర్స్‌తో, జిల్లా గ్రంథాలయంలో పట్టభద్రులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. రానున్న రోజుల్లో న్యూ ఎద్యుకేషన్ పాలసీ రానున్నదని, దానికనుగుణంగా కొన్ని మార్పుల చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాను గెలిచాక సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. రాష్ట్ర జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తం అవుతున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆల్ఫోర్స్ పక్షాన ఉచిత యాప్ అందిస్తున్నామని అన్నా రు. రాష్ట్రంలో గత ఆరు నెలల కాలంగా ఉద్యోగ నియామకాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రయివేట్ ఉద్యోగ, ఉపాధ్యా యు లకు అన్ని ఆసుపత్రులలో నగదు రహిత వైద్య సేవలు అందించే విధంగా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో ప్రయివేట్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్ శాలరీ అమలు జరిగే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమ స్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6లోపు తమ యొక్క ఓటు నమోదును చేసుకోవాలని పిలుపునిచ్చారు. మిస్ట్ కాల్ క్యాంపెయిన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### రాజకీయ నేతగా కాదు..సేవకుడిగా పని చేస్తా

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రాజకీయాలకు అతీతంగా సేవకుడిగా పనిచేస్తానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రైవేట్ లెక్చరర్స్‌తో పాటు, ప్రైవేట్ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేం దర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న నిరుద్యోగ సమస్యలను రూపుమాపాతానని, ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తానన్నారు. పట్టబద్రుల అభ్యున్నతే నా ఎజెండాగా ముం దుకు సాగుతానని, ప్రైవేట్ ఉపాధ్యాయు లకు కనీస గౌరవ వేతనం అందేలా కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులకు స్వ యం ఉపాధి కల్పనతో పాటు విద్యారంగా అభివృద్ధికి పట్టబద్రుల సంక్షేమానికి కృషి చేస్తానని స్కాల ర్‌షిప్ బకాయిల విడుదలకు ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పిస్తానన్నారు. ప్రైవేట్ లెక్చరర్స్ ఉద్యోగులు నరేందర్‌రెడ్డికి మద్దతు పలికారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానిం చారు. ఈ కార్య క్రమంలో ఎర్రం శెట్టి మునిందర్, తానిపర్తి తిరుపతిరావు, జిల్లా ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్య క్షుడు వేముల కిరణ్, కాసర్ల మధుసూదన్ రెడ్డి, కందుల సునీల్, ముత్యం నరేష్, మద్దెల రామకృష్ణ, ఎంబడి దేవేందర్, తదితరులున్నారు.

### ఎమ్మెల్సీగా గెలిపిస్తే జిల్లా గ్రంథాలయ భవనా నిర్మాణానికి కృషి

రానున్న ఎమ్మెల్సీ పట్టబద్దుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే జిల్లా గ్రంథాలయానికి శాశ్వత భవన నిర్మా ణానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పట్టబద్రుల అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నా రు. జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అం తటి అన్నయ్యగౌడ్‌ను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను ఉద్యోగ నిలయాలుగా మారుస్తానని జిల్లా చైర్మన్ అ న్నారు. తన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని అన్నయ్య గౌడును నరేందర్‌రెడ్డి కోరారు. ఎర్రం శెట్టి మునిందర్, వేములకిరణ్, తదితరులున్నారు.

## ధాన్యం తూకంలో తేడా వస్తే సహించం

### పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ధాన్యం తూకం వేయడంలో తేడా వస్తే సహించేది లేదని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండలం, కందునూరిపల్లి, పట్ట ణంలోని సుగ్గంపల్లిలో ఐకెపి, సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారం భించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ ఎలాంటి ధాన్యం కటింగ్‌లు లేకుండా కొనుగోలు చేపించే బాధ్యత తనదేనన్నారు. ప్రతి గింజకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తా మ న్నారు. రైతులకు ఎక్కడ మోసం జరిగినా సహించేది చేసేది లేదని స్పష్టం చేశారు. గతంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలు వడ్ల కటింగ్ల పేరిట రైతులను నిలువునా ముంచారని ఆరోపించారు. మార్చి ఏప్రిల్ నెల లో వచ్చే అకాల వర్షాల వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని,డిసెంబర్ నెలలోనే నాట్లు వేసుకునే విధంగా నార్లు వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినుపల ప్రకాష్ రావు,సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మి రాజమల్లు,సింగల్ విండో చైర్మన్ శ్రీనివాస్,మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్, సాయిరి మహేందర్, రాములు,చిలుక సతీష్, వెగలం అబ్బయ్య గౌడ్, నాయకులు, కార్యకర్తలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

### అంతర్గతరోడ్లతో పట్టణాలు అభివృద్ధి

అంతర్గత రోడ్లు నిర్మించుకోవడం ద్వారా పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయని పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ పట్టణంలోని సుగ్గాంపల్లి (శ్రీరాములపల్లి)లో ప్యాకేజి 31,11వ వార్డుల్లో టియుఎఫ్ఐడిసి నిధులు 41,21,000/ రూపాయలతో సి.సి రోడ్ల నిర్మా ణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాలు మరింత అభివృద్ధి చెందాలంటే అంతర్గత రోడ్లు నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మి రాజ మల్లు, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ సిరిగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఇఒల ఆందోళనపై స్పందించిన ప్రభుత్వం

### సమస్యల పరిష్కారానికి వ్యవసాయ శాఖ సానుకూలత



**ప్రజాపక్షం/అక్కన్నపేట :** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎఇఒల ద్వారా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే నేప థ్యంలో నిరసన వ్యక్తం చేయడంతో పాటు విధుల్లో చేరకపోవడంతో పలువురి ఎఇఒలను ఉన్నతాధి కారులు స స్పెండ్ చేశారు. మిగతా వారు వి ధుల్లో చేరి యాప్‌లో పంటల నమోదు సర్వేతో వ్యవసా య విస్తరణ అధికారులు అధిక పని ఒత్తిడితో సతమవుతూ..సర్వేతో క్షేత్రస్థాయిలో ప్రాణాపాయ పరిస్థితులతో మహిళా ఎఇఒలకు భద్రత కొరవడిందని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధి ఎఇఒలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం హుస్నాబాద్ సమీకృత కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.ఈ మేరకు ఎఇఒల ఆందోళనపై ప్రజాపక్షం అక్కన్నపేట ప్రతినిధి 'మాకొద్దీ పనిభారం' అన్న శీర్షికన ప్రత్యేక కథనాన్నీ ప్రచురించింది. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఎఇఒలు) తో జరిపిన చర్చలు సఫలీకృతమవడంతో ఎట్టకేలకు పంటల నమోదు సర్వేలో పాల్గొనేందుకు ఎఇఒలు సుముఖత వ్యక్తం చేసినట్లు ఎఇఒ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. రైతు వేదికల నిర్వహణ సమస్యలను కూడా ప్రభుత్వం సత్వరమే పరిష్కరిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు హామీ ఇచ్చారని తెలిపారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** విద్యార్థిదశ నుండి క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రా జ మల్లు అన్నారు. పెద్దపల్లి జిల్లా స్థాయిఎస్‌జిఎఫ్ ఖోఖో క్రీడా పోటీలు ఆది వారం సుల్తానాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి.జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17బాల బాలికల ఖోఖో పోటీలలో పాల్గొ నేందుకు వచ్చిన క్రీడాకారులను సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తదితరులు క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమా నంగా తీసుకోవాలని, విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించి జిల్లాకు పలు పథకాలు సాధించాలన్నారు.పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు బహు మతులు ప్రదా నం చేశారు.పెద్దపల్లి పేట అధ్యక్షులు సురేందర్, కార్యదర్శి దాసరి రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ శౌరెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధుకర్, జోన్ కార్యదర్శులు మాధురి,ఫిజికల్ డైరెక్టర్స్ కేష్, భాస్కర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సాహితీవేత్తలను ప్రోత్సహించాలి : ప్రభుత్వ విప్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** సాహితీవేత్తలకు రచయితలకు ప్రోత్సాహమివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేములవాడ శాసనసభ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణ శివారులో గల జవహర్లాల్ నెహ్రూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఈశ్వర గారి ముక్తేశ్వరి ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన సాహితీ అవార్డుల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శ్రీమతి ముక్తేశ్వరి ఫౌండేషన్ వారు కేవలం సాహితీ రంగంలో వారిని గుర్తించి అవార్డులను ప్రదానం చేయడమే కాకుండా కరోనా నివారణకు వేములవాడ, హైదరాబాద్, కరీంనగర్ పట్టణంలో మెడిసన్ 40,000 మందికిపైగా ఉచితంగా పంపిణీ చేయడం తోపాటు వేములవాడ పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఆక్సిజన్ సిలిండర్లు పంపిణీ చేయడం అభినందనీ యమన్నారు. అనంతరం ఆయన సాహితీవేత్తలను సన్మానించారు. కథల సంపుటి విభాగంలో కొన్ని రచనలు ఎంపికైయినట్లు వాటికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను వారికి అందజేశారు. కవి మున్సిపల్ రచించిన 'గారెడివాడు', అమరావతి నీరజ రచించిన ఏడు రంగుల జెండా, వ్యాస సంపుటి విభాగంలో ఆడెపు లక్ష్మీ పతికి, మోహన్ రావు రచించిన నవల హృదయం, సంపుటి విభా గంలో డాక్టర్ నిట్టెల గోపాలకృష్ణ రచించిన 'గోమాత అద్భుత శక్తి', యోగా చార్య ఎస్ సంపత్ కుమార్ రచించిన సాగ్వాధి నిరోధిక గ్రంథం తదితర రచించిన వారికి ప్రత్యేక అవార్డులను, నగదు బ హు మతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ గారి ముక్తే స్వరి ఫౌండేషన్ ఫౌండేషన్ చైర్మన్ జవ హర్‌లాల్ నెహ్రూ విద్యాసంస్థల అధినేత శ్రీఈశ్వర్, నరహరి శర్మ అధ్యక్షత వహించా రు. అనంతరం నరహరి శర్మ గారిని విద్యా సంస్థలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఘనంగా శాలలతో పూలమాలలతో సత్క రించారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ పూర్వ న్యూస్ డైరెక్టర్ ఆర్ వి వి కృష్ణారావు తెలంగాణ పత్రిక తొలి సంపాదకులు అష్టకాల రామ్మోహన్ రావు, వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ న్యా యవాది మంగారి రాజేందర్, డాక్టర్ నమిలికొండ సునీత, బిఎస్ రాములు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## వనభోజనాలతో నూతనోత్సాహం



**ప్రజాపక్షం/ధర్మపురి:** దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు వ్యక్తిగత పనుల్లో లీనమై రోటీన్ జీవితం గడపాల్సి వస్తుందని, అప్పుడప్పుడు వనభోజనాలు లాంటి ఆటవిడుపు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకో వడం ద్వారా నూతనోత్సహం పొందవచ్చని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని దెహగం గణేష్, గాదె శ్రీనివాస్ నేతృత్వంలోని ఉపా ధ్యాయ బృందం ఆదివారం నేరేళ్ల సాంబశివ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్ర మానికి విప్ లక్ష్మ ణ్ కుమార్ హజరయ్యారు. నేటి కాలంలో వ్యక్తిగత పనులలో బందీలై ఒకరినొకరు కలుసుకోలేకపోతున్నారని ఫోన్‌లలో తప్ప ప్రత్యక్షంగా పలకరింపులకు సమయం కేటాయించలేకున్నారన్నారు. ప్రతి ఏటా ఇలా వనభోజన కార్యక్రమంతో అందరిని కలపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యాక్షులు ఎస్. దినేష్, వేముల రాజు, డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, డా. రామకృష్ణ, ఎస్‌ఐసి మేనేజర్ ఐ. రాంకిషన్, సారంగపూర్ ఎంఈవో బుగ్గారపు కిషోర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు సమాజానికి దిక్సూచిగా

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ :** మున్నూరు కాపులు సమాజానికి దిక్సూచిగా నిలబడాలని రాష్ట్ర ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి జిల్లా బందంపల్లిలో ఆదివారం మున్నూరు కాపు ఆత్మీయ స మ్మేళనం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ జడ్ పి చైర్మన్ పుట్ట మధు హాజరయ్యారు.ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరు కాపుల్లో విభేదాలు ఉన్నా పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని, ఆర్థికంగా, సామాజి కంగా, రాజకీయంగా మున్నూరు కాపులు మరింత బలోపేతం చెందాలని ఆకాంక్షించారు. కాపు కులాన్ని పటిష్ఠం చేస్తూ ఇతర కులాల ఆదరణతో రాజకీయంగా మరింత రాణించవచ్చనిఅభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం విప్ ఆదిశ్రీనివాస్, ఎంపి రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేపుట్ట మధులను సంఘం నాయకులు ఘనం గా సత్కరించారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు అనుమాల మహేష్, యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్, జిల్లా అధ్యక్షులు తొగరి సురేష్, నాయకులు, కాపు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పెద్దపల్లి మాజీ జెడ్‌పి చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ రాజకీయంగా కాపులు ఎదగకుండా కొన్ని వర్గాల వారు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాపులకు పిలుపునిచ్చారు. కాపులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట/గంబీరావుపేట:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గంబీరావుపేట మండలంలో రైతులు రోడ్లపైకి వస్తేకాని అధికారుల వద్ద చలనం కనబడటలేదని రైతులు చర్చించుకున్నారు. దీంతో రాజన్న సిరిసిల్లా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మీడియా వస్తున్న కథనాలు తెలుసుకుని వెంటనే స్పందించారు.అధికారులను అప్రమత్తం చేసి రైతుల సమస్యలు తెలుసుకుని వడ్ల కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వడ్ల కాంటాలు తెప్పించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. రైతులను శాంతింప చేసి అధైర్యపడవద్దని రైతులకు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు,రైతులు దన్యవాదాలు తెలియచేశారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యనాయక్,రెవిన్యూ అధికారులు వెంట ఉన్నారు.

## అన్నదాతల అరిగోస...రోడ్డెక్కిన రైతన్నలు

### ధాన్యాన్ని రోడ్డుపై పోసి రైతుల నిరసన



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయడం లేదని ఆదివారం రాజన్న సిరిసిల్ల మండలంలోని పదిర గ్రామం ప్రధాన రహదారి వద్ద రైతులు రోడ్డుపై వడ్లను పోసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టి రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వరిధాన్యం కొనుగోలు చేసేంతవరకు కదలబోమని రోడ్డుపై బైఠాయించారు.పాలకులు వరిధాన్యం కొంటామని చెప్పి కాంటాలు చేయకపోవడం పట్ల మండిపడ్డారు. ఆందోళనకు దిగిన రైతులను పోలీసులు సముదాయించి చెప్పగా విరమించారు. ప్రభుత్వ మొండి వైఖ రిని తప్పుబట్టారు. అన్ని తప్పుడు ప్రగల్బాలు పలుకుతూ మీడియాలో తప్పుడు ప్రచారం నిర్వహిస్తున న్నారన్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, పార్టీల కతీతంగా రోడ్డుపై నిరసనకు దిగారు. ధాన్యం కొనుగోలు చేయాలని 48 గంటల్లోగా అధికారులు చె బుతున్నా పట్టించుకోవడం లేదని తమ ఆవేదన వెల్లగక్కారు. రైసుమిల్లర్లకు, ప్రభుత్వానికి సరైన విధంగా సమన్వయ లోపంతోనే తమ ధాన్యం కొ నుగోలు జాప్యం జరుగుదుందని రైతులు చెప్పారు.ధాన్యం కొనక పోతే మాత్రం తమ నిరసన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల రైతు లందరు పాల్గొన్నారు. విషయం తెలుసుకుని వెంటనే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమ స్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

# ‘ఆసుపత్రి నిర్మాణం’ నిర్దేశిత గడువులో పూర్తి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

**ప్రజాపక్షం/మంచిర్యాల:** వచ్చే ఎన్నికల్లో మళ్ళీ తిరిగి కాంగ్రెస్ పార్టీ వంద సీట్లతో అధికారంలోకి రావడంతో పాటు మళ్ళీ సిఎంగా రేవంత్‌రెడ్డి కావడం ఖాయమని బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు తమ దుకాణాలు మూసుకోవాల్సిందేనని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మంచిర్యాల ఐబి స్థలంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పదవీవియోగం ఉందని బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చిలకజోస్యం చెప్పడం మానుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు కుటుంబ సమస్యలు లాంటివని తమ పార్టీ విషయంలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు ఏలెత్తిచూపాల్సిన అవసరం లేదని హితవు పలికారు. మంచిర్యాలలో 300 కోట్ల వ్యయంతో 650 పడకల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణం పనులు ఈ నెలాఖరులోగా ఆరంభం అవుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం నిర్ధేశిత గడువులో పూర్తి చేసి తీరుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఒకవేళ సకాలంలో నిర్మాణం జరిగితే ప్రతిపక్షాల నేతలు రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అని ప్రశ్నించారు. ఆసుపత్రి నిర్మాణంపై పెదవి విరుస్తున్న విపక్షాలకు అభివృద్ధితో బుద్ధి చెబుతానని అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక బిజెపి, బిఆర్‌ఎస్ రెండు పార్టీలు ఏకమయ్యాయని విమర్శించారు. రెండు పార్టీలు ఒక్కటవ్వలేదని కాణిపాకం గణపతి ఆలయంలో ప్రమాణం చేయాలని దారి ఖర్చులు కూడా తానే భరిస్తానని సవాల్ విసిరారు. మంచిర్యాల నియోజకవర్గంలో పంచాయితీరాజ్ శాఖ, ఆర్ అండ్ బి ద్వారా రహదారుల నిర్మాణంకు 70 కోట్ల రూపాయలు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. రైతు భరోసాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కొన్ని సవరణలు చేయడం వల్ల రైతు భరోసా విషయంలో జాప్యం జరిగిందని వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





**మంచిర్యాల జిల్లా కేంద్రాన్ని స్పోర్ట్స్‌హబ్‌గా మారుస్తాం**
**స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్...**
మంచిర్యాల జిల్లా కేంద్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు వెల్లడించారు.
ఆదివారం మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో 14 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్పోర్ట్స్ అథారిటి ఛైర్మన్ శివసేనారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 14 ఎకరాకల స్థలంలో రెండు ఎకరాలు నర్సింగ్ కాలేజీ కోసం మిగితా 12 ఎకరాలు ఇండోర్ స్టేడియం నిర్మాణంకు కేటాయిస్తామని అన్నారు. అందులో ఇండోర్ , అవుట్‌డోర్ గేమ్స్, స్మిమ్మింగ్ పూల్ నిర్మాణం జరుపుతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు తీసుకువచ్చి క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటి ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని అన్నారు. మంచిర్యాలను క్రీడల హబ్‌గా మార్చేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

# మంచిప్ప చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** మంచిప్ప దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వచ్చిన ఇద్దరు చెరువులో మునిగి మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు యువకులు మోపాల్ మండలంలోని మంచిప్ప దర్గాకు వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం సయ్యద్ యాకుబ్ (32), సయ్యద్ వాసిక్ (32) అనే ఇద్దరు యువకులు సరదాగా అక్కడే ఉన్న పెద్ద చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. నీటిలో దిగిన ఇద్దరు గల్లంతవ్వటంతో స్థానికులు గమనించి గాలించగా మొదట యాకుబ్ మృతదేహం లభించింది. అనంతరం పోలీసులకు సమాచారమందించగా రెస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకుని గాలించి వాసిక్ మృతదేహాన్ని బయటికి తీశారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన వాసిక్ కరాచీ బేకరిలో అకౌంటెంట్‌గా పని చేస్తుండగా, యాకుబ్ ఆటో మొబైల్ దుకాణంలో పని చేస్తున్నాడు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** ఆదివారం కంది మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్బంగా కొనుగోలు కేంద్రం వద్ద రైతుల సీరియల్ రిజిస్టర్ కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురాగానే రైతుల వివరాలు సీరియల్ ప్రకారం రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆ ప్రకారమే రైతుల ధాన్యం తూకం వేయాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూర్పార బట్టి యంత్రాలు ఆకాల వర్షాలకు ధాన్యం పడకుండా టార్పాలిన్లు సిద్దంగా ఉండాలన్నారు. తాడు, తప్ప చెత్త రాకుండా రైతులు తమ పంటలను కోత కోసే సమయంలో మిషిన్ ఆర్‌పిఎం ( రెవల్యూషన్ ఫర్ మినిట్ ) 18 కన్నా ఎక్కువగా ఆండేలా సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు. మిషిన్ ఆర్‌పిఎం 18 కంటే తక్కువగా ఉంటే పంట సరైన రీతిలో కోత కోబడకుండా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. మిషన్ ఆర్‌పిఎం సరైన విధంగా ఉండటం రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ధాన్యం తేమ శాతం 17 లోపు ఉన్నప్పుడే తూకం వేయాలని సూచించారు. అధిక తేమ ఉన్న ధాన్యం నాణ్యత కోల్పోతుందన్నారు. తూకం వేసిన దాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని మిల్లులకు తరలించగానే వివరాలను ట్యాబ్‌లో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్బంగా కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్బంగా జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, కలెక్టర్ వెంట ఉన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్ మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్దిదారులకు మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చెక్కులను అందజేశారు. శనివారం రాత్రి తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజీపూర్ మండలంలోని 22 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే 2,202,552 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్దిదారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు లబ్దిదారులకు చెక్కులను అందజేస్తుందని దీని వల్ల ఎంతో మంది నిరుపేద ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడానికి వారి తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, సంబంధిత అధికారులు, హాజీపూర్ మండల నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన విత్తనాలను మనమే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా రైతాంగం రబీ సీజన్ లో విత్తడానికి నాణ్యమైన శనగ విత్తనాలను అన్నీ ఆగ్రోస్ సెంటర్‌లలో అందుబాటులో ఉంచామని ప్రైవేటు విత్తన కంపెనీల ఉచ్చులో పడి మోసపోకుండా ఉండాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి సూచించారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ సెంటర్ ను సందర్శించి తెలంగాణ సీడ్స్ విత్తనాల అమ్మకం గురించి ఆరా తీశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థకు విత్తనాల కోసం, సాధారణ అమ్మకం కు సంబంధించి మధ్య దళారులను నమ్మకుండా ప్రత్యక్షంగా రైతులతోనే ఒప్పందం చేసుకొని రైతులను లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులను గ్రామాలకు పంపి రైతులకు మరింత అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తెలంగాణ సీడ్స్ రీజినల్ మేనేజర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్:** ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఈ రోజు బీర్నంది, గంగాపేట్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం మండల అధ్యక్షుడు నిమ్మల రమేష్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగిలి శంకర్,నిట్టరవి నాయయులు రామచందర్,లచ్చన్న,నాగన్న మల్లేష్,శ్రీను,బలరాం నాయక్,ఎపిఓ భోజన్న,సిసి రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,వి.డి.సి సభ్యులు,గ్రామ పంచాయతీ రైతులు, పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/కాగజ్ నగర్:** కాగజ్ నగర్ పట్టణ సర్సిల్క్ లోని ఎంఎల్‌ఎ నివాసంలో ఆదివారం సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు లబ్దిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామానికి చెందిన నలుగురికి మొత్తం రూ.1,01,000 విలువ గల చెక్కులను అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య శాఖకు సంబందించిన అన్ని అంశాలలో వంద శాతం పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి సమయపాలన పాటించాలని,అన్ని సబ్ సెంటర్, పిహెచ్సి,జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. రోజుకి రెండు పీహెచ్సీల వైద్య అధికారులతో, ఏఎన్‌ఎం,ఆశ వర్కర్లతో ఓపి గర్భిణీ నమోదు తదితర అంశాలలో మెరుగైన సేవలు అందేలా సమీక్షించాలని పేర్కొన్నారు. అలాగే పీహెచ్సీ వైద్య అధికారులు సబ్ సెంటర్ సిబ్బంది తో ఎప్పటికప్పుడు రివ్యూ చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల మీద ప్రత్యేక దృష్టి పెట్టి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల లో 1 సంవత్సరం నుండి 15 సంవత్సరాలు గల విద్యార్థులను ఆర్‌బిఎస్ కె టీం క్షుణ్ణంగా పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితుల పైన నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే సాధారణ ప్రసవాలు జరగాలని, ప్రయివేట్ ఆసుపత్రిలో అధిక సంఖ్య లో సి సెక్షన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీని పై వైద్య శాఖ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ గైనకాలజిస్ట్ డాక్టర్స్, సిబ్బందికి ప్రసూతి సేవలపై ఓరియంటేషన్ ఇచ్చి సాధారణ ప్రసవాలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. సబ్ సెంటర్, పీహెచ్సీ లా వారీగా వైద్య సేవలు మెరుగు పడాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు 100 శాతం ఎన్‌డిసి స్క్రీనింగ్ సేవలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌బిఎస్ కే వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ అమలు చేయాలన్నారు. ప్రతి పీహెచ్సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




# కోటాల్‌పల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయరూ!

రైతుల డిమాండ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** జిల్లాలోని ధర్పల్లి మండలంలోని కోటాల్‌పల్లి గ్రామంలో రైతుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరుంగాలం పండించిన పంటను కొనేందుకు ఇటు సొసైటీ అటు ఐకెపి సెంటర్ ప్రారంభించక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సమస్యను అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకున్నప్పటికీ మళ్లీ సమస్య మొదటికి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఐకెపి సెంటర్‌ను మంజూరు చేయటంతో రైతులు సంతోషం వ్యక్తం చేసిన అది పూర్తిగా నిలువకపోవటంతో మూడు నాళ్ల ముచ్చటగా మారిందని ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మా గోడును విని మాకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఐకెపి అధికారులు వారి సిబ్బంది వివాదాల్లో ఉండటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయని గతంలో సిరికొండ మండల పరిధిలోని కోటాల్‌పల్లి గ్రామం ప్రస్తుతం ధర్పల్లి మండల పరిధిలోకి వచ్చిన రైతులకు మాత్ర ఇబ్బందులు తప్పడం లేదని మారుమూల ప్రాంతం కావటంతో చరవాణిలో సిగ్నల్స్ కూడా ఉండవని అధికారులు నాయకులతో గోడును చెప్పుకుందామన్న లేని పరిస్థితి ఉందంటున్నారు.
ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్పందించి ఐకెపి సెంటర్‌ను మళ్లీ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్‌ను కోటాల్‌పల్లి రైతులందరం కలిసి ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద జరిగే అవకతవకల పట్ల అధికారులను కోరారు. గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద జరిగే అవకతవకల పట్ల అధికారులపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
**కొనుగోలు కేంద్రం వెంటనే ప్రారంభించాలి : రైతు, మాన్‌సింగ్**
కోటాల్‌పల్లిలో హోన్నాజీపేట్ సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు సెంటర్‌లో అమ్ముకునే వాళ్లం. మా గ్రామానికి ఐకెపి సెంటర్ కావలని జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకుంటే ఐకెపి సెంటర్ ఇచ్చారని, ఐకెపి అధికారుల అవకతవకలు జరగటంతో ఐకెపి సెంటర్ తీసీవేయటం జరిగింది. ఈసారి మా గ్రామంలో ఐకెపి సెంటర్ లేదా సొసైటీ ద్వారా సెంటర్ ప్రారంభించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నాం.

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బాన్సువాడ:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. ఆదివారం బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్, కొల్లూరు, నాగారం, బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు దరను పొందాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌ఛైర్మన్ అంబర్‌సింగ్, నాయకులు కృష్ణారెడ్డి, పిట్ల శ్రీధర్, మోహన్ నాయక్, నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్, డైరెక్టర్లు మోహన్ రెడ్డి, బండి సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులోనూ ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ఎన్నికల్లో ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలో దేవుళ్ల మీద ఓట్ల మీద ఓట్లు వేసి రేవంత్‌రెడ్డి వాటిని గట్టు మీద పెట్టేశాడని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఆదివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తానే పెద్ద నాయకుడిని అనుకుని ఎక్కడకు వెళితే అక్కడ హిందూ దేవుళ్ల మీద ఓట్లు పెట్టుకున్నాడని, మరి ఎందుకు ముస్లిం దేవుళ్ల మీద ఒట్టు పెట్టుకోలేదని ఎద్దేవా చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు తులం బంగారం ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. రైతులకు కనీసం కొనుగోలు కేంద్రాలు పెట్టరా నాయన అంటే అవి ఇప్పటికీ పెట్టడం లేదని ఒకపక్క కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రబుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో 468 కొనుగోలు కేంద్రాలు పెడుతామని చెప్పి నలబై కొబ్బరికాయలు కొట్టిన ప్రారంభించిన కొన్నిచోట్ల కూడా ధాన్యం కొనడం లేదని, ఇప్పటికే సగం ధాన్యం రైతులు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. ఐదు వందల బోనస్ పక్కన పెడితే 2 నుంచి 3 వందల నష్టానికి అమ్ముకునే పరిస్థితి రైతులకు వచ్చిందని, అసెంబ్లీ ఎన్నికల్లో రైతులు సపోర్టు చేసినందుకు ఇప్పుడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కులగణన పకడ్బంధీగా చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి, కార్పోరేటర్లు స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/శివ్వంపేట:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో దంతాన్ పల్లి, కొంతాన్ పల్లి, పోతులబోగూడ, ఉసిరికపల్లి పిల్లుట్ల గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డితో ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు అధైర్యపడొద్దని తడిసిన దాన్యాన్ని కూడ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆమె వివరించారు. కొనుగోలు కేంద్రాల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయొద్దని అధికారులను ఆమె ఆదేశించారు. ఈకార్యక్రమంలో తాజామాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ మన్సూర్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గౌరి వెంకట్ రెడ్డి, రైతుసమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు, సీఈఓ మధుయాదవ్, రమణగౌడ్, రాజశేఖర్ గౌడ్, గూడూరు యాదగౌడ్, శ్రీనివాస్, దేవలింగం, జగజీవన్ రెడ్డి, సంతోష్ కుమార్, రమేష్, అంజిరెడ్డి, స్వామి, కృష్ణారావు, పాల్గొన్నారు.

# ఏకలవ్య గురుకులంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

12 వరకు గడువు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** జిల్లాలోని ఇందల్వాయి ఏకలవ్య గురుకులంలో పని చేయుటకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన క్యాటరింగ్ అసిస్టెంట్ (1), మెస్ హెల్పర్ (2), సానిటేషన్ (1)(ఉమెన్), ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ (1) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. కేటగిరింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, మెస్ హెల్పర్, సానిటేషన్ కోసం 10వ తరగతి, ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ పోస్టుకు 10వ తరగతితో పాటు ఐటిఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అర్హులని, దరఖాస్తులను ఈనెల 12లోగా ఇందల్వాయిలోని ఏకలవ్య గురుకులంలో సమర్పించాలన్నారు. జిల్లాలో పదవ తరగతి పూర్తి చేసిన బోనఫైడ్‌గల అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. పూర్తి మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తామన్నారు. ఇవి పూర్తి తాత్కలిక పోస్టులని, రెగ్యులర్ ఉద్యోగుల నియామకం కోసం ఇదివరకే నోటిఫికేషన్ విడుదలైందని వీరి తొలగింపు ఎప్పుడైనా జరగవచ్చని తెలిపారు. దరఖాస్తు సమర్పణ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ 8397947334 ను సంప్రదించాలన్నారు.

# చెకుముకి సైన్స్ సంబరాలకు సన్నాహాలు

ఈ నెల 7 నుంచి షురూ...
జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహణ
అన్ని పాఠశాలలు పాల్గొనాలని డిఇఒ ఆదేశం

**ప్రజాపక్షం/ఎడపలి:** విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను బయటకు తీసి ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం చెకుముకి సైన్స్ సంబరాలు పేరిటా పోటీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్నీ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 202425 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సైన్స్ టీచర్ల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని అన్నీ యాజమాన్యాల పరిధిలోని 6 నుంచి 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు చెకుముకి సైన్స్ పరీక్షలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

**చెకుముకి సైన్స్ పోటీల వివరాలు...**
విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. నవంబర్ 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు డిసెంబర్ 1416 వరకు నిర్వహించనున్నారు. 6నుంచి 10వ తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలిన శాస్త్ర, సాంకేతిక అంశాలపై పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్ర స్థాయికి పంపుతారు. రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.ఒమర్ అలీ తెలిపారు. అన్నీ పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ దుర్గా ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోరారు.



క్రీడ

# పాయింట్స్ పట్టికలో రెండో స్థానానికి ఢమాల్

## డబ్ల్యుటిసి ఫైనల్స్‌కు టీమ్ఇండియా చేరేనా?

తాజాగా న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత్‌కు ఎదురైన ఓటమి ఇప్పుడు డబ్ల్యుటిసిలో మూడో సారి ఫైనల్‌కు చేరుకుందామనే ఆశలకు గండికొట్టేలా అనిపిస్తోంది. ఈ సిరీస్ ముందు వరకూ ఈ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోన్న టీమ్ఇండియా ఇప్పుడు ఈ ఓటమి వల్ల రెండో స్థానానికి దిగజారిపోయింది. దీంతో 62.50 శాతంతో ఆస్ట్రేలియా తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇక 58.33 శాతంతో భారత్ సెకండ ప్లేస్‌లో ఉంది. వీరి తర్వాత శ్రీలంక 55.56 పాయింట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. ఈ టెస్టు సిరీస్ గెలుపుతో కివీస్ 54.55 శాతంతో నాలుగో పొజిషన్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఐదవ స్థానాన్ని సౌతాఫ్రికా 54.17 శాతంతో చేరుకుంది.



**ఆ టూర్ భారత్‌కు వెరీ ఇంపార్టెంట్ :**

వరుసగా మూడు టెస్టుల్లో ఓటమి, ఇతర జట్లూ ముందుకు దూసుకురావడం వల్ల భారత్‌కు ఈ సారి కఠిన సవాళ్లు ఎదురవ్వనుంది. అయితే బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా టీమ్ఇండియా ఆసీస్‌తో ఐదు టెస్టుల్లో తలపడనుంది. డబ్ల్యుటిసి సైకిల్‌లో భారత్‌కు ఇదే చివరి సిరీస్ కూడా. ఈ క్రమంలో కనీసం 4 టెస్టుల్లో గెలిచి, మరొక దానిని డ్రాగా ముగించినా, లేకుంటే ఒక్కటి ఓడినా కూడా డబ్ల్యుటిసి ఫైనల్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారడం ఖాయమని క్రికెట్ విశ్లేషకుల మాట. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, సొంత గడ్డపై టీమ్ఇండియా ఘోర పరాభవం మూటగట్టుకుంది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టులోనూ ఓడి, స్వదేశంలో టెస్టుల్లో తొలిసారి వైట్‌వాష్‌కు గురైంది. న్యూజిలాండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 121 పరుగులకే కుప్పకూలింది. రిషభ్ పంత్ (64 పరుగులు) మినహా ఎవరూ రాణించలేదు. దీంతో భారత్ 25 పరుగుల తేడాతో ఓడింది. కివీస్ బౌలర్లలో అజాజ్ పటేల్ 6, గ్లెన్ ఫిలిప్ 3, మ్యాట్ హెన్రీ 1 వికెట్ పడగొట్టారు. కాగా, తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన కివీస్ తాజా విజయంతో 30తో ఈ సిరీస్ దక్కించుకుంది. లక్ష్యం చిన్నదే అయినప్పటికీ పిచ్ పూర్తిగా బౌలర్లకు సహకరించడం వల్ల పరుగులు రావడం కష్టమైంది. ఇన్నింగ్స్ ప్రారంభంలో కెప్టెన్ రోహిత్ శర్మ (11 పరుగులు) రెండు ఫోర్లు బాది ఊపుమీద కనిపించాడు. ఇక బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టే క్రమంలో భారీ షాట్‌కు ప్రయత్నించి క్యాచౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో 13 పరుగులకే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత శుభ్‌మన్ గిల్ (1) బంతిని అంచనా వేయడంలో విఫలమై క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కాసేపటికే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (1 పరుగు), యశస్వి జైస్వాల్ (5), సర్ఫరాజ్ ఖాన్ (1) పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో భారత్ 29 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది.

## 'ఓటమికి నాదే పూర్తి బాధ్యత

### స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయా'



న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను భారత్ 3–0 తేడాతో కోల్పోయింది. ఫలితంగా టీమ్ఇండియా స్వదేశంలో తొలిసారి టెస్టుల్లో వైట్‌వాష్ పరాభవాన్ని మూటగట్టుకుంది. వాంఖడే వేదికగా జరిగిన మూడో టెస్టులో 147 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 121 పరుగులకే ఆలౌటైంది. రిషభ్ పంత్ (64 పరుగులు) తప్ప, మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. అయితే ఈ ఓటమిపై టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ స్పందించాడు. బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్‌గానూ రాణించలేకపోయానని రోహిత్ అన్నాడు. 'ఈ ఓటమికి నేను పూర్తి బాధ్యత వహిస్తాను. నేను నా స్థాయికి తగ్గట్లుగా ఆడలేకపోయా. కెప్టెన్‌గా జట్టును నడిపించిన తీరు కూడా సరిగ్గా లేదు. నా కెరీర్‌లోనే ఇది అత్యంత పేలవ ప్రదర్శన. ఇలాంటి పరిస్థితుల్లో మేం బాగా ఆడలేకపోయాం. మేం సమష్టిగా రాణించడంలో విఫలమయ్యాం' అని రోహిత్ శర్మ అన్నాడు. ఇక త్వరలో ప్రారంభం కానున్న ఆస్ట్రేలియా సిరీస్‌పై దృష్టి పెట్టనున్నట్లు రోహిత్ పేర్కొన్నాడు. కాగా, ఈ సిరీస్‌లో రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. సిరీస్ మొత్తంలో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ సాధించాడు. అటు విరాట్‌ది కూడా ఇదే పరిస్థితి.

**అది తప్పే కానీ ఫీల్ అవ్వను**

ఛేజింగ్‌లో రెండు ఫోర్లు బాది టచ్‌లోకి వచ్చిన సమయంలో భారీ షాట్ ఆడి వికెట్ పారేసుకోవడంపై రోహిత్ స్పందించాడు. అది చెత్త షాట్ అని అంగీకరించిన రోహిత్ దానికి చింతించడం లేదని అన్నాడు. 'నేను చెత్త షాట్ ఆడి వికెట్ పారేసుకున్నా. కానీ, దానికి చింతించడం లేదు. ఎందుకంటే గతంలో అలా ఆడి నేను సక్సెస్ అయ్యాను. కానీ మా ప్రదర్శన మాత్రం స్థాయికి తగ్గట్లుగా లేదు. న్యూజిలాండ్ మా కంటే మంచి క్రికెట్ ఆడింది. ఇక రిషభ్ పంత్ ఎల్‌బీడబ్ల్యూ ఔట్ గురించి రోహిత్ మాట్లాడాడు. అయితే దానిపై క్లారిటీ లేదని చెప్పాడు. 'అక్కడ బంతి బ్యాట్‌ను తాకినట్లు కచ్చితమైన ఆధారం లేదు. అలాంటప్పుడు ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అంపైర్ నిర్ణయం సరైందా కాదా అనేది మాత్రం తెలియదు' అని అన్నాడు.

## భారత్‌పై బాల్ టాంపరింగ్ ఆరోపణలు

### అంపైర్‌పై ఇషాన్ కిషన్ ఫైర్

భారత్ 'ఎ' జట్టు రెండు అనధికార టెస్టుల కోసం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఈ జట్టుకు రుతురాజ్ గైక్వాడ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ పర్యటనలో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన అనధికార తొలి టెస్టు నాలుగో రోజు ఆటలో వివాదం జరిగింది. బంతిని మార్చాలన్న అంపైర్ నిర్ణయాన్ని టీమ్ఇండియా బ్యాటర్ ఇషాన్ కిషన్ తప్పుబట్టాడు. ఈ క్రమంలో ఫీల్డ్ అంపైర్ టీమ్ఇండియా ఆటగాళ్లను ఉద్దేశించి బాల్ టాంపరింగ్ ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. దీంతో మైదానంలోనే ఇషాన్ కిషన్ అంపైర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. బంతిపై రుద్దినట్లు కనిపించడం వల్ల భారత ఆటగాళ్లపై అంపైర్ క్రెయిగ్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. టీమ్ఇండియా ప్లేయర్లు అంపైర్ల మధ్య జరిగిన ఈ వాదనలు స్టంప్స్ మైక్స్‌లో రికార్డ్ అయ్యాయి. 'చర్చలకు తావులేదు. వెళ్లి ఆడండి. ఇక్కడ చర్చించుకునేందుకు కార్యక్రమం జరగడం లేదు' అని అంపైర్ భారత ఆటగాళ్లతో అన్నాడు. దీనికి ఇషాన్ ఘాటుగా రిప్లై ఇచ్చాడు. 'మేం ఇదే బంతితో ఆడాలా? మీ నిర్ణయం అత్యంత మూర్ఖత్వం' అని ఇషాన్ అన్నాడు. 'మీ కారణంగానే బంతి పాడైంది. నువ్వే (ఇషాన్‌ను ఉద్దేశించి) స్క్రాచ్ చేశావు. అందువల్లే బంతి మార్చాల్సి వచ్చింది' అని అంపైర్ వెల్లడించాడు.

**అలాంటిదేమీ లేదు**

అయితే ఈ మ్యాచ్‌లో ఎలాంటి బాల్ టాంపరింగ్ జరగలేదని క్రికెట్ ఆస్ట్రేలియా క్లారిటీ ఇచ్చింది. బంతి పూర్తిగా చెడిపోయిన కారణంగానే అంపైర్లు మార్చినట్లు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని రెండు జట్ల కెప్టెన్లకు తెలియజేశారని సమాచారం. అయితే అంపైర్‌తో ఇషాన్ వాదనలు స్టంప్స్ మైక్‌లో రికార్డ్ అవ్వడం వల్ల ఇది చర్చనీయాంశమైంది. ఇక ప్లేయర్లపై తదుపరి ఎలాంటి చర్యలు ఉండవని జరగలేదని క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. కాగా, ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఎ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. భారత్ ఓడింది. టీమ్ఇండియా నిర్దేశించిన 225 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇక ఇరుజట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా నవంబర్ 7న ప్రారంభం కానుంది.




రీల్

## హీరో ఎస్‌కె కెరీర్‌లోనే రికార్డు !

తమిళ హీరో శివ కార్తికేయన్ నటించిన బయోపిక్ 'అమరన్'. ఈ సినిమా మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితకథ ఆధారంగా తెరకెక్కింది. రాజ్ కుమార్ పెరియస్వామి డైరెక్ట్ చేసిన ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటించి మెప్పించింది. మొత్తానికి బయోగ్రాఫికల్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ సినిమా దీపావళికి మంచి హిట్ ఫిల్మ్ గా నిలిచింది. ఆ హిట్ కి తగ్గట్టుగానే బాక్సాఫీస్ వద్ద కూడా మంచి కలెక్షన్లను సాధిస్తోంది. ఈ క్రమంలోనే అమరన్ విడుదలైన మూడు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం విశేషం. పైగా శివకార్తికేయన్ కెరీర్‌లోనే అత్యంత వేగవంతంగా ఈ సినిమా భారీ వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది. ఇటు తెలుగులో కూడా ఈ సినిమాకి మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. ఈ ఫీల్ గుడ్ ఎమోషనల్ చిత్రాన్ని చూసేందుకు తెలుగు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా థియేటర్లకు వెళ్తున్నారు. ఇప్పుడున్న బాక్సాఫీస్ అప్ డేట్స్ ను బట్టి, రానున్న రోజుల్లో ఈ సినిమా ఇంకా సాలిడ్ కలెక్షన్స్ ను రాబట్టే అవకాశం ఉంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమాకి సి.హెచ్. సాయి సినిమాటోగ్రఫీ అందించారు. ఉలగనాయగన్ కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ సినిమాని నిర్మించారు.




## కంప్లీట్ ప్యాకేజ్ ఎంటర్టైనర్‌లా 'ధూం ధాం' ట్రైలర్

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో హీరోయిన్లు చేతన్ కృష్ణ అలాగే హెబా పటేల్ లు జంటగా దర్శకుడు మచ్చ సాయి కిషోర్ తెరకెక్కించిన లేటెస్ట్ అవైటెడ్ సినిమానే ధూం ధాం. మరి మొదటి నుంచి కూడా ఒక సాలిడ్ ఎంటర్టైనర్ లా ప్రామిసింగ్ కంటెంట్ తో అలరిస్తూ వచ్చిన ఈ సినిమా నుంచి మేకర్స్ ఇపుడు ఫైనల్ గా ట్రైలర్ కట్ ని రిలీజ్ చేశారు. మరి ఈ ట్రైలర్ అయితే చూసేందుకు ఒక కంప్లీట్ ప్యాకేజ్ లా ఎంటర్టైనింగ్ గా ఉందని చెప్పొచ్చు. మరి వెన్నెల కిషోర్ పై సీన్స్ తో మొదలై మంచి ఎంటర్టైనింగ్ గా అనిపించింది అని చెప్పాలి. అలాగే హీరో చేతన్ కూల్ లుక్స్ లో హెబాతో కలిసి వేసిన స్టెప్స్ బాగున్నాయి. ఇంకా మంగ్లీ సాంగ్ విజువల్స్ కూడా సినిమాలో సెలబ్రేషన్ లా కనిపిస్తున్నాయి. ఇక వీటితో పాటుగా నటుడు సాయి కుమార్ పై కొన్ని సీరియస్ సీన్స్ తో సినిమాలో ఇంట్రెస్టింగ్ టర్నింగ్ పాయింట్స్ కూడా ఉన్నట్టు కనిపిస్తుంది. అలాగే దీనితో పాటుగా గోపి సుందర్ ఇచ్చిన స్కోర్ ట్రైలర్ లో బాగుంది. ఇలా ఓవరాల్ గా అన్ని ఎలిమెంట్స్ తో మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ లా ఈ సినిమా ట్రైలర్ అనిపిస్తుంది. ఇక ఈ నవంబర్ 8న వస్తున్న సినిమా కూడా ఇదే రేంజ్ లో ఉంటుందో లేదో చూడాల్సిందే.




## సాలిడ్‌గా 'లక్కీ భాస్కర్' వసూళ్లు

మోలీవుడ్ యంగ్ హీరో ఇపుడు టాలీవుడ్ హీరో అయినటువంటి దుల్కర్ సల్మాన్ హీరోగా మీనాక్షి చౌదరి హీరోయిన్ గా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన సాలిడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం లక్కీ భాస్కర్. మరి మంచి బజ్ నడుమ ఈ దీపావళి రేస్ లో వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకోవడమే కాకుండా సాలిడ్ వసూళ్లు కూడా అందుకుంది.ఇలా ప్రస్తుతం మూడు రోజుల రన్ ని పూర్తి చేసుకుంది. ఇలా మొదటి మూడు రోజుల్లోనే 40 కోట్ల మేర గ్రాస్ ని వరల్డ్ వైడ్ గా అందుకున్నట్టుగా ఇపుడు కన్ఫర్మ్ అయ్యింది. అయితే ఒక్క తెలుగు సహా ఇతర రాష్ట్రాల్లోనే కాకుండా లక్కీ భాస్కర్ ఓవర్సీస్ మార్కెట్ లో కూడా మంచి నంబర్స్ సాధిస్తుంది. అలా ఈ సినిమా ఇపుడు నార్త్ అమెరికాలో మిలియన్ మార్క్ ని ఇంకా వీకేండ రన్ పూర్తి కాకుండానే కంప్లీట్ చేసుకోవడం విశేషం. దీనితో అక్కడ కూడా ఈ సినిమా స్ట్రాంగ్ రన్ తో దూసుకెళ్తుంది అని చెప్పాలి.

# లండన్ పర్యటనకు మంత్రి జూపల్లి కృష్ణారావు

## వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో పాల్గొనేందుకు..

ప్రజాపక్షం/హైదరాబాద్:పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ఉదయం లండన్ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేయడం, పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటక రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి జూపల్లి ఇంగ్లాండ్ పర్యటన కొనసాగనుంది. పర్యటనలో భాగంగా లండన్ లో జరిగే ప్రతిష్టాత్మక వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటిఎం) లో మంత్రి జూపల్లి పాల్గొంటారు. అద్భుతమైన ప్రదేశాలు, చరిత్ర, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిసే విధంగా ఈ వరల్ ట్రావెల్ మార్కెట్ లో తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్ ను ఏర్పాటు చేయనుంది. ఆయా దేశాల పర్యాటక శాఖ మంత్రులు, విదేశీ ప్రతినిధులు, గ్లోబల్ టూరిజం బోర్డులు, హోటళ్ల యజమానులు, ప్రయాణ, ఆతిధ్య రంగ నిపుణలతో మంత్రి జూపల్లి భేటీ కానున్నారు. రాష్ట్రంలో పర్యాటక, ఆతిధ్య రంగంలో పెట్టుబడుల అనుకూలతల గురించి చర్చించనున్నారు. లండన్ లోని కాసిల్ గ్రీన్ లో నిర్వహించే తెలంగాణ పర్యాటక రోడ్ షో లోనూ మంత్రి జూపల్లి పాల్గొంటారు. లండన్ వేదిక నవంబర్ 5 7 తేదీలలో వరకు మూడు రోజుల పాటు వరల్డ్ ట్రావెల్ మార్ట్ జరగనుంది. ఈ ట్రావెల్ మార్ట్ లో 100కుపైగా విదేశీ ప్రతినిధులు, మన దేశం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తో పాటు ఆయా రాష్ట్రాల పర్యాటక శాఖ మంత్రులు, అధికారులు ఈ మార్ట్ లో పాల్గొననున్నారు.



## అనుమతులు లేకుండానే సీతారామ ఎత్తిపోతల.. పథకానికి టెండర్లు ఎలా పిలుస్తారు?

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు అనుమతులు లేకుండానే టెండర్లు ఎలా పిలుస్తారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. కోటి ఎకరాలకు నీరందిస్తున్న కాళేశ్వరంపై కమిషన్ వేశారని, ఇప్పుడు మీపై ఏ కమిషన్‌తో విచారణ చేయించాలని ప్రశ్నించారు. మత్స్యకారుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టి కొట్టిందని, రాష్ట్రంలో 20 వేల టన్నుల మత్స్య సంపద దిగుబడి తగ్గడంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆదివారం కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ప్రభుత్వం మారితే పథకాల పేర్లు మారుతాయని, కానీ కాంగ్రెస్ పాలనలో పథకాలే నామరూపాలు లేకుండాపోయాయన్నారు. మూ సీ మురికిలో రూ.కోట్లు కుమ్మరించడంపై ఉన్న ప్రేమ, జలాశయాల్లో చెపలను వదలడంలో లేదన్నారు. ఉపాధి లేక బోసిపోయిన బెస్తవాడలపై, వారి దీన స్థితిపై ప్రభుత్వానికి కనీసం పట్టింపు లేదన్నారు.

# అనధికార లేఔట్‌ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపేయలేదు



ప్రజాపక్షం/హైదరాబాద్ : హెచ్ఎండిఏ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అనధికార లేఔట్‌లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిషేధించినట్లు వార్తలు వచ్చాయని, ఇలాంటివి ప్రజలు నమ్మవద్దని అధికారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి, గత ఏడాది కాలంగా, హెచ్ఎండిఏ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖకు ఎలాంటి అభ్యర్థనను పంపలేదన్నారు. గ్రామ పంచాయతీలలో అనధికార లేఔట్‌ల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని స్పష్టం చేశారు. ఈ నివేదికలు పూర్తిగా నిరాధారమైనవని, సత్యానికి దూరంగా ఉన్నాయన్నారు. ఇలాంటి నిరాధారమైన పుకార్లకు నమ్మకం కలిగించవద్దన్నారు.

## ఒంటి పూటే బడి

(మొదటి పేజీ తరువాయి)

టీచర్లకు మినహాయింపు ఇవ్వనున్నారు. సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్లానింగ్ డిపార్ట్మెంట్ వేతనాలు చెల్లించనుంది.

**75 ప్రశ్నలతో సర్వే**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో మొత్తం 75 ప్రశ్నలు ఉండనున్నాయి. దీనికి అనుగుణంగా సమాచారం సేకరించాల్సి ఉంటుంది. ఇందులో 56 ప్రధాన ప్రశ్నలు ఉండగా, మరో 19 అనుబంధ ప్రశ్నలుంటాయి. పార్ట్ 1. పార్ట్ 2 గా ఉండే పత్రం మొత్తం 8 పేజీలతో ఉండనుంది. పార్ట్ 1 కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలు పూరించాలి. అంటే విద్యా, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలు, వలసలు, రాజకీయ సమాచారం ఉంటుంది. పార్ట్2లో కుటుంబ విరాలు సేకరిస్తారు. ఇందులో మొత్తం 17 ప్రశ్నల్లో 7 ప్రధాన ప్రశ్నలు ఉండనుండగా, మిగిలినవి అనుబంధ ప్రశ్నలుగా ఉంటాయి. సర్వేకు సంబంధించి ప్రభుత్వం ద్వారా విడుదలైన స్టిక్కర్‌ను ఇంటికి అంటిస్తారు.

ప్రశ్నాపత్రాన్ని దగ్గరుంచుకుంటే సులువు /// ఈ సర్వే సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, కుల,రాజకీయ సమాచారాన్ని సిబ్బంది సేకరిస్తారు. ఇందుకోసం నెట్లో దొరికే ప్రశ్నాపత్రాన్ని అందరూ సేకరించుకుని ముందుగానే చదివి పెట్టుకుంటే మంచిది. ముందుస్తుగా ఇంటి వద్దే ఒక ఫాం పూర్తి చేసుకుని పెట్టుకుంటే చెప్పడానికి సులువుగా ఉండటంతో పాటు సిబ్బంది పని త్వరిగత గతిన పూర్తి చేసేందుకు వీలుంటుంది. ఆధార్‌కార్డు, భూములు ఉంటే ధరణి పాస్ పుస్తకాలు, విద్యార్హత ధృవీకరణపత్రాలు, రేషన్ కార్డు వివరాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఉద్యోగ,ఉపాధి వివరాలు, కుటుంబ సభ్యులకు చెందిన ఆధార్ కార్డులు దగ్గర పెట్టుకుంటే సరిపోతుంది. సర్వేకి వచ్చే సమయంలో ఇంటి వద్ద యజమానికి లేకున్నా ఈ వివరాలతో కూడిన పత్రాన్ని పూర్తి చేసి ఆధారం కోసం ధృవీకరణ పత్రాలన్నింటినీ సిద్ద ం చేసుకుంటే సర్వే సిబ్బంది వాటిని సరిపోల్చుకుని సులువుగా పని పూర్చి చేసుకునేందుకు వీలవుతుంది. ఇందిలా ఉండగా సిబ్బంది ఎలాంటి ఫొటోలు గానీ, పత్రాలు గానీ తీసుకోరు. కేవలం ఇంటి వారు చెప్పిన వివరాలను మాత్రమే సేకరిస్తారు. వివరాలు తెలియజేసే సమయంలో ఖచ్చితత్వాన్ని పాటించాల్సి ఉంటుంది. ఈ సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో అన్ని పథకాలకు సంపూర్ణంగా ఉపయోగపడనుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.

## నిర్వహణ లోపం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. గ్రీన్ సిగ్నల్ పడగానే టైమర్ స్టార్ట్ అవుతుంది. అలాగే రెడ్ సిగ్నల్ పడగానే ఎన్ని సెకన్‌లలో తిరిగి గ్రీన్ సిగ్నల్ పగుతుందో తెలిపేందుకు టైమర్ వాహనదారులకు ఎంతగానే ఉపయోగపడుతుంది. కొన్ని జంక్షన్‌ల వద్ద రెండు నిముషాల సేపు ఆగాల్సి ఉటుంది. అలాంటి సమయంలో వాహనదారులకు టైమర్ చాలా ముఖ్యం. గ్రీన్ సిగ్నల్ పడేందుకు ఎంత టైమ్ ఉందో తెలిస్తే తన వాహనాని స్టార్ట్ చేసుకోవాలా లేక ఆఫ్ చేసుకోవాలని వాహనదారుడు నిర్ణయించుకునే సదుపాయం ఉంది. అయితే టైమర్లు పనిచేయకపోవడం వల్ల వాహనదారులు ఏ క్షణంలో గ్రీన్ సిగ్నల్ పడుతుందో, ఏ క్షణంలో రెడ్ సిగ్నల్ పడుతుందో తెలియక తికమక పడుతున్నారు. గ్రీన్ సిగ్నల్ పడిన సమయంలో జంక్షన్ దాటేందుకు వాహన దారుడు తమ వాహనాల స్పీడ్‌ను పెంచుతాడు. ఆ సమయంలో సడన్‌గా రెడ్‌సిగ్నల్ పడడం, అతను వాహనానికి సడన్‌బ్రేక్ వేయడం, ఇదితెలియని వెనకాల వచ్చే వాహనం అదుపు తప్పి ఢీ కొట్టడం జరుగుతున్నాయి. అదే టైమర్ ఉంటే రెడ్ సిగ్నల్ పడేందుకు కొన్ని సెకన్‌లు మాత్రమే ఉందని తెలిస్తే వాహనదారుడు తన వాహన స్పీడ్‌ను తగ్గించి జీబ్రా లైన్ వద్ద తన వాహనాన్ని ఆపేసుకుంటాడు. తన వెనకాల వచ్చే వాహనాలకూడా అతడు వాహనాలను ఆపాలంటూ చేయి చూపిస్తాడు.

**ఆ జంక్షన్‌లకు ఏకకాలంలో ఒకే సిగ్నల్ పడాలి..**

హైదరాబాద్‌లో కొని జంక్షన్‌లలో వెనువెంటనే వచ్చే జంక్షన్‌లు ఉన్నాయి. ఇలాంటి రెండేసిగా వచ్చే జంక్షన్‌లలో గ్రీన్, రెడ్ సిగ్నల్స్ ఒకేసారి పడాలి. అలాంటప్పుడు మొదటి జంక్షన్ దాటిన వాహనాలు రెండో జంక్షన్ కూడా దాటేందుకు వీలు కలుగుతుంది. అయితే ఇలాంటి జంక్షన్‌లలో మొదటి జంక్షన్, రెండో జంక్షన్‌లో సిగ్నల్స్ వ్యతిరేక దిశలో పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మొదటి జంక్షన్‌లో గ్రీన్ సిగ్నల్ పడగానే జంక్షన్ దాటగానే.. క్షణాల్లో వచ్చే మరో జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ పడడంతో వాహనాలు ఆగిపోవాల్సి వచ్చింది. ఇలా రెండు జంక్షన్‌లలో వెనువెంటనే వాహనాలను ఆపడంతో వాహనదారులు బేజారవుతున్నారు. అదే రెండు జంక్షన్‌లలో ఒకేరకమైన సిగ్నల్ పడేటట్లు ఏర్పాటు చేసుకుంటే వాహనదారులు సాఫీగా రెండు జంక్షన్‌లను దాటుకుని పోయే వీలుంటుంది. ఇక రాత్రివేళ్లలో సిగ్నల్స్ సమయపాలనను మార్చాల్సిన అవసరం ఉంది. పగటిపూట రద్దీగా ఉండే ప్రాంతాలలో సిగ్నల్స్ సమయం పెంచవచ్చు. రాత్రి వేళ్లల్లో కొన్ని రహదారులపై వాహనరాకపోకలు తక్కువగా ఉంటాయి. అలాంటి జంక్షన్‌లలో రెడ్ సిగ్నల్ సమయం పెంచడం వల్ల మిగతా మూడు వైపుల వాహనదారులు గ్రీన్ లైట్ కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. అలాకాకుండా రద్దీ లేని రహదారివైపు గ్రీన్ సిగ్నల్ టైమ్ తక్కువగా ఇచ్చి రద్దీ ఉన్న వైపు గ్రీన్‌సిగ్నల్ సమయం పెంచడం వల్ల వాహనాలు ఎప్పటికప్పుడు సాఫీగా జంక్షన్‌ను దాటేందుకు వీలుకలుగుతుంది. ఏఏ జంక్షన్‌లో ఈ సమస్య ఉందో అధికారులు అధ్యాయనం చేసి పరిష్కారం చూపించాలి.

**క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించాలి..**

ఇప్పటికైనా హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు తమ పరిధిలోని జంక్షన్‌లను పర్యవేక్షించాలి. ఏఏ జంక్షన్‌లో ఏఏ పొరపాట్లు ఉన్నాయో తెలుసుకుని సరిదిద్దే చర్యలు తీసుకోవడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉటుంది. ట్రాఫిక్ అధికారులు తమను పనిష్మెంట్ కింద పోస్టింగ్ ఇచ్చారనే దృక్పదాన్ని మార్చుకుంటే ఇది సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించాలి. స్థానిక ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ఆయా జంక్షన్‌ల పరిస్థితిపై అధ్యాయనం చేయాలి. తద్వారా రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను గాడిలో పెట్టేవీలుంటుంది.

## జార్ఖండ్‌లో 'యుసిసి' ప్రవేశపెడతాం

(మొదటి పేజీ తరువాయి)

జరుపుతామని అమిత్ షా హామీ ఇచ్చారు. పేపర్ లీకేజీకి పాల్పడినవారిని జైలుకు పంపుతామని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు, గనుల కారణంగా నిర్వాసితులైన ప్రజలకు పునరావాసం కోసం కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సర్వామతపరమైన కోడ్ అంశంపై చర్చించి, తగిన నిర్ణయం తీసుకుంటామని అమిత్ షా హామీ ఇచ్చారు. దేశంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చే ఏకైన రాజకీయ పార్టీ బిజెపినేనని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. మ్యానిఫెస్టో విషయంలో ఇతర పార్టీల కన్నా బిజెపి భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను విస్మరించకుండా నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వ హయాంలో జార్ఖండ్‌లోని గిరిజనులకు భద్రత లేదని విమర్శించారు. సంతాల్ పరగణాలో గిరిజనుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోందని ఆరోపించారు. 'చొరబాటుదారులు ఝార్ఖండ వచ్చి ఆడబిడ్డలను ప్రలోభపెట్టి పెళ్లి చేసుకుంటున్నారు. ఇలాంటి వాటిని ఆపకపోతే జార్ఖండ్ సంస్కృతి ప్రమాదంలో పడుతుంది. అలాగే ఆడబిడ్డలకు భద్రత ఉండదు. రాష్ట్రంలో ఈ ఎన్నికలు కేవలం ప్రభుత్వాన్ని మార్చేవే కావు. రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఎన్నికలు. చొరబాటుదారులు, అవినీతిని ప్రోత్సహించే ప్రభుత్వం కావాలా? అభివృద్ధి, సరిహద్దులను కాపాడే మోదీ నేతృత్వంలోని బిజెపి సర్కార్ కావాలా? బిజెపి ప్రభుత్వం త్వరలో ఏర్పడుతుంది. చొరబాటుదారులను తరిమికొడతాం. అందుకు కొత్త చట్టాన్ని తెస్తాం. మహిళల నుంచి లాక్కున్న భూమిని తిరిగి వారికి ఇచ్చేస్తాం. రాష్ట్ర మహిళలకు భద్రత కల్పించడంలో హేమంత్ సోరెన్ విఫలమయ్యారు' అని అమిత్ షా ఆరోపించారు.

**రాష్ట్ర ప్రజలు బిజెపి హామీలను నమ్మరు : జెఎంఎం**

మరోవైపు, బిజెపి మ్యానిఫెస్టోపై జెఎంఎం పార్టీ విమర్శలు గుప్పించింది. 'కాషాయ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రజలు నమ్మరు. గతంలో బిజెపి పాలనను రాష్ట్ర ప్రజలు చూశారు. వారి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదు. మహిళల అక్రమ రవాణా కూడా పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి బొగ్గు రాయల్టీని ఇంకా ఇవ్వలేదు' అని జెఎంఎం నాయకురాలు మహువా విమర్శించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com